• చేతిలో రాజ్యాంగం

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

శుక్రవారంFRIDAY 13.9.2024

హైదరాబాద్ HYDERABAD


సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 99 ‖ వెల (Price) రూ.6.50

పేజీలు: 12+6/4 Pages: 12+6/4

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

శుక్రవారం, సూర్యోదయం: 6-04, సూర్యాస్తమయం: 6-20. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: దశమి రాత్రి 10-30 వరకు. నక్షత్రం: పూర్వాషాఢ రాత్రి 9-36 వరకు. వర్జ్యం: ఉదయం 7-22 నుంచి ఉదయం 8-57 వరకు, పునర్ వర్జ్యం: తెల్లవారుజామున 5-15 నుంచి మర్నాడు ఉదయం 6-47 వరకు. రాహుకాలం: ఉదయం 10-40 నుంచి పగలు 12-11 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-31 నుంచి ఉదయం 9-20 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-36 నుంచి పగలు 1-25 వరకు. అమృతకాలం: సాయంత్రం 4-50 నుంచి సాయంత్రం 6-25 వరకు. ఉత్తరా కార్తె ఉదయం 9-34 గంటలకు.



• చేసేది రౌడీయిజం





• కౌశిక్ ఇంటిమీదికి కాంగ్రెస్ రౌడీ మూక



• మాజీ మంత్రులపైకి ఎగిసిన ఖాకీ



కాంగ్రెస్ గూండారాజ్!

ఎమ్మెల్యే గాంధీ గూండాయిజం.. కౌశిక్‌రెడ్డి ఇంటిపై మూక దాడి.. పోలీసుల సమక్షంలోనే విధ్వంసకాండ

కౌశిక్‌ను హౌజ్ అరెస్టు చేసి 'సహకారం'.. ఫ్యాక్షనిస్టుల తరహాలో 20 వాహనాల కాన్వాయ్‌తో రౌడీ దండు

పోలీసులను అరగంట దాకా అటు వెళ్లొద్దన్న పెద్దలు?.. కౌశిక్‌కు మద్దతుగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ నేతలు

పోలీసు కమిషనరేట్‌లోనే వారిపై దౌర్జన్యం.. గాంధీకేమో స్టేషన్ బెయిల్.. బీఆర్‌ఎస్ నేతలకేమో అరెస్టులు

పోలీసుల తోపులాటలో హరీశ్ భుజానికి తీవ్రగాయం.. కౌశిక్‌పై దాడి రేవంత్ కుట్ర: కేటీఆర్ ధ్వజం

ఛీ... ఛీ...

కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన గాంధీ ఇంట్లో నేడు బీఆర్‌ఎస్ విస్తృత భేటీ

జిల్లావ్యాప్తంగా నేతల హాజరు

కౌశిక్, ఆర్‌ఎస్ ప్రవీణ్ ప్రకటన

తెలంగాణవ్యాప్తంగా అర్ధరాత్రి బీఆర్‌ఎస్ శ్రేణులు, నేతల అరెస్టు

బీఆర్‌ఎస్ నేతలకు మద్దతుగా తిరగబడ్డ ప్రజానీకం.. పోలీసుల లాఠీచార్జ్



బీఆర్‌ఎస్ నేతలను విడుదల చేయాలంటూ పోలీస్ స్టేషన్ ముందు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగిన ప్రజానీకం.



బీఆర్‌ఎస్ నేతలను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్న ప్రజలపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

నెత్తురు సలసల మరిగే దృశ్యం. ఏం జరుగుతున్నది తెలంగాణలో..!

ఎవడు తెచ్చిన రాజ్యంలో ఎవడు అధికారం చెలాయిస్తున్నడు? తెరముందు బొమ్మ ఎవరు? తెర వెనుక నడిపిస్తున్నదెవరు?

ఎవరి దోపిడీ వద్దని స్వరాష్ట్రం తెచ్చుకున్నామో వాళ్లే మన మీద గూండాగిరి. తెలంగాణ గుండెకాయ మీద పట్టపగలు గూండాల స్వైరవిహారం. అధికారం మోకరింపు!

ఎమ్మెల్యే ఇంటి మీద దాడికి 'అరగంట అటువైపు వెళ్లకుండా' ఆదేశాలట! పరాయి గూండాలకు రాచమర్యాదలట. న్యాయం అడిగిన భూమిపుత్రుల ఈడ్చివేతట. గత పదేండ్లలో ఏనాడన్నా ఇలాంటి దృశ్యాలు చూశామా? ఇక్కడ భూమిపుత్రుడి మీద చెయ్యెత్తినోడున్నడా? తెలంగాణ మీద నోరెత్తినోడున్నడా? సాక్షాత్తు ఎమ్మెల్యే అయిన తెలంగాణ బిడ్డ మీద బూతు పురాణమా? ఏకంగా ఇంటి మీద దాడికి తెగింపా?

ఎవరిచ్చిన అలుసు? ఎవరు రాసిన స్క్రిప్టు? ఎటు పోతున్నం? రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నడుస్తున్నదా? ఫ్యాక్షనిస్టు ప్రభుత్వం నడుస్తున్నదా? ఇమేజ్ పెంచడానికి పీఆర్ స్టంట్లు. విపక్షాలను అణచివేయడానికి దాడులు! నల్లగొండలో దాడి.. ఖమ్మంలో దాడి.. సిద్దిపేటలో దాడి. ఇప్పుడు హైదరాబాద్‌లో దాడి.. ప్రతిపక్షాన్ని భయపెట్టి నోరు మూయించే యత్నం. దాడులతో భీతావహులను చేసే కుట్ర. ఎవరు చురుగ్గా ఉంటే వారిని టార్గెట్ చేసే ఫ్యాక్షన్ రాజకీయం ఇపుడు తెలంగాణలో అమలు చేస్తున్నట్టున్నది. ..కానీ మహామహా పర్వతాలనే ఢీ కొట్టిన ఉద్యమ పార్టీకి ఈ పిపీలికాలు, పీఆర్‌గాళ్లు ఓ లెక్కా?

• గంటలతరబడి పోలీస్ వాహనాల్లో బీఆర్‌ఎస్ నేతలు
• హైదరాబాద్ నుంచి రంగారెడ్డి జిల్లాకు తరలింపు
• రోడ్లపై పండుకొని వాహనాలను అడ్డగించిన జనం
• తలకొండపల్లిలో పోలీసు వాహనాల టైర్లకు నిప్పు
• కేశంపేట స్టేషన్ సమీపంలోనే హోరెత్తిన నిరసన
• రేవంత్‌రెడ్డీ ఖబర్దార్, సీఎం డౌన్ డౌన్.. నినాదాలు
• గులాబీ శ్రేణులు, సానుభూతిపరులపై లాఠీచార్జ్
• ప్రజా ఆందోళనకు తలొగ్గిన పోలీసు అధికారులు
• రాత్రి 11:30కి బేషరతుగా బీఆర్‌ఎస్ నేతల విడుదల

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గుండెపై కిరాయి గూండాల దాడి! పరాయినోళ్ల నుంచి పచ్చిబూతులు! హుజూరాబాద్ గడ్డపై పుట్టినోడు లోకల్ కాదట. ఎక్కడినుంచో వచ్చినోళ్లు స్థానికులట! హైదరాబాద్ వాళ్ల ఏరియానట! ప్రశ్నిస్తే ఇక్కడ తిరగనివ్వరట! తెలంగాణ నడిబొడ్డున సాగిన రౌడీరాజ్యంలో వినిపించిన మాటలివి! ఎక్కడినుంచి వచ్చిందా ధైర్యం? ఎవరి అండ చూసుకుని ఆ వీరంగం? పదేండ్లు కనపడని మూకలు.. మళ్లీ తోక జాడిస్తున్నయ్ ఎందుకు? ఒక ఎమ్మెల్యే ఇంటిపైనే దాడికి తెగబడేంత అలుసు ఎవరిచ్చారు? అడిగితే కేసులు.. నిలదీస్తే దాడులు.. ఆందోళనకు దిగితే అరెస్టులు! తెలంగాణలో ఇప్పుడిదే ప్రభుత్వ › 5వ పేజీలో

చంద్రబాబుతో ఉత్తమ్ దంపతుల భేటీ › 8

ఆర్మీ అధికారులపై దాడి..
స్నేహితురాలిపై గ్యాంగ్‌రేప్
మధ్యప్రదేశ్‌లో దారుణం › 7

తెలంగాణ బిడ్డలపై సర్కార్ కక్ష

'స్థానికత'పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైద్యారోగ్య శాఖ
జీవో-33పై మొండిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
రాష్ట్ర విద్యార్థులకు నష్టం కలుగకుండా చూడాలన్న హైకోర్టు
ప్రభుత్వ నిర్లక్ష్యంతో వేలాది మంది విద్యార్థులు ఆగం
నిలిచిపోయిన ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ › 11

బాత్రూం డోర్లు పగులగొట్టి **విద్యార్థినులపై దాడి**
స్నానం లేటుగా చేస్తున్నారని పిల్లలపై పీఈటీ దౌర్జన్యం
సిరిసిల్లలో దారుణం › 11

గురుకుల జేఏసీ సమ్మె నోటీసు
పనివేళలు మార్చాలని అల్టిమేటం › 10
18 నుంచి ఆందోళన



సీపీఎం అగ్రనేత ఏచూరి ఇకలేరు › 7

ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో కన్నుమూత
ప్రధాని మోదీ, రాహుల్, కేసీఆర్ సంతాపం

తేల్చుకుందాం రా.. బ్రోకర్ లం..కొడకా..!

హుజూరాబాద్ నుంచి బతుకనీకి వచ్చావ్..

కౌశిక్‌రెడ్డిపై అరికెపూడి గాంధీ బూతులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సవాల్ విసురుతూ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మాట్లాడిన బూతులు విమర్శలకు దారితీస్తోంది. గాంధీ మాట్లాడిన మాటలు ఇలా ఉన్నాయి. 'నా మీద సవాల్ విసిరిన బ్రోకర్ కౌశిక్‌రెడ్డిగా.. ధైర్యముంటే రా నా కొడకా.. 11 గంటలకు నువ్వు రాకపోతే నేనే 12 గంటలకు నేనే వస్తా.. బ్రోకర్ లం..కొడకా.. నువ్వో నేనో తేల్చుకుందాం రా బాంచెత్..! దేనికైనా సిద్ధం నాకొడకా..! హుజూరాబాద్ నుంచి బతకనీకి వచ్చిన దుర్మార్గుడు నా ఇంటిమీద జెండా ఎగురవేస్తానంటే.. ఎగురేయించుకోవాల్నా.. పోలీసులు.. మీడియా ఆపినా వాడి సంగతి తేలుస్తా.. హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా బ్రోకరిజం చేసిన బ్రోకర్ నాకొడుకు.. నామీద సవాల్ విసిరితే నేను చేతగానివాడినా..! ఈ బ్రోకర్‌నాకొడుకు కోసం పదిరోజులు నా గాంధీ పేరును పక్కన పెట్టి వాడో నేనో తేల్చుకుంటా.. కౌశిక్‌రెడ్డి ఒక బ్రోకర్, ఒక కోవర్టు, దుర్మార్గుడు..! బీఆర్‌ఎస్ లో బ్రోకర్ లం..కొడుకులు చేరినాక ఆ గౌరవం లేని బ్రోకర్లతో సంసారం చేయగలుగుతామా.. అలాంటి ఇంకో ముగ్గురు ఉన్నారు..! దుర్మార్గుల మూలానే ఆ పార్టీ అపోజిషన్‌లో కూర్చుంది. కౌశిక్‌రెడ్డిలాంటి బ్రోకర్లతో పార్టీకి నష్టమని..ఆంబోతులను మీడియా ముందు వదిలినప్పుడు ఆలోచించుకోవాలని అన్నారు. గాంధీ ఇలా రెచ్చగొట్టే విధంగా మీడియా ముందు మాట్లాడుతుంటే ఆయన అనుచరులు రెచ్చిపోయి ఏడున్నవ్‌రా కౌశిక్.. దమ్ముంటే రారా నా కొడకా..అంటూ నినాదాలు చేశారు.

ఎమ్మెల్యే గాంధీ క్షమాపణ చెప్పాలి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై ఎమ్మెల్యే గాంధీ విద్వేష వ్యాఖ్యలు చేశారు. 'హుజూరాబాద్ నుంచి నా నియోజకవర్గానికి బతకనీకి వచ్చావ్' అంటూ వ్యాఖ్యానించారు. దీనిపై ప్రజలు మండిపడుతున్నారు. 'హుజూరాబాద్ వేరే దేశంలో ఉందా?.. శేరిలింగంపల్లికి రావాలంటే నీ అనుమతి తీసుకోవాలా?' అని ప్రశ్నిస్తున్నారు. అన్ని ప్రాంతాలకు చెందిన వారు శేరిలింగంపల్లిలో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నారని, వారందరినీ అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు ఓట్లేసిన వారిలో కూడా అన్ని ప్రాంతాలవారు ఉన్నారని, అందరినీ బతకనీకి వచ్చినవారే అని అవమానించినట్టేనని చెప్తున్నారు. బేషరతుగా అందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎమ్మెల్యే ఇంటిపై దాడి ప్రభుత్వ వైఫల్యమే

- గాంధీని, అనుచరులను అరెస్టు చేయాలి
- రాహుల్ ఇంటి ముందు ధర్నా చేస్తాం
- శాంతిభద్రతలు అదుపు తప్పాయి
- సీఐ, ఏసీపీని సస్పెండ్ చేయాలి
- దాడిని స్పీకర్ సుమోటోగా స్వీకరించాలి
- మాజీ మంత్రి టీ హరీశ్‌రావు



హైదరాబాద్/సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ప్రభుత్వ వైఫల్యమేనని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రోద్బలంతోనే ఈ దాడి జరిగిందని మండిపడ్డారు. ఈ దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని, దాడికి ఉసిగొల్పిన ఏసీపీ, సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనను స్పీకర్ సుమోటోగా స్వీకరించి, బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కౌశిక్‌రెడ్డిపై అరికెపూడి గాంధీ అనుచరులు గురువారం దాడి చేసిన అనంతరం మాదాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంట్లో ఆయనను హరీశ్‌రావుతోపాటు పలువురు మాజీ మంత్రులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. అనంతరం సైబరాబాద్ అడిషనల్ సీపీ జోయల్‌డేవిస్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. పోలీసుల నుంచి సరైన స్పందన లేకపోవడతో బీఆర్‌ఎస్ నాయకులు అక్కడే బైఠాయించారు. దాడి చేసినవారిని అరెస్టు చేసే దాకా సీపీ ఆఫీస్ నుంచి కదిలేదిలేదని హెచ్చరించారు. అనంతరం పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లోనే పోలీసుల ఆధ్వర్యంలో కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని ఆరోపించారు. హైదరాబాద్‌లో పట్టపగలు తమ పార్టీ ఎమ్మెల్యే ఇంటిపై రాళ్లు, కత్తులు, కర్రలతో దాడి చేశారని, ఇది ప్రభుత్వ వైఫల్యమేనని చెప్పారు. పోలీసుల వైఫల్యం వల్లే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని, దీనికి కారణమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, లేదంటే సీబీఐ విచారణ జరపాలని కోరుతామని, అవసరమైతే కోర్టుకు వెళ్తామని ప్రకటించారు. కేంద్ర హోంశాఖ వద్దకు కూడా వెళ్తామని, నిజనిజాలు బయటకు రావాలని స్పష్టంచేశారు. ఈ దాడి వెనుక పాత్రదారులు, సూత్రదారులు, సహకరించినవారు ఎవరో అన్నీ బయటకురావాలని అన్నారు. శాంతిభద్రతలను కాపాడాలనే ఉద్దేశం ఉంటే ఈ ఘటనపై సీపీ, డీజీపీ ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ దాడిని ఆపలేక, దగ్గరుండి దాడి చేయించిన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన గూండాలకు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో రాచమర్యాదలు చేస్తున్నారదని ఆరోపించారు. లా అండ్ ఆర్డర్‌ను కాపాడేందుకే ప్రతిదాడులు చేయడం లేదని స్పష్టంచేశారు. పోరాడి రాష్ట్రాన్ని సాధించుకున్నామని, దాడులకు భయపడబోమని చెప్పారు.

ఇదేనా ప్రజాపాలన?

సమాధానం చెప్పలేక, కాంగ్రెస్ వైఫల్యాలను ఒప్పుకోలేక, కౌశిక్‌రెడ్డి అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం లేకనే భౌతికదాడులకు పాల్పడుతున్నారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. ఇదేనా ప్రజాపాలన, ఇదేనా ప్రజాస్వామ్యం? అని నిలదీశారు. మొన్న సిద్దిపేటలో తన క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిందని, ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్తే తమపై దాడి చేశారని చెప్పారు. ఖమ్మంలో దాడి ఘటనపై ఇంతవరకు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదని దుయ్యబట్టారు. కౌశిక్‌రెడ్డి ప్రజాస్వామ్యం, హైకోర్టు తీర్పు గురించి మాట్లాడారని, గాంధీని రాజీనామా చేయాలని కోరారని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్టు గాంధీ చెప్పింది నిజం కాదా? అని హరీశ్‌రావు ప్రశ్నించారు. పీఏసీ చైర్మన్ కాగానే తాను ప్రతిపక్షంలో ఉన్నానంటూ గాంధీ సిగ్గు లేకుండా ప్రకటనలు ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. తమ ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేసి పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

హైదరాబాద్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న రేవంత్

పదేండ్ల కేసీఆర్ పాలనలో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచితే, రేవంత్‌రెడ్డి సర్కార్ నగర ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయని, హైదరాబాద్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారం కుదేలు అయిందని, పెట్టుబడులు తరలిపోతున్నాయని దుయ్యబట్టారు. కాంగ్రెస్ 9 నెలల పాలనలో 1,800 లైంగికదాడులు, 2,600 హత్యలు, తొమ్మిది మత ఘర్షణ లు జరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేకే రక్షణ లేకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఇది రేవంత్‌రెడ్డి వైఫల్యమని స్పష్టం చేశారు. తమకు తెలంగాణ ప్రజలు, హైదరాబాద్ ప్రతిష్ఠ ముఖ్యమని, సహనాన్ని చేతగానితనంగా భావించవద్దని హెచ్చరించారు. డీజీపీ, సీపీలు చట్టాన్ని రక్షించాలని విజ్ఞప్తిచేశారు. ప్రభుత్వానికి కొమ్ముకాసే అధికారులు మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

రాహుల్‌గాంధీ స్పందించాలి

రాజ్యాంగం పట్టుకొని తిరుగుతున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి రాజ్యాంగంపై నమ్మకం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని హరీశ్‌రావు సవాల్ చేశారు. రేవంత్‌రెడ్డిని రాహుల్ గాంధీ మందలిస్తారా? చర్యలు తీసుకుంటారా? అని నిలదీశారు. ఎమ్మెల్యేలపై దాడి చేయడం, ప్రశ్నించిన జర్నలిస్టులు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిపై అక్రమ కేసులు పెట్టడం, ఇదేనా ప్రజాస్వామ్యం? అని మండిపడ్డారు. ఈ ఘటనపై రాహుల్‌గాంధీ స్పందించకపోతే ఆయన చెప్పున్నవన్నీ ఉత్త మాటలే అనుకోవాల్సి వస్తుందని, ఆయన మోసాలను దేశం మొత్తం చెప్తామని హెచ్చరించారు.

ఉల్టా నాపైనే కేసు పెడ్తారా?: కౌశిక్‌రెడ్డి

'నా ఇంటిపై దాడి జరిగిందని పోలీసులకు ఫిర్యాదు ఇచ్చేందుకు వెళ్తే నన్ను అడ్డుకున్నది పోలీసులే. తిరిగి విధులకు ఆటంకం కలిగించానంటూ నాపైనే కేసు పెట్టడం దారుణం' అని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పారు. గురువారం రాత్రి ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన ఇంటిపైకి దాడి చేసేందుకు వచ్చారని చెప్పారు. తన ఇంటి నుంచి గాంధీ ఇంటికి 15 కిలోమీటర్ల దూరం ఉంటుందని, అక్కడి నుంచి వచ్చే సమయంలో పోలీసులు ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. తనను హౌజ్ అరెస్టు చేసి, గాంధీకి బందోబస్తు ఇచ్చి తన ఇంటికి పోలీసులు తీసుకొచ్చారని, ఇది దేనికి సంకేతమని ప్రశ్నించారు. తన ఇంటిపై దాడి చేయడం, బీఆర్‌ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేయడంతో తెలంగాణలో మరో ఉద్యమం మొదలైనట్టేనని చెప్పారు. పోలీసులు రేవంత్‌రెడ్డి కోసం పనిచేస్తున్నారని, ప్రజల కోసం పనిచేయాలని హితవు చెప్పారు. రేవంత్ కూడా తన ఇంటికి వందల సార్లు వచ్చి వెళ్లారని, గతాన్ని గుర్తు చేసుకోవాలని, పీసీసీ అధ్యక్షుడు అయ్యేందుకు ఎవరు సహకరించారో గుర్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి ఏం చేస్తాడో చేసుకోవాలని, తనను చంపినా సరే లొంగేది లేదని అన్నారు. అరికెపూడి తెలంగాణలో ఎలా తిరుగుతారో చూస్తామని, చర్యకు ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు.

> 'రేవంత్.. నిన్ను హెచ్చరిస్తున్నా.. దాడి చేసిన గూండాలను అరెస్ట్ చెయ్.. వారికి సహకరించిన పోలీసులపై యాక్షన్ తీసుకో.. లేకపోతే ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ ఇంటి ముందు, ఏఐసీసీ కార్యాలయం ముందు ధర్నా చేస్తాం. కాంగ్రెస్ పాలనలో ఎమ్మెల్యేలను ఎలా కొంటున్నారో దేశం మొత్తం తెలిసేలా చేస్తాం'
> -హరీశ్‌రావు

నేడు గాంధీ ఇంట్లోనే సమావేశం..


శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నివాసంలోనే శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ సమావేశం నిర్వహిస్తామని, పార్టీ నేతలు, కార్యకర్తలు తరలిరావాలని కౌశిక్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఇంటి నుంచి గాంధీ ఇంటికి వెళ్దామని చెప్పారు.

బాధితులపై కేసులా?: ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని బీఆర్‌ఎస్ నేత ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. దాడి చేసిన అరికెపూడి గాంధీకి పోలీసులు రాచమర్యాదలు చేశారని, బాధితుడైన కౌశిక్‌రెడ్డిపై రివర్స్ కేసు పెట్టారని మండిపడ్డారు. సినిమా డైరెక్టర్‌లా రేవంత్‌రెడ్డి చేస్తున్నాడని, పోలీసుల వెనుక ఉన్నది ఆయనే అని ఆరోపించారు. హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం కౌశిక్‌రెడ్డి తరఫున సీపీకి ఫిర్యాదు చేసేందుకు వస్తే ఎలాంటి కారణం లేకుండా అరెస్టు చేశారని, శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి సహా అనేక మంది పెద్దలను నాలుగు గంటలపాటు పోలీసులు అడవుల్లో తిప్పాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు.

> 'ఇంటిమీదకు వస్తామని ప్రెస్‌మీట్‌లో ప్రకటించిన గాంధీ తన అనుచరులతో దాడిచేసినప్పటికీ నిలువరించడంలో ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ తీవ్రంగా విఫలమైంది. పట్టపగలు ప్రజాప్రతినిధి మీద జరిగిన ఈ దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే కౌశిక్‌రెడ్డికి క్షమాపణలు చెప్పాలి. దాడి చేసిన గాంధీని, అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలి. కౌశిక్‌రెడ్డికి పూర్తి భద్రత కల్పించాలి.'
> -హరీశ్‌రావు

లోకం పోకడ



మాది అక్రమ చదువు కాదు సార్!

నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టం

సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన ఘటనలో నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టబోమని సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మహంతి స్పష్టం చేశారు. వైరల్ ఫీవర్ కారణంగా ప్రస్తుతం తాను సెలవులో ఉన్నట్టు తెలిపారు. కొండాపూర్ కొల్లా లగ్జారియా విల్లాస్‌కు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో కలిసి చేరుకొని మూకుమ్మడిగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి పాల్పడ్డారు. దీనిపై స్పందించిన పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి స్పందించారు. ఈ ఘటనపై ఇప్పటికే కేసులు నమోదు చేశామని, దర్యాప్తు జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తెలంగాణ భవన్ ముట్టడికి యత్నం

- చోద్యంచూస్తూ పట్టించుకోని పోలీసులు
- పోలీసుల వైఖరి తీవ్ర అభ్యంతరకరం
- బీఆర్‌ఎస్ మహిళా నాయకుల ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): అధికార కాంగ్రెస్ మహిళా నాయకులు గురువారం బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయమైన తెలంగాణ భవన్ ముట్టడికి యత్నించారు. రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత ఆధ్వర్యంలో మహిళలు తెలంగాణ భవన్ ముందుకొచ్చి కౌశిక్‌రెడ్డి వ్యాఖ్యలపై ముట్టడికి యత్నించారు. అధికార పార్టీ మహిళా నాయకులు కావడంతో పోలీసులు చోద్యం చూస్తూ కూర్చున్నారు. వారి ముట్టడికి పూర్తిగా సహకరించారు. ఎలాంటి అడ్డంకులూ కల్పించలేదు. బీఆర్‌ఎస్ నాయకులను అభ్యంతరకరంగా వ్యాఖ్యలు చేస్తున్నా వారిని వారించలేదు. దీంతో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. వారందరూ మీడియాతో మాట్లాడిన తర్వాత వారిని పోలీస్ వాహనంలో అక్కడి నుంచి తరలించారు. ఒక రాజకీయ పార్టీ కార్యాలయం వద్ద మరో పార్టీ కార్యకర్తలు ఆందోళన చేయడానికి ప్రయత్నించినా పోలీసులు పట్టించుకోకపోవడంపై బీఆర్‌ఎస్ మహిళా నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు చోద్యంచూస్తూ వారికి సహకరించారే కానీ అడ్డుకోవడానికి ప్రయత్నించలేదని చెప్పారు. అధికార పార్టీ కార్యాలయం వద్దకు ఇతర పార్టీల నాయకులను వెళ్లనిస్తారా? ముట్టడి చేయనిస్తారా? అంటూ పోలీసుల వైఖరిని ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై కేసు

- మరో 14 మంది అనుచరులపైనా ఎఫ్‌ఐఆర్‌లు
- ఎమ్మెల్యే కౌశిక్ ఇంటిపై దాడి ఘటనపై నమోదు
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ సహా పోలీసులూ ఫిర్యాదు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడి ఘటనలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహా 15 మంది ఆయన అనుచరులపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద రెండు వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌లు నమోదుచేశారు. కౌశిక్‌రెడ్డితోపాటు గచ్చిబౌలి పోలీసులు సైతం ఎమ్మెల్యే గాంధీ, అతడి అనుచరులపై ఫిర్యాదులు చేయడంతో ఈ ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి. దాడి, హత్యాయత్నం చేసినట్టు కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, తమ విధులకు ఆటంకం కలిగించినట్టు గచ్చిబౌలి ఎస్ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ సైతం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెండు వేర్వేరు ఫిర్యాదులపై గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు నమోదు చేసిన సెక్షన్లు

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఫిర్యాదు మేరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతోపాటు అతడి అనుచరులు ఉప్పలపాటి శ్రీకాంత్, బీ గౌతమ్‌గౌడ్, రాంపల్లి వెంకటేశ్, జీ రాములు, నరేశ్, మేల శివ, రాధిక, మంజుల, చంద్రికగౌడ్, రంగం నాగేందర్‌యాదవ్, డీ వెంకటేశ్ గౌడ్, అశ్రఫ్, రఘునాథ్‌రెడ్డి, మోహన్‌గౌడ్ తదితరులపై 109(1), 189, 191(2), 191(3), 132, 329, 333, 324(4), 324(5), 351(2), రెడ్‌విత్ 190 బీఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసులను నమోదు చేశారు.

పోలీసుల ఫిర్యాదు మేరకు..

తమ విధులకు ఆటంకం కలిగించారంటూ గచ్చిబౌలి ఎస్ఐ మహేశ్‌కుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే గాంధీ సహా 15 మందిపై 189, 191(2),191(3), 61, 132, 329,333, 324(4), 324(5), 351(2) రెడ్‌విత్ 190 బీఎన్‌ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. దీంతో దాడికి పాల్పడిన గాంధీ, అతడి అనుచరులపై రెండు వేర్వేరు ఎఫ్‌ఐఆర్‌లు నమోదయ్యాయి.

ఎఫ్‌ఐఆర్‌లో ఎమ్మెల్యే గాంధీ కుమారుడి పేరేది?

కౌశిక్‌రెడ్డిపై జరిగిన దాడిలో పాల్గొన్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుమారుడు పృథ్వీని తప్పించే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. దాడి ఘటనలో స్పష్టంగా కనిపిస్తున్న పృథ్వీ పేరును ఎఫ్‌ఐఆర్‌లో చేర్చకపోవడంపై బీఆర్‌ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు పక్షపాత ధోరణి వదిలి వెంటనే దాడికి పాల్పడిన పృథ్వీపైనా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హైదరాబాద్‌లో ఆంధ్రా ఫ్యాక్షనిజం..!

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశికిరెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే గాంధీ వర్గీయుల దాడి
- అద్దాలు, పూలకుండీలు ధ్వంసం
- గుండె ఆపరేషన్ జరిగిన కౌశిక్ మామ కృష్ణారెడ్డిఉన్న గదిలోకి రాళ్లు



కాంగ్రెస్ మూకల దాడిలో పగిలిన అద్దాలను చూపిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మామ కృష్ణారెడ్డి

కౌశిక్ మామకు తప్పిన ప్రమాదం

కాంగ్రెస్ కార్యకర్తల రాళ్లదాడిలో కౌశిక్ ఇంటి అద్దాలు, పూలకుండీలు, గేటు ధ్వంసమయ్యాయి. ఇంట్లో అద్దాలు పగిలిన గదిలో ఇటీవల గుండె అపరేషన్ జరిగిన కౌశిక్ మామ కృష్ణారెడ్డి ఉన్నారు. ఈ దాడితో ఆయన తీవ్ర ఆందోళనకు గురయ్యారు. దీంతో మళ్లీ అనారోగ్యం పాలయ్యారు. కాంగ్రెస్ కార్యకర్తల రాళ్లదాడిలో ఆయనకు తృటిలో ప్రమాదం తప్పింది. కౌశిక్‌రెడ్డి ఇంట్లో పని చేస్తున్న ఇద్దరు మహిళలపైనా దాడి చేశారు. దాడి చేసిన వారి చేతుల్లో కర్రలు, కత్తులు ఉన్నాయని లక్ష్మి అనే మహిళ మీడియాకు తెలిపారు. రెండు గంటల పాటు కౌశిక్‌రెడ్డి ఇంటి వద్ద గాంధీ అనుచరులు హంగామా సృష్టించారు. అప్పటికే బీఆర్‌ఎస్ శ్రేణులు ఈ విషయాన్ని తెలుసుకొని కౌశిక్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకున్నారు.

కొండాపూర్, సెప్టెంబర్ 12:

ఉదయం పదకొండున్నర గంటలు.. రద్దీగా ఉన్న హైదరాబాద్ నగర రహదారులు.. 20 వరకు తెల్లటి ఇన్నోవా వాహనాలు.. వాటికి ముందు ఉన్న వాహనాల్లో ఇన్నోవాలను చిత్రీకరిస్తూ కెమెరాలు.. ఫుట్‌బోర్డులపై నిలబడి చేతులు ఊపుకుంటూ... కోపంగా చూస్తూ.. ఎనిమిది జంక్షన్లను ఎలాంటి ట్రాఫిక్ జాం లేకుండా దాటుకుంటూ వెళ్తున్న వాహన శ్రేణిని ఆశ్చర్యంగా చూస్తున్న వాహనదారులు..

ఇదేదో... తెలుగు ఫ్యాక్షన్ సినిమాలో సన్నివేశం అనుకుంటున్నారా? ఇదంతా హైదరాబాద్ నడిబొడ్డున శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఆయన కుమారుడు పృథ్వీతో పాటు అనుచరగణం గురువారం చూపించిన ఆంధ్రా ఫ్యాక్షనిజం. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మీద దాడి చేసేందుకు వేసుకున్న భారీ స్కెచ్. కూకట్‌పల్లి వివేకానందనగర్ నుంచి 9 కిలోమీటర్ల దూరంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ వరకు లక్షలాది మంది నిశ్చేష్టులై ఈ భయానక దృశ్యాలను చూశారు. వాహన శ్రేణికి ఇబ్బంది కలగకుండా 8 జంక్షన్లలో సిగ్నల్ ఫ్రీతో సైబరాబాద్ పోలీసులు సహకరించడంతో 20 నిమిషాల్లోనే కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసం కొల్ల లగ్జరీ విల్లాస్‌కు వాహనాలన్నీ చేరుకున్నాయి. పోలీసులు అడ్డుకున్నట్టుగా ప్రయత్నించగానే.. కొందరు గేటు ఎక్కడం, మరికొందరు గేటును తన్నుకుంటూ లోపలికి వెళ్లారు. అరికెపూడి పృథ్వీ, అనుచరులు కౌశిక్‌రెడ్డి విల్లా దగ్గరికి వెళ్లి పథకం ప్రకారం సంచుల్లో తెచ్చుకున్న టమాటాలు, కోడిగుడ్లను కౌశిక్‌రెడ్డి, ఆయన ఇంటిపై విసిరారు. ఇంటి ముందు ఉన్న పూలకుండీలను ధ్వంసం చేసి, రాళ్లతో ఇంటి అద్దాలను పగులగొట్టారు. కౌశిక్‌రెడ్డి, ఆయన పక్కన ఉన్న బీఆర్‌ఎస్ నాయకులపైనా రాళ్లు విసిరారు. 2 గంటల పాటు బీభత్సాన్ని సృష్టించిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది.

సవాళ్లు.. ప్రతిసవాళ్లు...

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి శేరిలింగంపల్లి నుంచి గెలుపొందిన గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ప్రతిపక్షాలకు ఇవ్వాల్సిన పీఏసీ (పబ్లిక్ అకౌంట్ కమిటీ) చైర్మన్ పదవికి ఎన్నికవడం.. తాను బీఆర్‌ఎస్‌లో ఉన్నానని ఎమ్మెల్యే గాంధీ చెప్పారు. దీంతో హుజూరాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, గాంధీ ఇంటికి గురువారం ఉదయం 11 గంటలకు వచ్చి గులాబీ కండువా కప్పి, ఇంటిపై బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తానని ప్రకటించారు. దీంతో సైబరాబాద్ పోలీసులు ఉదయమే కౌశిక్‌రెడ్డి ఉంటున్న కొండాపూర్ కొల్లా లగ్జరీ విల్లాస్ ఉన్న గేటెడ్ కమ్యూనిటీకి చేరుకొని.. కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధం చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తానే 12 గంటలకు కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్తానని ముందుగానే ప్రకటించారు. గాంధీ వస్తే తాను సాదరంగా ఆహ్వానించి, భోజనం పెట్టి తెలంగాణభవన్‌కు వెళ్లి ప్రెస్‌మీట్ నిర్వహించి బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ వద్దకు వెళ్తామని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి స్వాగతించారు.

ఎమ్మెల్యే కౌశిక్ ఇంటిపై దాడి...

గేటెడ్ కమ్యూనిటీ లోపలికి వెళ్లాలంటే లోపల ఉన్నవారి అనుమతి ఉంటేనే సెక్యూరిటీ అనుమతిస్తారు. పైగా ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధం చేసిన దరిమిలా ఆయన ఇంటి ముందుతో పాటు గేటెడ్ కమ్యూనిటీ ప్రధాన గేటు వద్ద కూడా భారీగా పోలీసులు మోహరించారు. ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులను సులువుగా పోలీసులు నియంత్రించే అవకాశాలు ఉన్నా.. ప్రధాన గేటు వద్దకు వచ్చాకే పోలీసులు అడ్డుకున్నట్టుగా ప్రయత్నం చేశారు. ఎమ్మెల్యే గాంధీ కొడుకు అరికెపూడి పృథ్వీ, అనుచరులు ప్రధాన గేటుపైకి ఎక్కినా పోలీసులు అడ్డుకోకపోవడంతో సులువుగా లోపలికి వెళ్లిపోయారు. ఆపై ఎమ్మెల్యే గాంధీ ఒకచోట కూర్చుని మీడియాతో కౌశిక్‌రెడ్డిని బూతులు తిట్టుకుంటూ ఉండిపోయారు. పోలీసులు ఆయన చుట్టూ మోహరించారు. ఈలోగా మూడు వాహనాలు గేటుదాటి లోపలికి వచ్చినా పోలీసులు అడ్డుకోలేదు. దీంతో పృథ్వీ, గాంధీ అనుచరులు తాము ముందుగా వాహనాల్లో ఉంచిన సంచులు, కర్రలు, కత్తులు బయటికి తీశారు. పోలీసుల కండ్ల ముందే ఇదంతా జరుగుతున్న ఎవరూ అడ్డుకోలేదు. పృథ్వీ, కొంతమంది అనుచరులు కౌశిక్‌రెడ్డి నివాసం విల్లా-61 వైపు పరుగులు పెట్టి కర్రలు, రాళ్లు, కోడిగుడ్లు, టమాటలతో కౌశిక్ ఇంటిపై దాడి చేశారు. గేటు తాళాలు విరగొట్టారు. ఇంట్లోకి దూసుకెళ్లారు. పని వాళ్లను విచక్షణారహితంగా కొట్టారు.

ప్రణాళిక పూర్తయ్యాకే అదుపులోకి...

వాస్తవానికి అరికెపూడి గాంధీని గేటెడ్ కమ్యూనిటీ బయటనే పోలీసులు నియంత్రించే వీలుంది. అంతమేర బలగాలు ఉన్నాయి. కానీ లోపలికి అనుమతించి కండ్ల ముందు దాడి జరిగినా ప్రేక్షకపాత్ర వహించారు. ఎమ్మెల్యే గాంధీ కుమారుడు పృథ్వీ, అనుచరుల దాడి ప్రణాళిక పూర్తయ్యాక ఎమ్మెల్యే గాంధీ.. కౌశిక్‌రెడ్డి ఇంటి వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అప్పుడు పోలీసులు ఆయన్ని ఎత్తుకుని పోలీసు వాహనంలోకి నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం గాంధీ అనుచరులు అక్కడి నుంచి తమ వాహనాల్లో వెళ్లిపోయారు.

పక్కా ప్లాన్‌తో....

కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లే ముందే ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులు భారీ స్కెచ్ వేసుకున్నారు. భారీ సంఖ్యలో వాహనాలు, సంచుల్లో రాళ్లు, టమాటాలు, కోడిగుడ్లు నింపుకుని... కౌశిక్‌రెడ్డి నివాసానికి 12 గంటలకు చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకొన్నారు. కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని గాంధీ నివాసం నుంచి 20 వాహనాల్లో బయలుదేరారు. మీడియా చిత్రీకరిస్తుండగానే సినిమా స్టైల్‌లో గాంధీ ఉన్న వాహనంతో పాటు మరికొన్ని వాహనాలపై అనుచరులు ఫుట్‌బోర్డుపై నిలబడి చేతులు ఊపుతూ, హెచ్చరికలు చేస్తూ కదిలారు. వివేకానందనగర్ నుంచి కొండాపూర్ కౌశిక్‌రెడ్డి నివాసం వరకు 9 కిలోమీటర్ల దూరంగా ఉండగా.. మధ్యలో 8 జంక్షన్లు ఉన్నాయి. ఇది ఐటీ కారిడార్ కావడంతో భారీ ఎత్తున ట్రాఫిక్ ఉంటుంది. కానీ ఎక్కడా గాంధీ వాహన శ్రేణి ఆగకుండా సాఫీగా కొండాపూర్ వరకు వెళ్లిందంటే ట్రాఫిక్ పోలీసులకున్న ముందస్తు సమాచారం, ఆదేశాల ప్రకారం ఫ్రీ సిగ్నల్ ఇచ్చినట్టుగా స్పష్టమవుతుంది.

సైబరాబాద్ బ్రాండ్ ఇమేజ్ డ్యామేజ్!

పట్టపగలు ఐటీ కారిడార్‌లో ఎమ్మెల్యేపై దాడి

- గుడ్లప్పగించి చూసిన సైబరాబాద్ పోలీసులు
- దాడి జరుగుతుందని తెలిసినా ఉద్దేశపూర్వకంగా విస్మరణ
- ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే పోలీసుల ప్రేక్షకపాత్ర!
- ఈ ఘటనతో శాంతిభద్రతలు దెబ్బతిన్నాయనే సంకేతాలు
- నిన్నటిదాకా సురక్షితం.. నేడు దేశవ్యాప్తంగా చర్చ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): గత పదేండ్లలో శరవేగంగా వృద్ధిసాధించిన హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో శాంతిభద్రతలను ఇతర రాష్ట్రాల టెకీలు సైతం వేనోళ్ల పొగిడారు. కానీ గురువారం ఆ ఇమేజ్‌కు డ్యామేజ్ జరిగింది. పట్టపగలు ఫ్యాక్షన్ తరహాలో ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ వాహనశ్రేణి నుంచి అనుచరులు ఫుట్‌బోర్డుపై చేతులు ఊపుకుంటూ హంగామా సృష్టించడం అందరినీ ఆందోళనకు గురిచేసింది. దాడికి పక్కా స్కెచ్ వేశారని సంకేతాలు కనిపిస్తున్నా ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పోలీసులు చేతులెత్తేయటం సైబరాబాద్ పోలీసుల ప్రతిష్ఠకే మాయని మచ్చ. పోలీసుల నిఘా వైఫల్యం, విధి నిర్వహణలో నిర్లక్ష్యం.. నిన్నటిదాకా అత్యంత సేఫెస్ట్ సిటీగా పేరొందిన హైదరాబాద్ నగరాన్ని దేశం ముందు తలదించుకునేలా చేసింది.

ఉలిక్కిపడ్డ హైదరాబాద్

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యే గాంధీ దాడిచేసిన ఘటన హైదరాబాద్‌ను ఉలిక్కిపడేలా చేసింది. హుజూరాబాద్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌కు చెందిన పాడి కౌశిక్‌రెడ్డి కొండాపూర్‌లోని కొల్లా లగ్జరియ విల్లాలో ఉంటున్నారు. ఇది సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మాదాపూర్ డివిజన్‌లో ఉన్న గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తుంది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కూకట్‌పల్లిలోని వివేకానందనగర్‌లో నివాసముంటారు. ఇది కూడా సైబరాబాద్ కమిషనరేట్‌లోని బాలానగర్ జోన్‌లోని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోకే వస్తుంది. ఒకే కమిషనరేట్ పరిధిలో ఉన్న రెండు జోన్లలో ఉండే పోలీసులు సమన్వయం చేసుకోలేని పరిస్థితి సైబరాబాద్ పరిధిలో నెలకొన్నది. పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీ రాజకీయ సవాళ్లు, ప్రతి సవాళ్లు రెండు రోజులుగా సాగుతూనే ఉన్నాయి. గురువారం ఉదయం 11 గంటలకు గాంధీ ఇంటికి వెళతానని కౌశిక్‌రెడ్డి ముందుగానే ప్రకటించటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కౌశిక్‌రెడ్డి నివాసం దగ్గరికి పోలీసులు చేరుకొని ఆయనను గృహనిర్బంధం చేశారు.

నాలుగు పోలీస్‌స్టేషన్ల మీదుగా వెళ్లి దాడి

కౌశిక్‌రెడ్డిపై ఎమ్మెల్యే గాంధీ దాడి విషయంలో నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. గాంధీ నివాస ముండే వివేకానందనగర్.. కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది. ఆపై ఆయన కేపీహెచ్‌బీ, మాదాపూర్ పోలీస్‌స్టేషన్లను దాటుకొని, గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండాపూర్‌కు వెళ్లి దాడి చేశారు. అంటే పోలీసులు ఉద్దేశపూర్వకంగా, ప్రభుత్వ పెద్దల ఆదేశంతో మిన్నకుండిపోయారనేది బహిరంగ రహస్యం. హైదరాబాద్ ఐటీ కారిడార్ అత్యంత సురక్షితమైన ప్రాంతమని ఇతర రాష్ట్రాల ఐటీ నిపుణులు ప్రశంసలు కురిపించారు. ఇప్పుడు పట్టపగలు.. నగర రోడ్లపై భీతావహ వాతావరణాన్ని సృష్టించుకుంటూ, ఎమ్మెల్యేపై దాడి చేయడమంటే శాంతిభద్రతలు అత్యంత బలహీనంగా ఉన్నాయనే సంకేతాలు వెళ్లిపోయాయి. హైదరాబాద్‌లో వరుస హత్యలు ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఇప్పుడు కౌశిక్‌రెడ్డిపై దాడి సైబరాబాద్ ప్రతిష్ఠకు మచ్చలా మారింది.

గాంధీ విషయంలో చేతులెత్తేసిన పోలీసులు

తానే కౌశిక్‌రెడ్డి ఇంటికి మధ్యాహ్నం 12 గంటలకు వెళతానని గాంధీ 3 గంటల ముందుగానే ప్రకటించారు. పోలీసులు వివేకానందనగర్‌లోని ఆయన నివాసం వద్ద కూడా మోహరించి, గాంధీని కూడా గృహనిర్బంధం చేయాలి. కానీ ఇక్కడే పోలీసుల వైఫల్యం బట్టబయలైంది. ప్రభుత్వ పెద్దల ఆదేశంతో తమ విధి నిర్వహణను పక్కనపెట్టిన పోలీసులు.. గాంధీని అదుపులోకి తీసుకోకపోగా, కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లేందుకు అన్నిరకాలుగా మార్గాన్ని సుగమం చేశారు. గాంధీ.. తన ఇంటి వద్దకు అనుచరులను పిలిపించుకొని, కొండాపూర్‌కు ఎలా వెళ్లాలి? ఎలా దాడి చేయాలి? అనే ప్రణాళికను రూపొందించుకున్నారు. గాంధీ ఇంటి వద్ద ఉన్న పోలీసుల ముందే అనుచరులు రావడం, సంచుల్లో కోడిగుడ్లు, టమాటాలు నింపడం, వాహనాల్లో కర్రలు, కత్తులు వేసుకోవడం జరిగిందనే విమర్శలు వస్తున్నాయి. పోలీసుల సమక్షంలోనే, వారి సహకారంతోనే కౌశిక్‌రెడ్డిపై దాడి జరిగిందనేది బయటి ప్రపంచానికి తెలిసింది. సైబరాబాద్ పోలీసుల ప్రతిష్ఠ గాలిలో కలిసిపోయింది.

తెలంగాణలో కాంగ్రెస్ గూండారాజ్

రాష్ట్ర రాజధానిలో పట్టపగలు..మిట్ట మధ్యాహ్నం హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండామూకలు విధ్వంసం సృష్టించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, తన అనుచరులతో కలిసి కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని నివాసం నుంచి కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంటికి భారీ కాన్వాయ్‌తో 8 జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నళ్లను దాటుకుని వెళ్లారు. గేటెడ్ కమ్యూనిటీలో ఉన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి గేట్లు దుంకి చొచ్చుకెళ్లి రాళ్లు, టమాటాలు, కోడిగుడ్లతో దాడి చేశారు. కౌశిక్‌రెడ్డి ఇంటి అద్దాలు ధ్వంసం చేసి, పూలకుండీలను పగులకొట్టారు. పక్కా ప్రణాళికతో కర్రలు, కత్తులతో వీరంగం చేశారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి గృహనిర్బంధంలో ఉన్నా.. ఇంటి చుట్టూ పోలీసులు భారీగా మోహరించినా ఎమ్మెల్యే గాంధీ, అనుచరుల గూండాగిరి మాత్రం ఆగలేదు. మాటల్లో చెప్పలేని బూతుపురాణంతో ఎమ్మెల్యే అరెకెపూడి గాంధీ చేసిన అరాచకం అంతాఇంతా కాదు. హుజురాబాద్ నుంచి నా నియోజకవర్గానికి బతుకొచ్చినవ్ కొడుకా.. అంటూ విద్వేషపూరిత వ్యాఖ్యలతో రెచ్చగొట్టారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుమారుడు పృథ్వీ, కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసుల సమక్షంలోనే పక్కా ప్రణాళికతో దాడి చేశారు.

దాడి విషయాన్ని తెలుసుకుని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటికి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, సబితారెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు తదితరులు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సైబరాబాద్ కమిషనర్ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆందోళన నిర్వహించారు. పోలీసులు వారిని బలవంతంగా లాక్కెళ్లి రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల వాహనాన్ని బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు అడ్డుకొని నిరసన తెలిపారు.

- **కౌశిక్ ఇంటిపై కాంగ్రెస్ మూక దాడి**



కొండాపూర్‌లోని కొల్లా లగ్జరియా విల్లాలో ఉన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి నివాసంలోనికి చొచ్చుకెళ్తున్న కాంగ్రెస్ మూకలు

- **ఇంటి గేట్లు దుంకి, బద్దలు కొట్టి**



- **పూల కుండీలతో విధ్వంసం**



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి గేట్లు దుంకుతూ ఇంట్లోకి చొరబడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు, పక్కన పూలకుండీలను విసిరి ఇంటి అద్దాలను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ మూకలు

- **దౌర్జన్యంగా ఇంట్లోకి చొరబాటు**



గృహనిర్బంధంలో ఉన్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి చేయడానికి దౌర్జన్యంగా చొరబడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

- **ఇదీ రౌడీయిజం స్వరూపం**



పోలీసుల సమక్షంలోనే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై కోడిగుడ్లు, టమాటాలు, రాళ్లు రువ్వుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

- **ఇంటి అద్దాలు బద్దలు**



కాంగ్రెస్ కార్యకర్తల రాళ్లదాడిలో పూర్తిగా ధ్వంసమైన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటి అద్దాలు

- **కౌశిక్‌కు బీఆర్‌ఎస్ నేతల సంఘీభావం**



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి సంఘీభావం తెలుపుతున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటిగోపీనాథ్, కేపీ వివేకానంద, మాధవరం కృష్ణారావు, పల్లారాజేశ్వర్‌రెడ్డి, బండారు లక్ష్మారెడ్డి తదితరులు

కాంగ్రెస్‌పై తొడ కొట్టిన కౌశిక్



తన నివాసంలో తొడకొట్టి సవాల్ విసురుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

- **పోలీస్ కమిషనరేట్‌కు తరలిన బీఆర్‌ఎస్ దళం**



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

- **కేశంపేటలో అడ్డుకున్న కార్యకర్తలు**



రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులను తరలిస్తున్న పోలీసుల వాహనాన్ని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు

- **అరెస్టు చేసి.. సిటీ బయటకు**





పోలీస్ వాహనంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు





ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి పోలీస్‌స్టేషన్లలో రాచమర్యాదలపై తన సెల్‌లో వీడియో చూపిస్తున్న మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, చిత్రంలో మాజీమంత్రి గంగుల కమలాకర్, పక్కన పోలీసులు అరెస్టు చేస్తుండగా మీడియాతో మాట్లాడుతున్న సబితారెడ్డి

- **తలకొండపల్లిలో తిరగబడ్డ ప్రజలు**



రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులను తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకొని నిరసన తెలుపుతున్న కార్యకర్తలను లాక్కెళ్తున్న పోలీసులు

- **మమ్మల్ని ఎందుకు పట్టుకొచ్చారో చెప్పండి**



కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో కూర్చున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, బీఆర్‌ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, వాసుదేవరెడ్డి తదితరులు

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
శుక్రవారం 13 సెప్టెంబర్ 2024
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

వాల్మీకి కుంభకోణం

కర్ణాటక వాల్మీకి కుంభకోణంలో సోమవారం ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్‌తో కాంగ్రెస్ అవినీతి బండారం బద్దలైంది. గిరిజన బిడ్డల సంక్షేమానికి ఉపయోగపడాల్సిన సొమ్మును కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు దారి మళ్లించారనేది ఆరోపణ. అలా మళ్లించిన నిధులను కర్ణాటకలోని బళ్లారితో పాటుగా తెలంగాణ, ఏపీ ఎన్నికల ఖర్చులకు, విశేషించి భారీగా మద్యం కొనుగోలుకు వినియోగించారని అభియోగపత్రంలో పేర్కొనడం గమనార్హం. మిగతా స్కామ్‌ల తరహాలో ఇందులో పెద్ద వ్యూహాలేమీ లేవు. ఓ ప్రభుత్వ సంస్థ నిధులను ముందుగా ఆమోదయోగ్యత లేని ఓ ఖాతాలోకి మళ్లించి, అటునుంచి తెలంగాణ, ఏపీలోని 18 వేర్వేరు నకిలీ ఖాతాల్లో జమ చేశారు. అలా చేజిక్కించుకున్న రూ.89.62 కోట్ల సొమ్మును వివిధ ఎన్నికల్లో ఖర్చుచేశారు. రాష్ట్రంలో గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పొరుగు రాష్ట్రం నుంచి వచ్చే వాహనాల్లో పెద్ద ఎత్తున డబ్బు పట్టుబడటం తెలిసిందే. కాంగ్రెస్ పెద్దలు కర్ణాటకను ఏటీఎంలా వాడుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకులు చేసిన ఆరోపణలు అక్షరాలా నిజమని ఈడీ చార్జిషీట్ రుజువు చేసింది.

మాజీ మంత్రి నాగేంద్రను ప్రధాన నిందితుడిగా చేర్చినప్పటికీ పైస్థానాల్లో ఉన్న పెద్దలకూ ఈ కుంభకోణంలో హస్తమున్నట్టు వినవస్తున్నది. మొత్తం 24 మంది నిందితుల పేర్లు చేర్చారు. అందులో హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కూడా ఉన్నారు. అటు నుంచి ఇటు ధన ప్రవాహానికి వారు సంధానకర్తలుగా వ్యవహరించారని ఈడీ అంటున్నది. ప్రైవేటు ఖాతాకు ప్రభుత్వ నిధుల మళ్లింపునకు సంబంధించిన నియమాలను, మార్గదర్శకాలను ఆర్థికశాఖ, గిరిజన సంక్షేమశాఖ ఉల్లంఘించాయని ఈడీ ఆరోపించింది. గిరిజన సంక్షేమశాఖ మంత్రిని ఈసరికే అరెస్ట్ చేశారు. కాగా ఆర్థికశాఖను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్వయంగా నిర్వహిస్తున్నారు. ఈడీ దాఖలు చేసింది ముందస్తు అభియోగపత్రం మాత్రమే. దర్యాప్తు ముందుకు సాగుతున్న కొద్దీ అనుబంధ అభియోగాలు దాఖలు చేస్తామంటున్నది. అదే జరిగితే ఏయే అధికార పీఠాలకు ఈ కేసు చుట్టుకుంటుందో ఇప్పుడే చెప్పలేం.

అవినీతి కేసులు వెంటాడటంతోనే ఢిల్లీ గద్దెను కోల్పోయి, మూలన పడి మూలుగుతున్నా కురువృద్ధ పార్టీ తీరు మారలేదని తాజా పరిణామం సూచిస్తున్నది. కర్ణాటకలో బీజేపీ వ్యతిరేకతను వాహనంగా చేసుకుని, అలవిమాలిన హామీలను ఇంధనంగా వాడుకొని అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. ప్రజలు గత్యంతరం లేక ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే కాంగ్రెస్ ఎందుకవుతుంది? స్కాముల పార్టీ అనే ముద్రను సార్థకం చేసుకోవాలి కదా? బోఫోర్స్, బొగ్గు, టూజీ ఇలా కుంభకోణాల పరంపర ఆగిపోతే ఎలా? అదిగో ఆ వారసత్వంలో భాగమే వాల్మీకి కుంభకోణం. అయితే ఈ కుంభకోణం బయటపడటంతో మనం మాట్లాడుకుంటున్నాం. బయటపడనివి ఇంకెన్ని ఉన్నాయో తెలియదు. ఎందుకంటే ఇక్కడ చేతులు మారింది ఇప్పటి వ్యయాలతో పోలిస్తే చిన్న మొత్తమే. ఇంకెన్ని వనరుల్లో చేయి పెట్టారో, ఇక్కడి పెద్ద తలకాయలు ఏవో మరింత లోతుగా తరచి చూస్తే కానీ బయటపడదు.



నివాళి

పోరాటమే తన ఊపిరి!



బసవరాజు నరేందర్ రావు
99085 16549

ఈ సమాజం నాకేమిస్తుందని వెయ్యి కళ్లతో ఎదురుచూసేవారెందరో ఉన్న ఈ సమాజంలోనే.. సమాజం కోసం తమ సర్వస్వాన్ని ధారబోయగల త్యాగమూర్తులు కూడా ఉన్నారని కొందరు త్యాగధనులు నిరూపిస్తారు. వారి సిద్ధాంతాలు ఏమైనా కావచ్చు, వాళ్లు నడిచే బాట ఎంత కఠినతరమైనదైనా కావచ్చు. కానీ, తాము నమ్మిన సిద్ధాంతం కోసం తమ జీవితాలను అంకితం చేస్తారు కొందరు. అలాంటి దార్శనికుల్లో ఒకరు సీతారాం ఏచూరి.

ఉన్నత కుటుంబంలో జన్మించి ఉన్నత విద్యాభ్యాసం చేసి, మంచి ఉద్యోగంలో స్థిరపడగలిగే అన్ని అవకాశాలున్నా తన జీవితాన్ని సమాజం కోసం ధారపోశారు ఏచూరి. సర్వేశ్వర సోమయాజులు, కల్పకం దంపతులకు 1952 ఆగస్టు 12న మద్రాస్‌లో సీతారాం ఏచూరి జన్మించారు. సోమయాజులు అప్పటి ఏపీఎస్ఆర్టీసీలో ఇంజినీరుగా పని చేస్తున్నందువల్ల హైదరాబాద్‌లోని ఆల్‌సెయింట్ హైస్కూల్‌లో సీతారాం ఏచూరి చదివారు. తర్వాత న్యూఢిల్లీలోని ప్రెసిడెంట్ ఎస్టేట్ స్కూల్ నుంచి సెకండరీ ఎడ్యుకేషన్‌లో దేశంలోని ప్రథమ స్థానాన్ని సాధించారు. సెయింట్ స్టీఫెన్ కళాశాల నుంచి బీఏ, జేఎన్‌టీయూ నుంచి ఎంఏ పట్టా పొందారు. ఇక జేఎన్‌యూలో పీహెచ్‌డీలో చేరినా ఎమర్జెన్సీ కారణంగా అరెస్టు కావడంతో అది అర్ధాంతరంగా ముగిసింది.

జేఎన్‌యూ విద్యార్థి నేతగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఏచూరి అంచెలంచెలుగా ఎదిగారు. 1974లో ఎస్ఎఫ్ఐలో చేరిన ఏచూరి ఆ తర్వాత దేశం గర్వించే నేతయ్యారు. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన 1975లో కొంత కాలం పాటు జైలుజీవితం గడిపారు. జైలు నుంచి విడుదలయ్యాక మూడు పర్యాయాలు జేఎన్‌యూ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థుల హక్కుల కోసం పోరాడారు. 1978లో ఎస్ఎఫ్ఐ ఆల్‌ఇండియా జాయింట్ సెక్రెటరీగా, ఆ తర్వాత ఎస్ఎఫ్ఐ ఆల్‌ఇండియా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అనతికాలంలోనే సీపీఐ (ఎం)లో చేరి, ఆ పార్టీ ముఖ్య నాయకుల్లో ఒకరిగా గుర్తింపు సాధించారు. 1984లో ఆ పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. సీపీఐ (ఎం) జనరల్ సెక్రెటరీగానూ సేవలందించారు. 2005లో పశ్చిమబెంగాల్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఏచూరి దేశ సమస్యలపై పార్లమెంట్‌లో గళమెత్తారు. ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసిన ఏచూరి ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదు. తన జీవితాన్ని సర్వస్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ధారపోశారు.

ఏచూరి విద్యావంతుడు, గొప్ప రాజకీయ నాయకుడే కాకుండా, ఒక ఉత్తమ రచయిత కూడా. ఆయన అనేక పుస్తకాలను రచించారు. వాటిలో చాలావరకు పరిశోధక విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి. బహుముఖ ప్రజ్ఞాశాలి ఏచూరి సీతారాం పరమపదించడంతో ఈ దేశం ఒక గొప్ప రాజనీతిజ్ఞుడిని కోల్పోయింది.

ఎమ్మెల్యేపై దాడి.. ఎక్కడి విష సంస్కృతి?

ఇది మాయిముంత దేవులాడుకోవాల్సిన సమయం. తెలంగాణ జెండా కప్పుకొని, తెలంగాణ బిడ్డల ఓట్లతో గెలిచినవాళ్లు తెలంగాణ వ్యతిరేకులతో చేతులు కలిపి తల్లి రొమ్ము గుద్దుతున్న నేపథ్యంలో తెలంగాణ జనం మల్లోసారి కన్నతల్లిని కాపాడుకోవాల్సిన సమయం వచ్చింది. చాటుమాటుగా కాదు, నిర్భీతిగా, పట్టపగలు శాసనసభ్యుని ఇంటికివెళ్లి దాడి చేయటం, ఈ దాడికి స్వయానా పోలీసు యంత్రాంగమే కాపు గాయటం చూస్తుంటే.. ముమ్మాటికీ ఇది అధికార పీఠం అండదండలతోనే జరిగిన దాడి అనిపిస్తున్నది. సంఘ విద్రోహ శక్తులు ఇంట్లోకి చొరబడి శాసనసభ్యుని మీద పడి చేతికి అందిన వస్తువులతో కొడుతుంటే పోలీసులు కొయ్యబొమ్మల తీరున చేష్టలుడిగి నిలబడిపోయారు.



వర్ధెల్లి వెంకటేశ్వర్లు



హైదరాబాద్ నగరం నడిగడ్డలోనే నెంబర్ వన్ బిజినెస్ రాస్తా మీద దాదాపు 25-30 వాహనాల కాన్వాయ్ మూడు పోలీసుస్టేషన్లు దాటి శాసనసభ్యుని ఇంటిమీద పడి దాడికి తెగబడ్డది అంటే.. పోలీస్ ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ, స్థానిక పోలీసులు కండ్లు మూసుకున్నారు అనుకోవాల్నా! తెలంగాణ బిడ్డలకు హైదరాబాద్‌లో రక్షణ లేదని చాటిచెప్పటానికి రాజ్యం ఉసిగొల్పిన దాడిగానే పరిగణించాలి.

ఇద్దరు శాసనసభ్యుల మధ్య మూడు రోజులుగా సవాళ్లు- ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఒక శాసనసభ్యుడిని గృహ నిర్బంధంలో ఉంచి, ఇంకో శాసనసభ్యుడిని రోడ్డు మీద వదిలేస్తారా? ఇదేనా పోలీసింగ్ ప్రణాళిక? దాడిని అంచనా వేసి అడ్డుకోలేనంత అసమర్థ స్థితిలో ఉన్నదా మన నగర పోలీసు వ్యవస్థ? ఈ లెక్కన ప్రతిపక్షాలకు చెందినవారి ఇండ్లల్లో అక్రమంగా ప్రవేశించి హత్యలు చేసినా, లూటీలు చేసినా ఫరవాలేదన్న మాట. పోలీసులే దుండగులకు రక్షణ వలయం కూడా కల్పిస్తారా?

అరికెపూడి గాంధీని నామినేట్ చేసింది పబ్లిక్ న్యూసెన్స్ కమిటీ చైర్మన్‌గా కాదు, రాజ్యాంగబద్ధమైన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా. పద్దుల ఆడిట్ బాధ్యత ప్రతిపక్షాలది. ఈ పదవి ప్రతిపక్షాల హక్కు. ఫిరాయింపుదారుడు ఎప్పటికీ దీనికి అర్హుడు కాదు. అది అరికెపూడికి కూడా తెలుసు.

పీఏసీ చైర్మన్ పదవి ప్రతిపక్ష నేతకు చెందుతుంది. అది రాజ్యాంగధర్మం. దేశంలోనే ఈ సంప్రదాయం ఉన్నది. తెలంగాణలో కొత్త రాజ్యాంగమేదో అమల్లోకి వచ్చినట్టు పార్టీ ఫిరాయించి, పాలకపక్షం పంచన చేరిన అరికెపూడి గాంధిని పీఏసీ చైర్మన్‌గా నియమించటం అనైతికం, రాజ్యాంగ విరుద్ధం. ఇదే తరహాలో గతంలో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో అక్కడి తృణమూల్ కాంగ్రెస్ సీఎం మమతా బెనర్జీ చేశారు. 2021 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమత విజయం సాధించారు. అదే ఏడాది నాడియా జిల్లా కృష్ణానగర్ ఉత్తర అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ టిక్కెట్‌పై గెలిచిన ముకుల్ రాయ్ అధికార తృణమూల్ కాంగ్రెస్‌లోకి ఫిరాయించారు. మమతా బెనర్జీ ఆయనను పీఏసీ చైర్మన్‌గా నియమించారు. దీన్ని అక్కడి ప్రతిపక్ష పార్టీ తీవ్రంగా తప్పుబట్టింది. సంప్రదాయానికి విరుద్ధంగా పీఏసీ పదవిని ఫిరాయింపుదారునికి ఇచ్చారని ప్రతిపక్ష సభ్యుడు కలకత్తా హైకోర్టులో పిల్ వేశారు. అనంతరం ముకుల్‌రాయ్ అనివార్యంగా రాజీనామా చేయాల్సి వచ్చింది.

అరికెపూడి గాంధీని నామినేట్ చేసింది పబ్లిక్ న్యూసెన్స్ కమిటీ చైర్మన్‌గా కాదు, రాజ్యాంగబద్ధమైన పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా. పద్దుల ఆడిట్ బాధ్యత ప్రతిపక్షాలది. ఈ పదవి ప్రతిపక్షాల హక్కు. ఫిరాయింపుదారుడు ఎప్పటికీ దీనికి అర్హుడు కాదు. అది అరికెపూడికి కూడా తెలుసు. అందుకే నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని, అభివృద్ధి పనుల కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని ఓ ప్రకటన చేశారు. ఇది మోసపూరిత ప్రకటన అని తెలంగాణ సమాజానికి తెలుసు. ప్రజలు అమాయకులేం కాదు. ఈ నేపథ్యంలో సాటి శాసనసభ్యునిగా కౌశిక్‌రెడ్డి స్పందించారు.

అరికెపూడి గాంధీ తన ఇంటికి వస్తే బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి, గౌరవంగా భోజనం పెట్టి, అక్కడి నుంచి అటే కేసీఆర్ దగ్గరికి తీసుకువెళ్తానని చెప్పారు. ఆయన వస్తున్నాడని తెలిసి శేరిలింగంపల్లి ఎమ్మెల్యేను నిలవరించకుండా, ఎటువంటి ఇబ్బంది పెట్టకుండా తన ఇంటికి పంపాలని తన గేటెడ్ కమ్యూనిటీ సెక్యూరిటీకి ఆదేశాలిచ్చారు. ఇది తప్పు కాదు కదా? అనుచరులతో వెళ్లిన గాంధీ పరుష పదజాలం, రెచ్చగొట్టే మాటలతో కౌశిక్‌రెడ్డి ఇంటి మీద పడ్డాడు. కౌశిక్‌రెడ్డికి దమ్ముంటే బయటకు రావాలని, తాను ఇక్కడే ఉన్నానంటూ గాంధీ సవాల్ విసిరారు. ఆయన సవాళ్లతో అనుచరులు రెచ్చిపోయారు. చేతికందిన వస్తువులతో దాడి చేశారు. ఈ దాడి హైదరాబాద్ సంస్కృతికి విరుద్ధం. పదేండ్ల తెలంగాణలో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌ను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. ప్రాంతీయ పోరాటాలు, అస్తిత్వ పోరాటాలతో రాజ్యం సాధించుకున్న దేశాల్లో జరిగిన తదనంతర పరిణామాలపై కేసీఆర్ విస్తృతంగా అధ్యయనం చేశారు. నివేదికలు, పుస్తకాలు చదివారు. చర్చలు, ఇష్టాగోష్ఠి పెట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ఆంధ్రుల ఆస్తులపై, ఆంధ్రులపై భౌతికదాడులు జరిగే ప్రమాదం ఉన్నదని, వారి ఆస్తులు లూటీ అయ్యే అవకాశం ఉన్నదని ముందే పసిగట్టారు. పోలీసు వ్యవస్థను బలోపేతం చేశారు.


అంతకుముందు ఉన్న పాతకాలపు వాహనాలను తొలగించి, పోలీసులకు అధునాతనమైన ఇన్నోవా వాహనాలను సమకూర్చారు. తరతమ భేదం లేకుండా, హద్దులు మీరిన విద్రోహ శక్తులపై ఉక్కుపాదం మోపారు. కేసీఆర్ విశాల హృదయం ముందుచూపుతో హైదరాబాద్‌లో ఆంధ్ర ప్రజలు గుండె మీద చెయ్యి వేసుకుని కంటి నిండా నిద్రపోయారు. కానీ, ఇవాళ హైదరాబాద్ సంస్కృతి మీద దాడి జరిగింది. హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టించి, కల్లోలిత తెలంగాణగా ప్రపంచం ముందు నిలబెట్టి, మళ్లీ ఆంధ్రలో కలపాలనే కుట్రకు ఇది తొలి అడుగుగా తెలంగాణవాదులు, పౌర సమాజం భావించాల్సి ఉంటుంది.

భూతాపానికి సామాన్యుడే బలి!

గ్లోబల్ క్లైమేట్ రిస్క్ ఇండెక్స్ 2021 ప్రకారం గ్లోబల్ వార్మింగ్ కారణంగా ప్రభావితమయ్యే మొదటి 10 దేశాల్లో భారత్ కూడా ఒకటి. 2100 నాటికి భారత్ తన జీడీపీలో 3-10 శాతం వరకు కోల్పోయే ప్రమాదం ఉంది. అంతేకాదు, వాతావరణ మార్పుల కారణంగా 2040 నాటికి భారత పేదరిక సూచీ 3.5 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. ఈ మేరకు 'ది కాస్ట్స్ ఆఫ్ క్లైమేట్ ఛేంజ్ ఇన్ ఇండియా' పేరిట వాతావరణ సంబంధిత నష్టాలు, అసమానత, పేదరికం పెరిగే అవకాశం తదితర అంశాలపై లండన్‌కు చెందిన ఓవర్సీస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ చేసిన అధ్యయన నివేదికను 2021 జూన్‌లో వెలువరించింది. అయితే ఈ విపత్కర పరిస్థితులకు కారణం సంపన్న కుటుంబాలే కావడం గమనార్హం.



చెన్నమనేని రమేశ్



రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమనిటీ అండ్ నేచర్ అధ్యయనం ప్రకారం.. మన దేశంలో పేద కుటుంబాలతో పోలిస్తే 20 శాతం సంపన్న కుటుంబాలు, ఏడు రెట్లు అధిక కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. రోజుకు 1.9 డాలర్ల కంటే తక్కువ ఖర్చు చేసే కుటుంబాలను ఇందుకు ఎంచుకున్నారు. మన దేశంలోని ప్రతి వ్యక్తి ఏడాదికి విడుదల చేసే సగటు కార్బన్ ఉద్గారాలు 0.56 టన్నులు. ఇందులో పేద ప్రజల తలసరి 0.19 టన్ను కాగా.. సంపన్నుల్లో 1.32 టన్నులుగా ఉంది. 2013లో నిర్వహించిన నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్‌వో) నుంచి ఇండియా స్పెండ్ సేకరించిన డాటా ప్రకారం.. ఆహారం, విద్యుత్తు వాడకం ఇందుకు ప్రధాన కారకాలు. సామాజిక, ఆర్థిక సమూహాల్లో ఎక్కువ ఉద్గారాలకు ఇవే కారణం. సొంత వాహనాలు కలిగి ఉండటం, తృణధాన్యాలు కానటువంటి ఆహారం తదితర అంశాలు సంపన్న కుటుంబాలు ఎక్కువ ఉద్గారాలను విడుదల చేయడానికి కారకాలని ఈ అధ్యయనం తేల్చింది.

ఒకవైపు ఆధునిక సాంకేతికత, సేవలతో అభివృద్ధి చెందుతున్న సమాజానికి.. మరోవైపు పేదరికం, పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలు, సామాజిక బహిష్కరణ, వనరుల క్షీణతల మధ్య కొట్టుమిట్టాడుతున్న సమాజానికి దారితీసే గణనీయమైన ఆర్థిక వృద్ధికి మధ్య వైరుధ్యం మన సమాజంలో చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. వివిధ సామాజిక సమూహాల మధ్య జీవన శైలి భావనలు కూడా విభిన్నంగా పుట్టుకొస్తున్నాయి. అంటే, వాతావరణ మార్పుల పట్ల అవగాహన, అవసరమైన చర్యలు కూడా భిన్నంగా ఉంటాయి. ఈ వాస్తవాన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి.

ప్రస్తుతం మన తెలంగాణలోని 33 జిల్లాల్లో 29 జిల్లాలు వరద ప్రభావిత జిల్లాలుగా గుర్తించారు. 1 డిగ్రీ గ్లోబల్ వార్మింగ్ కారణంగానే ఈ విపరీత పరిణామాలు జరుగుతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ వల్ల సంభవించే వేడిగాలులు, అధిక ఉష్ణోగ్రతలు మనుషుల ఆరోగ్యాన్ని దెబ్బతీయడమే కాకుండా అతిభారీ వర్షాలు, వరదలు, తుఫానులకు కారణమవుతున్నది. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రజల జీవితాలు అతలాకుతలమవడంతో పాటు జీవనోపాధి, ఆస్తులకు నష్టం జరుగుతున్నది. ఎలాంటి మౌలిక వసతులకు నోచుకోకుండా లోతట్టు ప్రాంతాల్లో నివసించే పేదలు వీటివల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్నారు.

ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదల వల్ల 29 మంది చనిపోయినట్టు తెలంగాణ ప్రభుత్వం నివేదించింది. అంతేకాదు, రూ.5,400 కోట్ల విలువైన ఆస్తుల నష్టం కూడా జరిగినట్టు వెల్లడించింది. ప్రైవేట్, సామాజిక ఆస్తులకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేసింది. కానీ, వాటిని ఇందులో చేర్చలేదు.

ముఖ్యంగా శిలాజ ఇంధనాల వినియోగం వల్ల వాతావరణ మార్పులు జరుగుతున్నాయి. ఈ వాతావరణ మార్పుల కారణంగా సంభవించే ప్రమాదాల దృష్ట్యా శక్తి వినియోగంలో ప్రాథమిక మార్పు అత్యవసరం. ఇది తక్కువ ఉద్గార సమాజానికి దారితీస్తుంది.

శక్తి, ఆహార ఉత్పత్తి, మొబిలిటీ, గృహ ఇంధన వినియోగం తదితర అంశాల్లో భారీ మార్పులు చేయాల్సిన అవసరం ఉన్నది. సహేతుకమైన పరిష్కారం కోసం సాంకేతిక చర్యలు, విధానపరమైన సాధనాలు కచ్చితంగా అవసరం. నిబంధనలు, నియమాలు, చర్యలు, సర్దుబాట్లు అనేవి రాజకీయ, పరిపాలనా వ్యవస్థల్లోనే కాదు, సమాజంలో, కుటుంబాల్లో కూడా ఏకకాలంలో జరగాలి.

మరో మాటలో చెప్పాలంటే.. ఈ సవాళ్లను ఎదుర్కొని స్థిరత్వం వైపు పయనించేందుకు మనకు కావలసింది విధానాలు, సాంకేతికత, జీవనశైలి, పౌర సమాజంతో పాటు వ్యవస్థలో మార్పు. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధానంగా కారణమవుతున్న సంపన్న కుటుంబాల జీవనశైలిలో మార్పులు తీసుకొచ్చి ఉద్గారాలను తగ్గించవచ్చు. అదే సమయంలో, సమాజంలోని పేద, అణగారినవర్గాలను ఆదుకోవడం ద్వారా వాతావరణ మార్పుల పర్యవసానాల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ప్రయత్నించవచ్చు. అయితే వీటిని చేపట్టేటప్పుడు యావత్ సమాజాన్ని కలుపుకొని వెళ్లాలి. సంపన్నులతో పోలిస్తే తమ ప్రమేయం తక్కువగా ఉన్నప్పటికీ గ్లోబల్ వార్మింగ్ సామాన్యులను ఎక్కువగా బాధిస్తున్నది. అందువల్ల ఈ చర్యల పర్యవసానాలు భిన్నంగా ఉంటాయి.

ఏదేమైనప్పటికీ, ఈ వ్యూహాలు సమాజంలోని వివిధ వర్గాలకు ఆకర్షణీయమైన మంచి జీవితాన్ని దృష్టిలో పెట్టుకోకుండా చేపడితే మాత్రం అవి చాలావరకు విఫలమవుతాయి. అయితే దీనికి ప్రజల నుంచి రాజకీయ మద్దతు లేకపోవడం మరో ప్రతికూలాంశం. బహుశా మన ముందున్న అతిపెద్ద సవాలు ఇదే!

(వ్యాసకర్త: మాజీ ఎమ్మెల్యే, వ్యవసాయ, వాతావరణ నిపుణుడు)

గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలకు ప్రధానంగా కారణమవుతున్న సంపన్న కుటుంబాల జీవనశైలిలో మార్పులు తీసుకొచ్చి ఉద్గారాలను తగ్గించవచ్చు. అదే సమయంలో, సమాజంలోని పేద, అణగారిన వర్గాలను ఆదుకోవడం ద్వారా వాతావరణ మార్పుల పర్యవసానాల వల్ల కలిగే నష్టాలను తగ్గించేందుకు ప్రయత్నించవచ్చు. అయితే వీటిని చేపట్టేటప్పుడు యావత్ సమాజాన్ని కలుపుకొని వెళ్లాలి.

అరువై ఏండ్ల ప్రజా ఆకాంక్షలకు, వందలాది మంది యువకుల ఆత్మ బలిదానాలకు ప్రతిఫలమే తెలంగాణ. దశాబ్ద కాలానికి పైగా అలుపెరుగని పోరాటం చేసి, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊపిరి సలపకుండా రాజకీయంగా ఉద్యమం చేసిన కేసీఆర్ తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించారు. ఇది ఎవ్వరూ కాదనలేని చారిత్రక సత్యం.

మాయమైన తెలంగాణ సోయి



డాక్టర్
కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేంద్ర సహకారం కొరవడటం, రాష్ట్రంలో విద్యుత్తు కొరత, సాగు, తాగునీటి సమస్య, క్రాప్ హాలీడేలు, ఏపీ-తెలంగాణ పంపకాలు.. ఇలా ఎన్నో సమస్యలు చుట్టుముట్టాయి. అయినప్పటికీ పదేండ్లలోనే అనేక సవాళ్లను ఎదుర్కొని వ్యూహాత్మకంగా, ప్రాధాన్యక్రమంలో సమస్యలకు శాశ్వ త పరిష్కారం చూపుతూ పునర్నిర్మాణం దిశగా సాగుతూ తెలంగాణను అన్ని రంగాల్లో కేసీఆర్ అభివృద్ధి పథంలో నడిపించా రు. కేంద్ర గణాంకాల సాక్షిగా సంక్షేమంలో, అభివృద్ధిలో దేశానికే స్ఫూర్తినిచ్చేలా ముందుకు సాగించారు. తలసరి ఆదాయ వృద్ధిలో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా నిలవడమే అందుకు నిదర్శనం.

కానీ, దురదృష్టం కొద్దీ ప్రజాపాలన పేరిట రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 9 నెలల్లోనే తన అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని 20 ఏండ్లు వెనక్కినెట్టింది. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ ఎదుర్కొన్న కడగండ్లను మళ్లోసారి తెలంగాణ ప్రజల కండ్లముందు ఉంచింది. తెలంగాణకు వెన్నెముక లాంటి హైదరాబాద్‌ను గత పదేండ్లలో విశ్వనగరంగా అభివృద్ధి చేసుకున్నాం. అనేక సం స్కరణలను తీసుకొచ్చాం. కరోనా కాలాన్ని సైతం లెక్కజేయకుండా కోట్ల రూపాయల పెట్టుబడులు వరదలా వచ్చిపడ్డాయి. అనేక అంతర్జాతీయ సంస్థలు తమ వ్యాపార విస్తరణ కోసం హైదరాబాద్‌ను 2వ గమ్యస్థానం గా ఎంచుకున్నాయి.

కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొత్త పెట్టుబడుల మాట పక్కనపెడితే గత ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్థలు కూడా పక్క రాష్ట్రాలకు పారిపోతున్నాయి. కేన్స్ టెక్నాలజీ సంస్థ ఇప్పటికే గుజరాత్‌కు వెళ్లిపోయింది. కార్నింగ్ సంస్థ తమ ప్లాంట్‌ను చెన్నైకి తరలించింది. అమరరాజా కంపెనీ తరలిపోయేందుకు సిద్ధమవుతున్నది. ఈ పరిస్థితి పోవాలంటే పెట్టుబడుల విషయంలో కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం తమ వైఖరి ఏమిటో విధానపరంగా తెలియజేయాలి. లేకపోతే కనీసం గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కొనసాగించాల్సిన అవసరం ఉన్నది. రాజకీయ ప్రయోజనాలనే దృష్టిలో పెట్టుకొని తీసుకునే నిర్ణయాల వల్ల రాష్ట్ర పురోగతి కుంటుపడుతుంది.

గత పదేండ్లలో అభివృద్ధిలో ప్రపంచంతో పోటీపడ్డ తెలంగాణ ఇప్పుడు పక్క రాష్ట్రంతో పోటీపడుతామని చెప్పే దుస్థితి ఏర్పడింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎప్పుడూ అగ్రస్థానంలో ఉండే తెలంగాణ ఇప్పుడు కనీసం టాప్ 10లో కూడా చోటు సంపాదించుకోలేకపోతున్నది. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ అప్పుల కుప్పయిందని చెప్తుండటం హేయనీయం. ఆయన వ్యాఖ్యలు రాష్ట్రానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయి. గత ప్రభుత్వం సాధించిన ప్రగతిని తొక్కిపెట్టి రాష్ట్రం దివాళా తీసిందని దివాళాకోరు రాజకీయాలు చేయడం ఎంతవరకు సబబు? ఇది రాష్ట్ర ప్రజలనే కాదు, రాష్ట్ర పురోగమనాన్ని కూడా తప్పుదోవ పట్టించడమే.

రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, మహాలక్ష్మి అమలు వంటి అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వం మీద నిందలు వేస్తున్నది. బట్టకాల్చి మీద వేసే ఇలాంటి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మానుకోవాలి. ప్రజల దృష్టిని మరల్చే ఇలాంటి పనులకు బదులు ఒక సంస్థనైనా తీసుకురావాలి.

అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదు, పాలకులు చేసిన అభివృద్ధి పనులు శాశ్వతంగా ఉండిపోతాయి. ప్రజలు కాంగ్రెస్‌కు పాలనాపగ్గాలు అప్పగించింది గత పాలకుల స్మృతులను చెరిపివేయడం కోసం కాదు, వీలైతే తెలంగాణ ప్రజల కోసం మరిన్ని మంచి పనులు చేయమని. కక్షసాధింపు రాజకీయాల వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. ఇలాంటి రాజకీయాలకు స్వస్తిపలికి గత పదేండ్ల తెలంగాణ అభివృద్ధి ప్రస్థానాన్ని కొనసాగించండి. తెలంగాణ ప్రజలకు ఒక భరోసాను కల్పించండి. మీ నుంచి తెలంగాణ సమాజం ఆశిస్తున్నది ఇదే. ఇంతకుమించి ఇంకేం కాదు.

(వ్యాసకర్త: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు)

కౌశిక్‌పై దాడి రేవంత్ కుట్రే

- పట్టపగలే కాంగ్రెస్ గూండాల హత్యాయత్నం
- ఎస్కార్ట్‌తో వచ్చి అరికెపూడి దాడికి పోలీసుల సహకారం
- ప్రజాపాలనంటే ప్రతిపక్షాలపై దాడులేనా?
- కాంగ్రెస్ అరాచకాలను రాసిపెట్టుకుంటం
- ఉడుత ఊపులకు బీఆర్‌ఎస్ బెదరదు: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడిని సీఎం రేవంత్‌రెడ్డే చేయించారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. గత కొన్నిరోజులుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం చేస్తున్న కౌశిక్‌రెడ్డిని ప్రభుత్వం టార్గెట్ చేసిందని గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కౌశిక్‌రెడ్డిని చంపేందుకు కుట్ర చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. పట్టపగలే ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి హత్యాయత్నానికి ప్రయత్నిస్తుంటే రాష్ట్రంలో అసలు లా అండ్ ఆర్డర్ ఉన్నదా? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచి, పోలీసుల సాయంతో వచ్చిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గూండాలు రెచ్చిపోయి దాడులకు పాల్పడ్డారని తెలిపారు. రాష్ట్రాన్ని ఫ్యాక్షనిజం, రౌడీయిజానికి అడ్డాగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కావాలనే అక్రమ కేసులు బనాయిస్తూ, హత్యాయత్నాలకు పాల్పడి బెదిరించే ప్రయత్నం చేయిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఉడుత ఊపులకు బీఆర్‌ఎస్ బెదరదని కేటీఆర్ స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

పక్కా ప్లాన్‌తోనే కాంగ్రెస్ గూండాల దాడి

వందల మంది రౌడీలు కోడిగుడ్లు, రాళ్లతో పక్కా ప్లాన్‌తోనే వచ్చి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేశారని కేటీఆర్ విమర్శించారు. పూర్తిగా ప్రభుత్వం, పోలీసుల సహకారంతో కౌశిక్‌రెడ్డిపై దాడి చేసే ప్రయత్నం జరిగిందని ధ్వజమెత్తారు. ఇలాంటి చిల్లర చేష్టలకు పాల్పడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చూస్తే జాలేస్తుందని, అక్రమ కేసులు, దాడులతో బెదిరించాలని చూస్తే అంతకన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదని హెచ్చరించారు. ప్రశ్నించేవారిపై ప్రభుత్వం దాడులకు తెగబడుతున్నదని, ఇందిరమ్మ పాలన, ప్రజాపాలన అంటే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై ప్రభుత్వమే దాడులు చేయించడమా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను రాసిపెట్టుకుంటామని హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ఇంతకు మించి ప్రతిఘటన తప్పదని స్పష్టంచేశారు. అరికెపూడి గాంధీ ఇంటికి వెళ్తానన్న కౌశిక్‌రెడ్డిని గృహ నిర్బంధంలో ఉంచిన పోలీసులు.. అరికెపూడి గాంధీని మాత్రం కౌశిక్‌రెడ్డి ఇంటికి వచ్చేందుకు ఎలా అనుమతించారని ప్రశ్నించారు.

కౌశిక్‌రెడ్డితోనే తెలంగాణ ప్రజలు: కేటీఆర్

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితోనే బీఆర్‌ఎస్ సహా తెలంగాణ ప్రజలు ఉన్నారని కేటీఆర్ తేల్చిచెప్పారు. కాంగ్రెస్ గూండాల దౌర్జన్యాలు, దాడులు, పిరికిపంద చర్యలని పేర్కొన్నారు. ఆ చర్యలు గులాబీ సైనికుల మనోనిబ్బరాన్ని దెబ్బతీయలేవని తేల్చిచెప్పారు. 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మా పార్టీ సైనికుల పోరాటానికి నీకు నచ్చిన పేరు పెట్టుకో' అని సవాల్ విసిరారు. తెలంగాణలోని ప్రతి అంగుళాన్ని కాంగ్రెస్ అవినీతి, దుర్మార్గ పాలన నుంచి తాము కాపాడుకుంటామని చెప్పారు. బీఆర్‌ఎస్‌ను ఏదో చేయాలన్న భయంతో సీఎం రేవంత్‌రెడ్డి చేసే పిచ్చి పనులు.. తమ సంకల్పానికి మరింత ఆజ్యం పోస్తాయని చెప్పారు.

బీఆర్‌ఎస్ నేతల అక్రమ అరెస్ట్

- సీపీ కార్యాలయం వద్ద పోలీసుల ఓవరాక్షన్
- నేతలను వాహనాల్లోకి ఈడ్చిపడేసిన పోలీసులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు చేతికి తీవ్రగాయం
- హరీశ్, ప్రశాంత్, కౌశిక్‌రెడ్డితో అనుచిత ప్రవర్తన
- లోపలికి అనుమతించకుండా అడ్డుకున్న పోలీసులు
- వేలాదిగా రావాలని కార్యకర్తలకు హరీశ్‌రావు పిలుపు
- భయంతోనే బీఆర్‌ఎస్ నేతల అక్రమ అరెస్టు



కేశంపేట పోలీస్ స్టేషన్ వద్ద ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, గంగుల తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, హత్యాయత్నం కేసు పెట్టాలని సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ మెట్లు ఎక్కిన బీఆర్‌ఎస్ నేతలను అక్రమంగా అరెస్టు చేశారు. గుంపులుగా చుట్టుముట్టి ఒక్కొక్కరిని ఈడ్చిపడేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు పట్ల పోలీసులు కర్కశంగా ప్రవర్తించారు. ఇష్టారీతిన ఈడ్చిపడేయంతో ఆయన చేతికి తీవ్రగాయమైనట్టు తెలిసింది. గురువారం సాయంత్రం 6:55 గంటలకు అరెస్టు చేసిన పోలీసులు.. కొన్ని గంటలపాటు మూడు బస్సుల్లో, పోలీసు వాహనాల్లో తిప్పారు. సాక్షాత్తూ సైబరాబాద్ కమిషనరేట్ ఆఫీసులోనే బాధితులుగా వచ్చినా తమకు తీవ్ర అన్యాయం జరిగిందని బీఆర్‌ఎస్ నేతలు గొంతెత్తి నినదించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసిన కాంగ్రెస్ గూండాలపై, ఎమ్మెల్యే గాంధీపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్‌ఎస్ నేతలు మధ్యాహ్నం సైబరాబాద్ సీపీ ఆఫీసుకు వెళ్లగా.. పోలీసులు వారిని గేటు దగ్గర నుంచే నిలువరించే ప్రయత్నం చేశారు. దీంతో బీఆర్‌ఎస్ నేతలకు, పోలీసులకు వాగ్వాదం జరిగింది. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని సైతం పోలీసులు సీపీ ఆఫీసులోకి వెళ్లకుండా అడ్డుకున్నారు.

సీపీకి ఫిర్యాదు చేసేందుకు వెళ్తుంటే..

ఎంట్రన్స్ గేటు వద్ద అడ్డగింతలు దాటుకొని సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మొహంతికి ఫిర్యాదు చేసేందుకు కమిషనరేట్‌లోకి వెళ్తుండగా బీఆర్‌ఎస్ నేతలను వందలాదిగా మోహరించిన పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. అక్కడున్న ఓ పోలీసు అధికారి బీఆర్‌ఎస్ నేతలతో అనుచితంగా ప్రవర్తించారు. హరీశ్‌రావుపై చేయివేసి, బయటికి నెట్టే ప్రయత్నం చేశారు. ఆగ్రహం వ్యక్తంచేసిన హరీశ్‌రావు.. 'మరో నాలుగేండ్లలో మా ప్రభుత్వం వస్తుంది.. అంతా తిరిగి ఇచ్చేస్తాం' అంటూ వార్నింగ్ ఇచ్చారు. బాధితుడైన ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సైతం అదే పోలీసు అధికారి అడ్డుకున్నారు. చేతులతో నెట్టే ప్రయత్నం చేయగా, ఇద్దరి మధ్య మళ్లీ తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. హరీశ్‌రావును సైతం పోలీసులు వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తుంటే.. 'సీపీ ఆఫీసుకు ప్రజలు రావొద్దా? ఫిర్యాదు చెయొద్దా?' అంటూ ప్రశ్నించారు. 'ఇది పబ్లిక్ ప్రాపర్టీ' అంటూ గట్టిగా అరిచి చెప్పారు హరీశ్‌రావు. వెనక్కి తగ్గిన పోలీసులు వారిద్దరిని లోపలికి అనుమతించారు. తీవ్ర వాగ్వాదాల అనంతరం మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద, బీఆర్‌ఎస్ నేతలు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, అనిల్, ఎర్రోళ్ల శ్రీనివాస్, రజని వంటి వారిని సీపీ ఆఫీసు లోపలికి అనుమతించారు.

జాయింట్ సీపీకి ఫిర్యాదు

ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ, అతని అనుచరులు, కాంగ్రెస్ గూండాలపై తక్షణం చర్యలు తీసుకోవడంతో, వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని సైబరాబాద్ జాయింట్ సీపీ జోయెల్ డెవిస్‌కు బీఆర్‌ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. తాను అనారోగ్యంతో ఉన్నానంటూ సీపీ అవినాశ్ మొహంతి రాకపోవడంతో.. జాయింట్ సీపీకి ఫిర్యాదు అందజేశారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి జరుగుతున్న క్రమంలో ఆ పరిసరాల్లో లేకుండా పోయిన స్థానిక డీసీపీ, ఏసీపీ, సీఐ, ఎస్సైలను సస్పెండ్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి సహకరించిన ఇతర పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన జాయింట్ సీపీ.. తక్షణం కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. కేసు నమోదు కాకపోవడంతోపాటు అదుపులోకి తీసుకున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలకు నార్సింగి పీఎస్‌లో సాక్షాత్తూ పోలీసులే రాచమర్యాదలు చేస్తున్నారంటూ బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారిని తక్షణం అదుపులోకి తీసుకొని, హత్యాయత్నం కేసు నమోదు చేసేవరకూ కదిలేదిలేదని భీష్మించారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ నేతలకు, పోలీసులకు మళ్లీ వాగ్వాదం.. తోపులాటకు దారితీసింది.

కమిషనరేట్‌లోనే బీఆర్‌ఎస్ బైఠాయింపు

కాంగ్రెస్ నేతలపై కేసులు నమోదు చేసేందుకు సైబరాబాద్ పోలీసులు వెనకడుగు వేయడంతో.. బీఆర్‌ఎస్ నేతలు కమిషనరేట్ లోనే బైఠాయించారు. ఈ క్రమంలో మళ్లీ తోపులాట జరిగింది. మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 7వరకు బీఆర్‌ఎస్ నేతలు న్యాయం కోసం నినదించారు.

వంటావార్పుకు హరీశ్‌రావు పిలుపు

దాడి చేసినవారిపై పోలీసులు ఏ కేసులు పెట్టారో సాయంత్రం వరకూ కూడా బీఆర్‌ఎస్ నేతలకు స్పష్టత ఇవ్వకపోవడంతో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు వేలాదిగా సైబరాబాద్ కమిషనరేట్‌కు తరలి రావాలని, న్యాయం జరిగేంత వరకూ వంటా-వార్పు చేపట్టాలని పిలుపునిచ్చారు. అంతర్మథనంలో పడిన పోలీసులు.. ఉన్నతాధికారుల సూచనల మేరకు బీఆర్‌ఎస్ నేతల అరెస్టుకు రంగం సిద్ధంచేశారు. అప్పటికే కమిషనరేట్ బయట వందలాదిగా ఉన్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు లోపలికి వస్తే.. వారికి వేలాది కార్యకర్తలు తోడైతే పరిస్థితి చేయిదాటి పోతుందని గమనించి మీడియాతో మాట్లాడటం అయిపోయిన వెంటనే బీఆర్‌ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. చేతికి తగిలిన గాయంతో బాధపడుతున్న హరీశ్‌రావును దవాఖానకు తరలించకుండా పోలీసు వాహనాల్లో తిప్పడంపై తీవ్ర విమర్శలొస్తున్నాయి.

ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తున్నది?



- బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి విషయాన్ని పసిగట్టడంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏంచేస్తున్నది? స్పెషల్ బ్రాంచి ఎటుపోయింది? అని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి అనంతరం సైబరాబాద్ సీపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆంధ్రా ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోనే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి తెగబడ్డారని స్పష్టంచేశారు. 20 కిలోమీటర్ల దూరం నుంచి ఎమ్మెల్యే గాంధీ తన అనుచరులు, గూండాలు ర్యాలీగా వస్తుంటే పోలీసులు ముందస్తు అరెస్టులు ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. దాడిని నివారించేందుకు బాష్పవాయు ఎందుకు ప్రయోగించలేదు? ఎందుకు బలగాలను మోహరించలేదు? 20 కి.మీ. పరిధిలో ఎన్ని పోలీసులు స్టేషన్లు ఉన్నాయి? ఎందుకు అరెస్టు చేయలేదు? ఇదంతా సీఎంకు తెలియకుండానే జరిగిందా? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగా మాట్లాడితే సీఎం ఎందుకు భయపడుతున్నాడో చెప్పాలని కోరారు. రాష్ట్రంలో పాలన పడకేసి దోపిడీ జరుగుతుందని, ఆ దోపిడీని ప్రశ్నించేవారిపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు.

దాడులకు సీఎం రేవంత్ ప్రోత్సాహం

- బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి సహా ఇటీవల బీఆర్‌ఎస్ నేతలపై వరుస దాడులకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహం ఉన్నదని బీఆర్‌ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తిక్‌రెడ్డి విమర్శించారు. సైబరాబాద్ సీపీ ఆఫీసులో ఆయన మీడియాతో మాట్లాడారు. నెలరోజుల వ్యవధిలోనే హరీశ్‌రావు క్యాంపు ఆఫీసుపై, ఖమ్మంలో, నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలపై, ఇప్పుడు కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడులకు తెగబడ్డారని తెలిపారు. ఇట్లాంటి ఘటనలతో పోలీసులపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతుందని చెప్పారు. మా ఓపికను పరీక్షించకండి.. తెలంగాణ ప్రశాంతంగా ఉండేందుకు మేము కట్టుబడి ఉన్నాం.. మా మరో ముఖం చూడొద్దు' అని హెచ్చరించారు.

మహిళలను దుర్భాషలాడిన గాంధీపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



మహిళలను కించపరిచేలా దుర్భాషలాడిన ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై మహిళా కమిషన్ చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. తల్లిని అవమానించేలా పదే పదే ఎమ్మెల్యే గాంధీ తీవ్ర దుర్భాషలాడారని, ఇప్పుడు మహిళా కాంగ్రెస్ నాయకులు ఎక్కడికి పోయారు? అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డిపై కొందరు ఆంధ్రా గూండాలు పక్కా ప్రణాళికతో దాడికి యత్నించారని ధ్వజమెత్తారు. గత పదేండ్లలో ఎన్నడూ ఇలాంటివి తెలంగాణలో జరగలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇలాంటి దుర్మార్గాలను, గూండాగిరిని చూస్తున్నామని దుయ్యబట్టారు.

రాష్ట్రంలో రౌడీ రాజకీయానికి ఆజ్యం

- బీఆర్‌ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి




సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రౌడీ రాజకీయానికి ఆజ్యం పోస్తున్నాడని బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. విధ్వంసం, వినాశనం, అరాచకమే కాంగ్రెస్ ప్రభుత్వ మూల సూత్రాలు అని పేర్కొన్నారు. పదేండ్లు ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో 10 నెలలు గడవకముందే మళ్లీ పాత రోజులను తెచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ గూండారాజ్!

మొదటిపేజీ తరువాయి...

విధానం! పార్టీ మారనేలేదన్న అరికెపూడి గాంధీకి.. మరి అలాంటప్పుడు గులాబీ కండువా కప్పుకోమనడం తప్పుగా తోచింది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సవాల్ కాంగ్రెస్ పెద్దలకు ఆగ్రహం తెప్పించింది. అసలే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టులో పిటిషన్ వేసిన కౌశిక్‌పై పీకలదాక ఉన్న కోపం.. పీఏసీ పదవితో బయటపడింది. మొదట హౌస్ అరెస్టు అంటూ బలగాలను దింపి కౌశిక్‌ను ఇంటికే పరిమితం చేశారు. కొద్దిగంటల్లోనే పోలీసులను తగ్గించి.. దాడికి రంగం సిద్ధంచేశారు. కూకట్‌పల్లి నుంచి కొండాపూర్ దాక 9 కిలోమీటర్లు మందీమార్బలంతో అరికెపూడి బయల్దేరినా పోలీసులు చూడనట్టే ఉండిపోయారు. వరుస వాహనాలతో ఫ్యాక్షన్ లీడర్ తరహాలో కాన్వాయ్ బయల్దేరితే.. అదేదో దండయాత్రలా కాకుండా 'గాంధీ- దండి యాత్ర'లానే పోలీసులు చూస్తుండిపోయారు. చివరకు పాడి ఇంటిమీద రాళ్లదాడి జరుగుతున్నా పట్టనట్టే వ్యవహరించారు. తరుచూ రాజ్యాంగం చేతపట్టుకుని ప్రజాస్వామ్య విలువలు ప్రబోధిస్తూ కనిపిస్తున్న కాంగ్రెస్ అధినాయకుడిని, నేతలను కలిసేందుకు ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లిన సమయంలోనే ఇక్కడ ఎమ్మెల్యేపై దాడి జరిగింది! ఎవరి ఆదేశాల మేరకు?


కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసేందుకు పలు వాహనాల్లో వెళ్తున్న రౌడీ దండు

చివరికి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లినప్పుడూ బీఆర్‌ఎస్ నేతలపై అరాచకకాండ కొనసాగింది. సైబరాబాద్ కమిషనరేట్‌లోకి వెళ్లకుండా పోలీసులే అడ్డగించారు. హరీశ్ సహా మాజీ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ఉన్నా లోనికి అనుమతించలేదు. దీంతో నేతలంతా అక్కడే మెట్లపై బైఠాయించారు. అరికెపూడిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని నినదించారు. రెండు గంటలపాటు ఆందోళన కొనసాగుతున్నా ఉన్నతాధికారులను కలిసేందుకు అనుమతించలేదు. అధికారులూ అక్కడికి వచ్చి వారికి హామీ ఇచ్చే ప్రయత్నం చేయలేదు. చివరకు వాళ్లందరినీ ఈడ్చుకెళ్లి వాహనాల్లో బయటకు తీసుకెళ్లారు. రెండు బస్సుల్లో వేర్వేరు రూట్లలో తీసుకెళ్తూ.. మూడు గంటలపాటు రోడ్లపైనే తిప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లోకి తీసుకెళ్తున్నారన్న సమాచారంతో తెలంగాణవాదులు, బీఆర్‌ఎస్ అభిమానులు ఆందోళనకు గురయ్యారు. రోడ్లపైకి వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేశంపేట, తలకొండపల్లిల్లో వందలాదిమంది స్థానికులు అడ్డుకోవడంతో పోలీసు వాహనాలు నిలిచిపోయాయి. వాహనాలను కదలనివ్వని జనం.. వాటి టైర్లకు నిప్పుపెట్టారు. ప్రజలను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జికి దిగారు. 'సీఎం డౌన్ డౌన్..' 'రేవంతరెడ్డీ ఖబర్దార్' అన్న నినాదాల మధ్య.. బీఆర్‌ఎస్ నేతలను కేశంపేట స్టేషన్‌కు తరలించారు. హైదరాబాద్‌లో అరెస్టు చేసిన నాయకులను రంగారెడ్డి జిల్లాలోని మారుమూల ఠాణాకు తీసుకెళ్లడం వెనుక ఏ ఒత్తిళ్లు పనిచేశాయి? గాంధీని అరెస్టు చేసి నార్సింగి స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు.. స్టేషన్ బెయిల్ ఇచ్చి 'మర్యాదగా' ఇంటికి పంపారు. దాడిపై చర్యలు తీసుకోవాలన్న బీఆర్‌ఎస్ నాయకులను జిల్లాలు తిప్పుతూ తీసుకెళ్లారు. పోలీసుల దురుసు ప్రవర్తనలో హరీశ్ సహా పలువురు నేతలు గాయపడ్డారు. పరిస్థితి చేయిదాటుతుండటం, ప్రతిఘటన తీవ్రమవుతుండటంతో పోలీసులు వెనక్కి తగ్గారు. బీఆర్‌ఎస్ నేతలను బేషరతుగా విడుదల చేశారు.

వాళ్లను అడ్డుకోవద్దు?

- దాడి వెనుక పెద్దల ఆదేశం..
- పోలీసుల తీరుపైనా అనుమానాలు


గురువారం ఉదయం కౌశిక్‌రెడ్డి ఇంటివద్ద బందోబస్తులో పోలీసులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ దాడి వెనుక పెద్దల హస్తం ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారి ఆదేశాల మేరకే పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించారన్న చర్చ జరుగుతున్నది. ఎమ్మెల్యే గాంధీ నివాసం వివేకానందనగర్ నుంచి 9 కిలోమీటర్ల దూరంలో కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి ఇంటికి మధ్యలో 8 జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఉన్నాయి. కానీ.. ఎక్కడా 20 వాహనాల ఆ కాన్వాయ్ ఆగలేదు.. పోలీసులూ అడ్డుకోలేదు. గేటెడ్ కమ్యూనిటీలోకి వాహనాలు చొచ్చుకొస్తున్నా, ప్రధాన గేటుపైకి ఎక్కి, తన్నుకుంటూ వీరంగం సృష్టించినా, రాళ్లు విసిరినా పోలీసులు పెద్దగా అడ్డుకున్నట్టు కనిపించలేదు. 2గంటల బీభత్సాన్ని సృష్టించినా పోలీసులు స్పందించలేదని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం దాడి వెనుక ప్రభుత్వ పెద్దలు, పోలీస్ ఉన్నతాధికారుల హస్తం ఉన్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'వాళ్లను అడ్డుకోవద్దు' అని ఆదేశాలు ఇవ్వడం వల్లే కాన్వాయ్ 20 నిమిషాల్లోనే కౌశిక్‌రెడ్డి ఇంటికి చేరిందని అంటున్నారు. ఆ ఆదేశాలు ఎవరు ఇచ్చారన్న చర్చ పెద్దఎత్తున జరుగుతున్నది. దాడిపై ముందుగానే సమాచారమున్నా ఇంటెలిజెన్స్ వర్గాలు గప్‌చుప్‌గా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్ గూండాలపై హత్యాయత్నం కేసుపెట్టాలి

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడికి తెగబడిన కాంగ్రెస్ గూండాలపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ దాడికి సహకరించిన స్థానిక పోలీస్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. సైబరాబాద్ సీపీ ఆఫీసు వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసులో పాత్ర ఉన్న ప్రతి ఒక్కరినీ అరెస్టు చేయాలని చెప్పారు. 20 కిలోమీటర్ల దూరం నుంచి కార్ల కాన్వాయ్‌లో ఓ ఎమ్మెల్యే తన అనుచరులతో దాడి చేసేందుకు వస్తుంటే.. ఏ ఒక్కరూ కూడా ఎందుకు ఆపలేదో చెప్పాలని ప్రశ్నించారు. నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలకు పోలీసులు కుర్చీల్లో కూర్చోబెట్టి, టీలు, బిర్యానీలు తెప్పిస్తూ.. రాచమర్యాదలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతుందని, నిందితులను బయటికి వదిలిపెట్టడం సిగ్గుమాలిన చర్య అని పేర్కొన్నారు. ఈ తరహా దాడులను సీఎం నియంత్రించాలని, మేధావులు ఈ చర్యలను ఖండించాలని కోరారు.

పోలీసుల వైఫల్యమా? ప్రభుత్వ ప్రోత్సాహమా?



- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి పోలీసుల వైఫల్యమా? ప్రభుత్వ ప్రోత్సాహమా? అనేది నిగ్గుతేల్చాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు, గాంధీని భారీ కాన్వాయ్‌తో ఎలా అనుమతించారని ప్రశ్నించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ప్రతిపక్షంలోనే ఉంటే బీఆర్‌ఎస్ కండువా కప్పుకోవాలని సూచించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరింది నిజమేనన్న విషయం ప్రజలందరికీ తెలుసని, పీఏసీ పదవి రావడంతో ప్రతిపక్షంలో ఉన్నట్టు చెప్పుకుంటున్నారని తెలిపారు.

ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే దాడి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



పాడి కౌశిక్‌రెడ్డిపై ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే దాడి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. పక్కా ప్రణాళికతోనే కాంగ్రెస్ జరిపిన విద్రోహ చర్య అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో రౌడీ పాలన కొనసాగుతుందని విమర్శించారు. అరికపూడి గాంధీ స్వయంగా కండువా కప్పుకుని కాంగ్రెస్ పార్టీలో చేరారని, పీఏసీ చైర్మన్ పదవి కోసం నాటకాలు ఆడుతున్నాడని ధ్వజమెత్తారు. పీఏసీ చైర్మన్ పదవి అనవాయితీని తుంగలో తొక్కి నీతిమాలిన రాజకీయానికి సీఎం రేవంత్‌రెడ్డి తెరలేపారని విమర్శించారు.

కౌశిక్‌రెడ్డిపై దాడి ఉన్మాద చర్య

- బీఆర్‌ఎస్ శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి ఉన్మాద చర్య అని శాసనమండలిలో బీఆర్‌ఎస్ ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. భౌతికదాడులు చేయడం దారుణమని పేర్కొన్నారు. దాడిచేసిన ఎమ్మెల్యే గాంధీ మీద, అతని అనుచరుల మీద తక్షణం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రోత్సహించిన పోలీసులను తక్షణం సస్పెండ్ చేసి, చర్యలు తీసుకోవాలని కోరారు. దాడి చేసిన వారు రాచమర్యాదలతో పోలీస్‌స్టేషన్‌లో ఉంటే, తాము న్యాయంకోసం సీపీ ఆఫీసు మెట్లెక్కామని తెలిపారు. న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని చెప్పారు.

దాడిపై ముఖ్యమంత్రి స్పందించాలి

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



కౌశిక్‌రెడ్డిపై దాడి ఘటనపైన సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఒక ఎమ్మెల్యే మరో ఎమ్మెల్యేపై దాడి చేయడం గర్హనీయమని, ఈ ఘటనపై సీఎంతోపాటు స్పీకర్, డీజీపీ కూడా స్పందించాలని కోరారు. దాడికి పాల్పడిన ఎమ్మెల్యే గాంధీని రాచమర్యాదలతో పోలీసులు ఇంటికి పంపారని, దౌర్జన్యంపై ఫిర్యాదు చేసేందుకు సీపీని కలిసేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నేతలను గేటు వద్దే నిలిపేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

గూండాగిరి చేసిన గాంధీకి రాచమర్యాదలా?



- మాజీ మంత్రి గంగుల కమలాకర్

ఎమ్మెల్యేపై హత్యాయత్నం చేసిన మరో ఎమ్మెల్యే గాంధీకి రాచమర్యాదలు.. ఫిర్యాదు చేసేందుకు వచ్చిన తమకేమో అవమానాలా? అని మాజీ మంత్రి గంగుల కమలాకర్ పోలీస్ అధికారులను ప్రశ్నించారు. కాంగ్రెస్ ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్నా గూండాగిరే సాగిస్తుందని, ఈ సర్కారుపై ఢిల్లీకి వెళ్లి ఫిర్యాదు చేస్తామని, దాడి ఘటనపై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ఎమ్మెల్యే గాంధీపై 307 కింద హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గాడ్సేగా మారిన గాంధీ

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



ఎమ్మెల్యే గాంధీ గాడ్సేగా మారారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేయాలని సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని, ఢిల్లీలో ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని తెలిపారు. ఆంధ్రా, తెలంగాణ అని రెచ్చగొట్టింది రేవంత్‌రెడ్డే అని స్పష్టం చేశారు. దానం నాగేందర్ నీకు దమ్ముందా, ఇంటిని చుట్టుముడుతావా అంటూ నిలదీశారు. గులాబీ దండు వల్లే నువ్వు గెలిచావనే విషయాన్ని మరిచావా అంటూ గుర్తుచేశారు. తెలంగాణ సమాజం మీద దాడి చేస్తే ఊరుకోమని, రేవంత్‌రెడ్డికి మీరు భయపెడితే మేము భయపడబోమని తేల్చిచెప్పారు.

గాంధీని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద

కాంగ్రెస్ కండువా కప్పుకొని బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని చెప్తున్న ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిని తెలంగాణ సమాజంపై దాడిగానే భావిస్తామని చెప్పారు. తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి ఆటవిక పాలన సాగిస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి దాడులకు ఉసిగొల్పుతున్నారని విమర్శించారు.

కేసీఆర్ పాలనలో అందరి లెక్కలు తేలుస్తాం

- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి



వచ్చే ఎన్నికల అనంతరం కేసీఆర్ పాలనే వస్తుందని, అప్పుడు అందరి లెక్కలు తెలుస్తామని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొమ్ముగాసిన పోలీసుల పేర్లు పింక్ బుక్‌లో ఎక్కిస్తున్నామని స్పష్టంచేశారు. కౌశిక్‌పై కాంగ్రెస్ గూండాలు జరిపిన దాడి హేయమైన చర్యగా పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని ధ్వజమెత్తారు.

కేసీఆర్ పదేండ్ల పాలనంతా శాంతియుతం



- మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

కేసీఆర్ పాలించిన గత పదేండ్లలో హైదరాబాద్ సహా రాష్ట్రంలో ఎలాంటి అలజడులు, అల్లర్లు, దాడులు జరగకుండా శాతియుత పాలన సాగిందని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్య విలువలు హరించుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై హత్యాయత్నం ఘటనను చూస్తుంటే శాంతిభద్రతలు ప్రశ్నార్థకమయ్యాయని తెలిపారు. కౌశిక్‌రెడ్డిపై ఉద్దేశపూర్వకంగానే హత్యాయత్నం జరిగిందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులకు చోటులేదని స్పష్టం చేశారు.



బీఆర్‌ఎస్ నేతల అరెస్టుతో రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్ స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న కార్యకర్తలు, ప్రజలు



రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో భగ్గుమన్న నిరసనలు

మర్లవడ్డ తెలంగాణ.. సర్కారు హైరానా

బేషరతుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల విడుదల

కేశంపేటలో అర్ధరాత్రిదాకా ఆందోళనలు.. డీజీపీ హామీ మేరకు సహకరిస్తున్నాం

దాడిచేసినవారిపై హత్యాయత్నం.. కేసు నమోదు చేస్తామన్నారు

కార్యకర్తలను ఇబ్బందిపెడితే మా ప్రాణాలను అడ్డుపెడతాం:హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ప్రజాందోళనలకు కాంగ్రెస్ ప్రభుత్వం తలొగ్గింది. కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలను గురువారం రాత్రి బేషరతుగా విడుదల చేసింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11:30 గంటలకు బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు చేసిన ఉద్యమానికి, ముఖ్యంగా కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్దకు తరలివచ్చిన వేల మంది బీఆర్‌ఎస్ కార్యకర్తల పోరాటానికి ప్రభుత్వం, పోలీసులు దిగివచ్చారు. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసినవారిపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని డీజీపీ హామీ ఇవ్వడంతో కార్యకర్తలు వెనుదిరిగారు. అంతకుముందు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై ఫిరాయింపు ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మూకదాడి జరిపిన సంఘటన నేపథ్యంలో పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహోదగ్రులయ్యారు. పోలీసు అధికారులు కాంగ్రెస్ బాసుల కనుసన్నల్లో పనిచేస్తున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ఘటనపై ఫిర్యాదు చేయటానికి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు వెళ్లిన మాజీమంత్రులు హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, అనేకమంది బీఆర్‌ఎస్ నాయకులను రెండు బృందాలుగా విడగొట్టి అనేక గంటలపాటు పోలీస్ వాహనాల్లో తిప్పి.. రంగారెడ్డి జిల్లాలోని కేశంపేట, తలకొండపల్లి స్టేషన్లకు తరలించారు. ఈ విషయం తెలిసిన వేల మంది స్థానిక ప్రజలు, గ్రామస్థులు, బీఆర్‌ఎస్ అభిమానులు పోలీస్ స్టేషన్ల ముందు ఆందోళనకు దిగారు. పోలీస్ వాహనాలను అడ్డుకొన్నారు. నిప్పు పెట్టి టైర్లను కాల్చేశారు. పోలీసులు పలుమార్లు

దయచేసి సహకరించాలని హరీశ్‌కు డీజీపీ ఫోన్



కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులను ఎందుకు అరెస్టు చేశారో చెప్పాలని పోలీసులకు చేతులు జోడించి దండం పెడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మాజీ మంత్రి గంగుల కమలాకర్ తదితరులు

వారిపై లాఠీచార్జీ చేసినా ప్రజలు వెనక్కి తగ్గలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్ నేతలను విడుదల చేస్తున్నట్టు పోలీసులు ప్రకటించారు. అయితే, తమను ఎందుకు నిర్బంధించారో, ఇన్ని గంటలసేపు ఎందుకు పోలీస్ వాహనాల్లో తిప్పారో, ఎందుకు ఇంత దూరం తీసుకొని వచ్చారో చెప్పనిదే తాము స్టేషన్‌ను విడిచి బయట కాలు పెట్టే సమస్యే లేదని బీఆర్‌ఎస్ నేతలు తేల్చిచెప్పారు. ముఖ్యం గా.. తాము ఫోన్ చేసినప్పుడు పోలీస్ ఉన్నతాధికారులు ఎందుకు స్పందించలేదని స్థానిక పోలీసులను హరీశ్‌రావు ప్రశ్నించారు. ఒక దశలో స్థానిక పోలీసులు హరీశ్‌రావుకు దండం పెట్టి మరీ.. దయచేసి స్టేషన్ నుంచి వెళ్లిపోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అయితే, హరీశ్‌రావు వారికి ప్రతినమస్కారం చేసి తమ ప్రశ్నలకు జవాబిచ్చేవరకు స్టేషన్ నుంచి కదిలే సమస్యే లేదని అంతే మర్యాదగా జవాబిచ్చారు. 'ఇదెక్కడి దుర్మార్గం.. మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారు? ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు? శాసనసభ్యులను అరెస్ట్ చేసే ముందు స్పీకర్ అనుమతి తీసుకున్నారా?' అని నిలదీశారు. హరీశ్‌రావు ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పలేక బిక్కముఖం వేశారు. ఠాణా నుంచి బయటకు వెళ్లబోమని హరీశ్‌రావు తదితరులు భీష్మించటం, బయట వేల సంఖ్యలో జనం గుమిగూడటం.. పెద్ద ఎత్తున నినాదాలు.. లాఠీచార్జీతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. దీంతో పరిస్థితి చేయిదాటిపోయే అవకాశం ఉన్నదని ఉన్నతాధికారులకు స్థానిక పోలీస్ అధికారులు నివేదించారు. పర్యవసానంగా డీజీపీ జితేందర్ హరీశ్‌రావుకు ఫోన్‌చేసి మాట్లాడారు. దయచేసి సహకరించాలని, స్టేషన్ నుంచి వెళ్లిపోవాలని డీజీపీ.. హరీశ్‌రావును రిక్వెస్ట్ చేశారు. 'కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వకుండా గంటల తరబడి వాహనాల్లో మమ్మల్ని ఎందుకు తిప్పారు? ప్రజాప్రతినిధులం అనే గౌరవం కూడా లేకుండా పోలీసులు అలా ఎలా వ్యవహరిస్తారు? శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారు?' అని హరీశ్.. డీజీపీపై ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో డీజీపీ ఆయనకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. 'మీరు సీనియర్ నాయకులు. మనమంతా కలిసి తెలంగాణ తెచ్చుకున్నాం. దాన్ని అభివృద్ధి చేసుకున్నాం. మీ అభ్యంతరాలు, ఆరోపణలన్నింటినీ నేను పరిగణనలోకి తీసుకొన్నాను. వాటిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాను. కౌశిక్ ఇంటిపై దాడిచేసిన గాంధీ, ఆయన అనుచరులపై ఇప్పటికే 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశాం. మీరు మాకు సహకరించాలి. మీపట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై తప్పక విచారణ జరుపుతాం. రాష్ట్రంలో వినాయక నవరాత్రులు జరుగుతున్నాయి. త్వరలో నిమజ్జనం ఉన్నది. మీరు మాకు సహకరించాలి' అని డీజీపీ పదేపదే విజ్ఞప్తి చేశారు.

బాధ్యతతో సహకరిస్తున్నాం: హరీశ్ రావు

పోలీసులు భేషరతుగా విడుదల చేస్తున్న సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ఈ పోరాటంలో పాలు పంచుకున్న ఎమ్మెల్యేలకు, బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం బాగుండాలని కోరుకునే పార్టీగా బాధ్యతతో ఆందోళనను విరమిస్తున్నట్టు చెప్పారు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. నేతలను అరెస్ట్ చేయలేదని, బేషరతుగా విడుదల చేస్తున్నట్టు చెప్పారన్నారు. రాష్ట్రంలో ఓవైపు గణేశ్ నిమజ్జనం జరుగుతున్నదని, ఇలాంటి సమయంలో శాంతి భద్రతలకు సమస్యలు కలిగించవద్దని, పోలీసులకు సహకరించాలని కోరారన్నారు. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బతినొద్దనే ఉద్దేశంతో డీజీపీ హామీ మేరకు వెనక్కి వెళ్తున్నట్టు చెప్పారు. మాట మీద నిలబడాలని కోరారు. లేదంటే మరోసారి ఉద్యమం చేస్తామన్నారు. అధికారంలో ఎవరున్నారన్నది సమస్య కాదని, ఈరోజు వాళ్ల దగ్గర ఉంటే, రేపు తమ దగ్గర ఉండొచ్చన్నారు. శాంతి భద్రతలు కాపాడాలని, ఏకపక్షంగా కాకుండా న్యాయం పక్షాన ఉండాలని పోలీసు అధికారులను కోరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. 'మీకు ఎన్నిరకాలుగా కృతజ్ఞత చెప్పినా తక్కువే. మమ్మల్ని అరెస్ట్ చేసి కేశపట్నంవైపు తెస్తున్నారని తెలియగానే కొన్ని నిమిషాల్లో వచ్చారు. ప్రాణాలకు తెగించి అడ్డం పడ్డారు. మేం వెళ్లిన తర్వాత మా కార్యకర్తలను ఇబ్బంది పెడితే తిరిగి వస్తాం. మా ప్రాణాలను అడ్డం పెట్టి అయినా వారి కోసం పోరాడుతాం' అని స్పష్టం చేశారు. జిల్లాల్లో కార్యకర్తలను బైండోవర్ చేస్తున్నారని, అలాంటి చర్యలు మానుకోవాలని పోలీసులను కోరారు. కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. 'మన లక్ష్యం రైతులకు రుణమాఫీ కావాలి.. మన లక్ష్యం పేదలకు రూ.4వేల ఆసరా పెన్షన్లు అందాలి.. మన లక్ష్యం మహిళలకు ప్రతి నెల రూ.2,500 రావాలి.. దాని కోసం పోరాడుదాం' అని విజ్ఞప్తి చేశారు.

అమెరికా నుంచి డీజీపీకి కేటీఆర్ ఫోన్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తమ పార్టీ ఎమ్మెల్యేలపై జరుగుతున్న వరుస దాడులను కేటీఆర్ ఖండించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గురువారం రాత్రి డీజీపీతో ఫోన్‌లో మాట్లాడారు. ఖమ్మంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితాఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్‌పై కాంగ్రెస్ నాయకుల దాడిని ప్రస్తావించారు. రైతు రుణమాఫీపై శాంతియుతంగా ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెలపై దాడిని గుర్తుచేశారు. తాజాగా కౌశిక్‌రెడ్డిపై ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ చేసిన దాడి ఘటనలపై పోలీసుల నిష్క్రియాపరత్వాన్ని ఆయన డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై డీజీపీ సానుకూలంగా స్పందించి విచారణ చేపడతామని పేర్కొన్నారని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

హరీశ్ భుజానికి తీవ్రగాయం!

- **కర్కశంగా ఈడ్చిపడేసిన పోలీసులు**
- **నొప్పితో విలవిల్లాడిన మాజీ మంత్రి**
- **నొప్పితోనే.. పోలీస్‌స్టేషన్‌లో**

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పోలీసుల కర్కశత్వం వల్ల మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎడమ భుజానికి తీవ్ర గాయమైంది. సైబరాబాద్ కమిషనరేట్‌లో సాయంత్రం హరీశ్‌రావును అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయనను కర్కశంగా ఈడ్చిపడేశారు. ఇష్టమొచ్చినట్లు నెట్టేయడంతో ఆయన ఎడమ భుజానికి తీవ్రగాయమైనట్టు తెలిసింది. పోలీసులు అదుపులోకి తీసుకునే క్రమంలోనే గాయం కావడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల్లో కొందరు కావాలనే హరీశ్‌రావును గాయపర్చినట్టు ప్రత్యక్షసాక్షులు చెప్తున్నారు. ఆయన నొప్పిని భరిస్తూ పోలీసుల తీరును నిరసించారు. చేయి నొప్పి పెడుతున్నదని అరిచినా.. కనీసం కనికరం లేకుండా పోలీసులు ఇష్టారీతిన ఈడ్చిపడేయడంతో ఆ నొప్పి మరింత తీవ్రతరమైనట్టు తెలిసింది. సాయంత్రం 7 గంటల ప్రాంతంలో హరీశ్‌రావును అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ నొప్పికి ఎలాంటి ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టలేదు. బస్సులో గంటల తరబడి తిప్పుతున్నా హరీశ్‌రావు నొప్పిని భరించారు. ఎక్కడైనా ప్రథమ చికిత్స కోసం ఆపాలని పోలీసులను అడిగినా.. ఎవరూ స్పందించలేదని తోటి బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు. దీంతో అలాగే భుజం నొప్పిని భరిస్తూ.. కేశంపేటకు చేరుకున్నారు. కేశంపేట పోలీస్‌స్టేషన్ లోపలికి తరలించే క్రమంలోనూ మరోసారి పోలీసులు నెట్టివేయడంతో ఆ నొప్పి మరింత తీవ్రమైందని బీఆర్‌ఎస్ నేతలు చెప్పారు. స్టేషన్ బయట కార్యకర్తలతో మాట్లాడేటప్పుడు కూడా ఆ నొప్పిని మునిపంటితో అదిమిపట్టి దిశానిర్దేశం చేశారు. సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11.20 వరకు పోలీసుల అదుపులో ఉన్న హరీశ్‌రావు.. తన వాహనంలో వెళ్తూ ప్రథమ చికిత్స తీసుకున్నట్టు తెలిసింది.

కేశంపేట.. తలకొండపల్లి ఉద్యమ స్ఫూర్తి

- **బీఆర్‌ఎస్‌కు అపూర్వ సంఘీభావం**

హైదరాబాద్/రంగారెడ్డి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులను అరెస్టు చేసిన పోలీసులు వారిన వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న సమయంలో రంగారెడ్డి జిల్లాలోని కేశంపేట, తలకొండపల్లి గ్రామాల ప్రజలు మరోసారి నాటి ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించారు. కేశంపేట వద్ద హరీశ్‌రావు, గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులున్న వాహనాలకు అడ్డంగా రోడ్డుపై దాదాపు వెయ్యి మందికి పైగా స్థానిక ప్రజలు బైఠాయించారు. ప్రజల నుంచి ఊహించని ప్రతిఘటన ఎదురవ్వడంతో పోలీసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు హరీశ్‌రావు బృందాన్ని తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌లు పోలీస్ స్టేషన్‌కు హుటాహుటిన వచ్చారు.అయితే, పోలీస్‌స్టేషన్ వద్దకు వేలాది ప్రజలు చేరుకొని నినాదాలతో హోరెత్తించారు. ఒక దశలో పోలీసులు చేతులెత్తేశారు. ఏం చేయాలో పాలుపోక.. 'దయచేసి వెళ్లిపోండి సర్' అంటూ తాము అరెస్టు చేసి తీసుకొచ్చిన బీఆర్‌ఎస్ నేతలను బతిమాలుకున్నారు. మధుసూదనాచారి, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, డాక్టర్ సంజయ్, వివేక్, శంభీపూర్ రాజు తదితరులను తలకొండపల్లి వైపు తీసుకెళ్లారు. ఈ విషయం తెలిసిన తలకొండపల్లి ప్రజలు భారీగా తరలి వచ్చి ప్రధాన రహదారిపై ఆయా వాహనాలను అడ్డుకున్నారు. పోలీసులు లాఠీచార్జి చేస్తున్నప్పటికీ వెనక్కితగ్గలేదు. వేరే గత్యంతరం లేకపోవడంతో బీఆర్‌ఎస్ నేతలను తలకొండపల్లె పోలీసుస్టేషన్‌కు తరలించారు. తమను సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ వద్ద అదుపులోకి తీసుకొని సుమారు రెండు గంటలపాటు రోడ్లపై తిప్పారని, మారుమూల గ్రామాల నుంచి అత్యంత వేగంతో వాహనాల్లో తరలించారని శాసన మండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి వివరించారు.

కౌశిక్ హౌస్ అరెస్ట్.. గాంధీ కాన్వాయ్‌కి పూర్తి పర్మిట్!

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని పోలీసులు గురువారం కొండాపూర్‌లోని ఆయన ఇంట్లో హౌస్ అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరడం ద్వారా పీఏసీ చైర్మన్‌గా ఎంపికైనట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఇంటి వద్ద బీఆర్‌ఎస్ జెండా ఎగురవేస్తానని కౌశిక్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఇంటివద్ద పోలీసులు మోహరించారు. కౌశిక్‌రెడ్డిని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను కూడా అనుమతించలేదు.

రెచ్చిపోయిన గాంధీ

కౌశిక్‌రెడ్డిని గృహనిర్బంధం చేయడంతో అరికెపూడి రెచ్చిపోయారు. గాంధీ ఫ్యాక్షనిస్టుల తరహాలో భారీ వాహనశ్రేణితో కొండాపూర్‌లోని కౌశిక్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. గేటెడ్ కమ్యూనిటీ గేట్ వద్ద స్థానికులను అనుమతించని పోలీసులు గాంధీని, ఆయన అనుచరులను మాత్రం వెళ్లనిచ్చారు. దీంతో యథేచ్ఛగా లోపలికి వచ్చిన రౌడీమూక కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడిచేసినట్టు తెలుస్తున్నది.

ఆహ్వానించేందుకు సిద్ధమైన కౌశిక్

గాంధీని సాదరంగా తన ఇంట్లోకి ఆహ్వానించడానికే కౌశిక్‌రెడ్డి సిద్ధమైనట్టు చెప్తున్నారు. బీఆర్‌ఎస్ మహిళానేతలు కూడా హారతి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. గాంధీని సాదరంగా ఆహ్వానించి, భోజనం పెట్టి, తెలంగాణభవన్‌కు వెళ్లి ప్రెస్‌మీట్ నిర్వహించి, కేసీఆర్ వద్దకు వెళ్లాలని కౌశిక్‌రెడ్డి భావించినట్టు పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. అయినప్పటికీ గాంధీ వ్యూహం ప్రకారం కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయించారు.

భగ్గుమన్న తెలంగాణ

- **బీఆర్‌ఎస్ నేతల అక్రమ అరెస్టులపై జనాగ్రహం**
- **రాష్ట్రవ్యాప్తంగా బీఆర్‌ఎస్ శ్రేణుల ఆందోళనలు**
- **బీఆర్‌ఎస్ నేతలను తరలిస్తున్న వాహనాల అడ్డగింత**
- **బీఆర్‌ఎస్ శ్రేణులపై విరిగిన లాఠీ**
- **వేలాదిగా తరలిన క్యాడర్**



రంగారెడ్డి జిల్లా కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులను తరలిస్తున్న పోలీసుల వాహనాన్ని అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తొలిదశ, మలిదశ ఉద్యమాల తర్వాత తెలంగాణ సమాజం మరోసారి తిరగబడింది. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కిన వారినే అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా నిరసించింది. అరెస్టు చేసిన నేతలను ఎవ్వరికీ కనిపించకుండా హైదరాబాద్ నగరం బయటకు తరలించే ప్రయత్నాలను ఛేదించింది. దీంతో వేలాదిగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, సానుభూతి పరులు ఎక్కడికక్కడే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చారు. పోలీసుల వాహనాలను అడ్డగించే ప్రయత్నం చేశారు. తమ నేతలను విడిచిపెట్టాలని డిమాండ్ చేస్తూ.. రహదారులను దిగ్బంధం చేశారు. హరీశ్‌రావు సహా, బీఆర్‌ఎస్ నేతల అక్రమ అరెస్టులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.

అన్ని వైపులా మోహరించిన కార్యకర్తలు

బీఆర్‌ఎస్ ముఖ్య నేతలను అరెస్టు చేసి, మూడు మార్గాల్లో, మూడు వాహనాల్లో తరలిస్తున్న పోలీసు ప్రయత్నాలను బీఆర్‌ఎస్ కార్యకర్తలు భగ్నం చేశారు. నేతలను తరలించే వాహనాల జాడ తెలుసుకొని అన్ని వైపులా రోడ్లపై మోహరించారు. రెండున్నర గంటల తర్వాత రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి, కొత్తపేట, కేశంపేట రహదారుల వైపు తీసుకొస్తున్నారని తెలుసుకొని ఆయా గ్రామాల ప్రజలు వేలాదిగా రోడ్లపైకి వచ్చారు. బీఆర్‌ఎస్ నేతలను తరలిస్తున్న వాహనాలు వెళ్లకుండా రోడ్లపై నిప్పు పెట్టారు. ఆయా రహదారుల పరిధిలో అన్ని చోట్లా నిరసనలు మిన్నంటాయి. ఆందోళనలతో కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ప్రజలు ఈ ప్రయత్నంలో పోలీసు వాహనాల టైర్లలో గాలి తీసేశారు. ప్రణాళిక ప్రకారమే మారుమూల పోలీస్‌స్టేషన్లకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే, గత్యంతరం లేక హైదరాబాద్ సిటీకి 150 కిలోమీటర్ల దూరంలో, సైబరాబాద్ పరిధిలోని చివరి పీఎస్‌లు అయిన కేశంపేట, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్లకు బీఆర్‌ఎస్ నేతలను తరలించారు.

నిరసనలపై విరిగిన లాఠీ

అక్రమ అరెస్టులకు నిరసనగా ఆందోళనలు చేస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు, ప్రజలు, సానుభూతిపరులపై పలుచోట్ల పోలీసులు లాఠీలు ఝుళిపించారు. అయినా వెనుకడుగు వేయకుండా బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఉద్యమకాలం నాటి స్ఫూర్తిని ప్రదర్శించారు. పోలీసులు ఈడ్చిపడేస్తున్నా, లాఠీలతో కొడుతున్నా, వెనకడుగు వేయకుండా కేశంపేట, తలకొండపల్లి పోలీస్‌స్టేషన్లకు వేలాదిగా తరలి వచ్చి తమ నాయకత్వానికి మద్దతు తెలిపారు.

అరెస్టు ఎందుకు చేశారు?

తమ అరెస్టు నేపథ్యంలో డీజీపీ జితేందర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు ఫోన్ చేశారు. కనీసం తాగడానికి నీళ్లు కూడా ఇవ్వకుండా గంటల తరబడి వాహనాల్లో తిప్పుతున్న విషయాన్ని హరీశ్‌రావు చెప్పినప్పటికీ డీజీపీ సరిగా స్పందించలేదని తెలిసింది. కనీసం ప్రజాప్రతినిధులం అనే గౌరవం కూడా లేకుండా పోలీసులు తమ పట్ల వ్యవహరించిన తీరును డీజీపీకి వివరించగా.. ఏదో సర్దిచెప్పే ప్రయత్నం చేసినట్టు సమాచారం. కేశంపేట పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'తెలంగాణలో కొనసాగుతున్నది ప్రజాపాలనా? రాక్షసపాలనా? శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారు? ఇదేం ప్రజాస్వామ్యం? ఇదేక్కడి దుర్మార్గం.. ఏం తమాషాలు చేస్తున్నారా?' అని మండిపడ్డారు. తమను ఎందుకు అరెస్ట్ చేశారు? ఏ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు? శాసనసభ్యులను అరెస్ట్ చేసే ముందు స్పీకర్ అనుమతి తీసుకున్నారా? అని నిలదీశారు. హరీశ్‌రావు ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పలేక బిక్క మొహం వేశారు.

మూత్ర విసర్జనకు కూడా ఆపలేదు

పోలీసులు అరెస్టు చేసిన బీఆర్‌ఎస్ నేతలను పోలీసు వాహనంలో ఎక్కించి రెండున్నర గంటలపాటు హైదరాబాద్ నగరంలోని రోడ్లపై తిప్పారు. మూత్ర విసర్జనకు కూడా వాహనాన్ని ఆపలేదు. కనీసం మంచిళ్లు సైతం ఇవ్వలేదు. ఎమ్మెల్యేల్లో చాలమంది షుగర్, బీపీ లాంటి రుగ్మతలతో బాధపడుతున్నా కనికరించలేదు. పోలీసులు వ్యవహరించిన తీరుపై బీఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. దమనకాండకు దిగడమే ప్రజాపాలనా? అని విమర్శించారు. ప్రశ్నించిన నాయకులను పోలీసులు లాగిపడేస్తూ పిడిగుద్దులు గుద్దారు. ఎమ్మెల్యేలు ఉన్న వాహనాన్ని చివరకు నగరానికి 150 కిలోమీటర్ల దూరంలో రంగారెడ్డి జిల్లాతలకొండ పోలీస్‌స్టేషన్‌కు, హరీశ్‌రావు ఉన్న వాహనాన్ని షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట ఠాణాకు తీసుకెళ్లారు.

అదనపు బలగాల రాక

బీఆర్‌ఎస్ శ్రేణులు, పరిసర గ్రామ ప్రజలు వెల్లువలా మద్దతు తెలిపేందుకు వస్తుండటంతో పోలీసులు కంగుతిన్నారు. ప్రజల నుంచి వస్తున్న అనూహ్య స్పందనను తిప్పికొట్టేందుకు ఒక్కసారిగా అదనపు బలగాలతో మోహరించారు. కేశంపేట పోలీస్‌స్టేషన్‌కు ప్రజలు వేలాదిగా తరలి వస్తుండటంతో అదనపు బలగాలన్నీ అక్కడే మోహరించాయి. అక్కడికి మిగిలిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు సైతం వస్తుండటంతో రాత్రి పదిన్నర వరకూ వేలాది ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను చుట్టుముట్టి నిరసన తెలిపారు. అదనపు బలగాలతో వారిని సైతం చెదరగొట్టే ప్రయత్నం చేశారు. హైదరాబాద్‌లోనూ ఎమ్మెల్యే గాంధీ ఇంటి దగ్గర భారీగా పోలీసులు మోహరించారు. ఆయన కుటుంబ సభ్యులకు సైతం బందోస్తు ఏర్పాటు చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

బుల్డోజర్ న్యాయమంటే..
చట్టాలను తుంగలో తొక్కడమే



నిందితుల ఇళ్లను కూల్చడం సరికాదు

సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం

న్యూఢిల్లీ: బుల్డోజర్ న్యాయంపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమ కట్టడాల పేరుతో ప్రజల ఇండ్లపైకి ప్రభుత్వాలు బుల్డోజర్లను పంపిస్తుండటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. క్రిమినల్ కేసులో ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉండటం ఆ నిందితుల ఇండ్ల కూల్చివేతకు తగిన కారణం కాబోదని స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలను దేశ చట్టాలను తుంగలో తొక్కడంగా పరిగణించవచ్చునని హెచ్చరించింది. గుజరాత్‌లోని ఖేదా జిల్లాకు చెందిన జావేద్ అలీ మెహబూబా మియా సయీద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం గురువారం ఈ హెచ్చరిక చేసింది. సయీద్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ, కథ్లాల్ గ్రామ రెవిన్యూ రికార్డుల ప్రకారం తన క్లయింటు ఓ భూమికి సహ యజమాని అని చెప్పారు. ఆ భూమిలో ఇంటిని నిర్మించుకోవడానికి గ్రామ పంచాయతీ 2004లో అనుమతి ఇచ్చిందన్నారు. రెండు దశాబ్దాల నుంచి మూడు తరాలు ఆ ఇంటిలో నివసిస్తున్నట్లు తెలిపారు. సుప్రీంకోర్టు ఈ నెల 2న జారీ చేసిన ఇండ్ల కూల్చివేత కోసం అనుసరించవలసిన మార్గదర్శకాలను కూడా ప్రస్తావించారు. ఇరు పక్షాల వాదనలను విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం స్పందిస్తూ, ప్రభుత్వాల చర్యలు చట్టాలకు అనుగుణంగా ఉండవలసిన దేశంలో, ఓ కుటుంబంలోని ఓ వ్యక్తి ఏదైనా కేసులో ఆరోపణలు ఎదుర్కొంటుండటాన్ని కారణంగా చూపించి, ఆ కుటుంబంలోని ఇతర వ్యక్తులకు, వారు చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇంటికి వ్యతిరేకంగా చర్యలు తీసుకోరాదని స్పష్టం చేసింది. నేరంలో ప్రమేయం ఉందనే ఆరోపణలు ఆ నిందితుని ఇంటిని కూల్చివేయడానికి తగిన కారణం కాబోవని వివరించింది. సయీద్‌పై కేసు న్యాయస్థానంలో రుజువు కావలసి ఉందని తెలిపింది. చట్టమే సర్వోన్నతమైన దేశంలో ఇటువంటి కూల్చివేత బెదిరింపులను చూసీచూడనట్లు కోర్టు ఉండటం సాధ్యం కాదని చెప్పింది. ఇటువంటి చర్యలను చట్టాలపైకి బుల్డోజర్లను తోలడంగా పరిగణించవచ్చునని తెలిపింది. సయీద్ పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా సమాధానం చెప్పాలని గుజరాత్ ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు సయీద్ ఇంటిని కూల్చవద్దని ఆదేశించింది.

సీజేఐ ఇంట గణపతి పూజకు మోదీ..
అధికార, విపక్షాల వాగ్యుద్ధం

న్యూఢిల్లీ: సీజేఐ చంద్రచూడ్ నివాసంలో జరిగిన గణపతి పూజకు ప్రధాని మోదీ హాజరవడం వివాదాస్పదమైంది. సీజేఐ పక్షపాత వైఖరిని విపక్షాలు ప్రశ్నించాయి. సీజేఐ ఇంట్లో జరిగిన పూజకు ప్రధాని మోదీ హాజరవ్వడం న్యాయవ్యవస్థ నిష్పాక్షపాతంపై ప్రజల్లో సందేహాలు ఏర్పడే అవకాశాలున్నాయని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కాగా, తనదే అసలైన శివసేన అంటూ ఏక్‌నాథ్ షిండే ప్రకటించడాన్ని సవాల్ చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే వర్గం దాఖలు చేసిన కేసు విచారణ నుంచి సీజేఐ దూరంగా ఉంటే మంచిదని ఆయన సూచించారు. ఎందుకంటే ఈ కేసులో ప్రధాని మోదీ మరో పార్టీగా ఉన్నారని అన్నారు. ఇప్పుడు ఒక పార్టీతో సీజేఐ సన్నిహితంగా ఉన్న విషయం బహిరంగంగా అందరికీ తెలిసిందని, అలాంటి పరిస్థితులలో సీజేఐ తమకు న్యాయం చేయగలరా? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. బద్లాపూర్ లైంగికదాడి కేసులో ఏ మాత్రం స్పందించని సుప్రీంకోర్టు .. కోల్‌కతా డాక్టర్ హత్యాచారం కేసును మాత్రం సుమోటోగా తీసుకోవడాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా విపక్షాలకు వ్యతిరేకంగా ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇదే అంశంపై ఇతర ఎంపీలు మిలింద్ దేవర, ప్రియాంక చతుర్వేది కూడా ఘాటుగా విమర్శలు చేశారు. ఆ కార్యక్రమం కేవలం గణపతి పూజకే పరిమితమైందని, దీనిని శివసేన (యూబీటీ) అనవసరంగా రాజకీయం చేస్తున్నదని బీజేపీ జాతీయ కార్యదర్శి బీఎల్ సంతోష్ విమర్శించారు.

ఏచూరి ఇక లేరు

- ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో చికిత్స పొందుతూ మృతి
- 2015 నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు
- విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో రాణింపు
- రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖుల సంతాపం
- పరిశోధనల కోసం ఎయిమ్స్‌కు మృతదేహం దానం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: ప్రముఖ కమ్యూనిస్టు యోధుడు, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్‌తో ఆయన గత నెల 19 నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. ఏచూరి వయసు 72 ఏండ్లు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వామపక్ష నేత మృతి పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సహా పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తంచేశారు. ఏచూరి భౌతిక కాయాన్ని వైద్య పరిశోధనల నిమిత్తం ఎయిమ్స్‌కు దానం చేస్తున్నట్టు ఆయన కుటుంబం ప్రకటించింది. అంతకు ముందు ఆయన భౌతిక కాయాన్ని శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఢిల్లీలోని సీపీఎం ప్రధాన కార్యాలయంలో ఉంచనున్నట్టు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో రాణించిన ఏచూరి దేశంలో మార్క్సిస్టు సిద్ధాంతకర్తగా పేరొందారు. ఏచూరి 2015 నుంచి సీపీఎం ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అతి చిన్న వయసులోనే పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికైన ఆయన 1992 నుంచి పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఉన్నారు. 2005 నుంచి 2017 వరకు రెండు పర్యాయాలు పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2017లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా ఎంపికయ్యారు.

తెలుగు కుటుంబంలో జననం

సీతారాం ఏచూరి పూర్వ మద్రాస్ రాష్ట్రంలో 1952 ఆగస్టు 12న తెలుగు కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి ఏపీఎస్‌ఆర్టీసీలో ఇంజినీర్‌గా పనిచేశారు. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ ఉద్యోగి. ఏపీ ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన మోహన్‌కందాకు ఏచూరి మేనల్లుడు. పుట్టింది మద్రాస్‌లోనే అయినా ఆయన హైదరాబాద్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో విద్యాభ్యాసం చేశారు. 1969లో తెలంగాణ ఉద్యమం సమయంలో ఆయన ఢిల్లీ వెళ్లి సీబీఎస్‌ఈ హయ్యర్ సెకండరీ పరీక్షల్లో ఆల్ ఇండియా మొదటి ర్యాంక్ సాధించారు. ఢిల్లీలోనే సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో బీఏ (ఆనర్స్), జేఎన్‌యూలో ఎంఏ చదివారు. ఎమర్జెన్సీ కాలంలో అరెస్టయిన కారణంగా ఆర్థిక శాస్త్రంలో ఆయన పీహెచ్‌డీని పూర్తిచేయలేకపోయారు. ఏచూరి భార్య సీమా చిస్తీ 'ది వైర్' వెబ్ పోర్టల్‌కు సంపాదకురాలు కాగా, కుమార్తె అఖిల ఏచూరి ఎడిన్‌బర్గ్, సెయింట్ ఆండ్రూస్ యూనివర్సిటీలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.

రాజకీయ జీవితం

సీపీఎం విద్యార్థి సంఘమైన ఎస్‌ఎఫ్‌ఐలో ఏచూరి 1974లో చేరారు. ఆ మరుసటి సంవత్సరమే ఆయన సీపీఎం సభ్యుడయ్యారు. ఎమర్జెన్సీ తరువాత 1977-78లో జేఎన్‌యూ విద్యార్థి యూనియన్‌కు మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తన సహచర కామ్రేడ్ ప్రకాశ్ కారత్‌తో కలిసి జేఎన్‌యూను దుర్భేద్యమైన వామపక్ష కోటగా నిర్మించేందుకు కృషి చేశారు. 1986 వరకు ఎస్‌ఎఫ్‌ఐలో కొనసాగిన ఏచూరి 1978లో ఆ విద్యార్థి సంఘానికి అధ్యక్షుడు అయ్యారు. 1992 నుంచి పార్టీ పొలిట్ బ్యూరో సభ్యునిగా కొనసాగుతున్న ఏచూరి 2015లో విశాఖపట్నంలో జరిగిన పార్టీ మహాసభలలో సీపీఎం ఐదో ప్రధానకార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2018, 2022లో జరిగిన పార్టీ మహాసభల్లో తన పదవిని నిలబెట్టుకున్నారు.

సంకీర్ణ రాజకీయాలలో కీలకం

సంకీర్ణ రాజకీయాలలో సీపీఎం మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ నిర్వహించిన కీలక పాత్రను ఏచూరి మరింత ముందుకు తీసుకెళ్లారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు కాంగ్రెస్ నేత చిదంబరంతో కలిసి కనీస ఉమ్మడి కార్యక్రమం (సీఎంపీ) ముసాయిదాను రూపొందించారు. 2004లో యూపీఏ ప్రభుత్వ ఏర్పాటు సమయంలో సంకీర్ణ కూటమి నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించారు. ఏచూరి మంచి వక్త, రచయితగా పేరొందారు. సీపీఎం పార్టీ పక్ష పత్రిక 'పీపుల్స్ డెమోక్రసీ'కి గత 20 ఏండ్లుగా సంపాదకునిగా ఉన్నారు. హిందుస్థాన్ టైమ్స్ పత్రికలో 'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' పేరుతో కాలమ్ రాస్తున్నారు.



ఖమ్మంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సీపీఎం నేత తమ్మినేని, తదితరులు

లౌకిక వాదానికి తీరని లోటు: కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తేతెలంగాణ): సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్ రావు సంతాపాన్ని ప్రకటించారు. సామ్యవాద భావాలు కలిగిన ఏచూరి.. విద్యార్థి నాయకుడిగా, కమ్యూనిస్టు పార్టీకి కార్యదర్శిగా, రాజ్యసభ సభ్యునిగా అంచెలంచెలుగా ఎదిగి ప్రజాపక్షం వహించారన్నారు. వారి సేవలను ఈ సందర్భంగా కేసీఆర్ స్మరించుకున్నారు. ఏచూరి మరణం కార్మిక లోకానికి, లౌకిక వాదానికి తీరని లోటన్నారు. ఏచూరి మరణంతో శోకతప్తులైన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అరుదైన నేత ఏచూరి: కేటీఆర్

సీతారాం ఏచూరి మరణ వార్త తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేటీఆర్ పేర్కొన్నారు. కమ్యూనిస్టు నాయకుడిగా ఏచూరి జీవితాంతం ప్రజల పక్షాన రాజీలేని పోరాటం చేశారన్నారు. రాజకీయాల్లో ఏచూరి ఎంతో హుందాగా ఉండేవారని గుర్తుచేశారు. రాజకీయాల్లో అలాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని తెలిపారు. సీపీఎంలోనే కాకుండా దేశ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏచూరి సృష్టించుకున్నారని పేర్కొన్నారు. ఈ కష్టసమయంలో ఏచూరి కుటుంబసభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దేశ రాజకీయాలకు తీరని లోటు: హరీశ్‌రావు

ఏచూరి మృతి పట్ల మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏచూరి చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని, ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటని అన్నారు. రాజ్యసభ ఎంపీగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యునిగా, ఆర్థికవేత్తగా, సామాజిక కార్యకర్తగా ఆయన ఎంతో సేవ చేశారన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. ప్రజా సమస్యలు, దేశ సమస్యలను ప్రస్తావన చేసే ఒక గొంతు మూగబోయిందన్నారు. ఏచూరి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పలువురి సంతాపం

ఏచూరి మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ సీజేఐ ఎన్వీ రమణ, సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, సబితా ఇంద్రారెడ్డి, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, మాజీ ఎంపీలు వినోద్, రావుల చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల ఓంకార్‌తో పాటు పలువురు ప్రముఖులు సంతాపాన్ని ప్రకటించారు.



అయోధ్యలో భూ కుంభకోణం

- బీజేపీ పెద్దలు, ప్రభుత్వాధికారుల ప్రమేయం
- సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ ఆరోపణలు

లక్నో : శ్రీరామ జన్మభూమి అయోధ్యలో పెద్ద ఎత్తున భూ కుంభకోణం జరిగిందని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఆయన గురువారం ఆ పార్టీ అయోధ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, అధికారంలో ఉన్న వారు విస్తృత స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని, అందులో భాగమే భూమికి సంబంధించిన దోపిడీలని చెప్పారు. బీజేపీ నేతలు, అధికారులు భూ దోపిడీలకు పాల్పడ్డారన్నారు. ఈ చీకటి వాస్తవాలను బయటపెట్టినందుకు సమాజ్‌వాదీ పార్టీ కార్యకర్తలను అభినందించారు. అయోధ్య వంటి పవిత్రమైన స్థలంలోనే ఇటువంటి ఆక్రమణలకు పాల్పడ్డవారు, మిగతా జిల్లాల్లో ఇంకెన్ని దారుణాలకు పాల్పడి ఉంటారో ఊహించుకోవచ్చునని తెలిపారు. అయోధ్య అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని అన్నారు.

రాహుల్‌గాంధీ పౌరసత్వంపై పిల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరసత్వాన్ని కలిగి ఉన్నారంటూ అలహాబాద్ హైకోర్టులో పిల్ దాఖలైంది. భారత న్యాయ సంహిత నిబంధనల కింద ఆయనపై కేసు నమోదు చేయాలని, సీబీఐతో పూర్తిస్థాయి విచారణ జరిపించాలంటూ పిటిషనర్ హైకోర్టును కోరారు. రాహుల్‌గాంధీ పౌరసత్వంపై ఆరోపణలు రావటం ఇదే మొదటిసారి కాదు. ఇదే విషయమై రాహుల్‌గాంధీకి వ్యతిరేకంగా బీజేపీ నాయకుడు సుబ్రమణ్యస్వామి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. రాహుల్ గాంధీకి బ్రిటిష్ పౌరసత్వం ఉందని ఆయన కోర్టుకు ఆధారాలు అందజేశారు.

రాజీనామాకు సిద్ధమే

- ప్రజల కోసం అవసరమైతే సీఎం పదవి నుంచి వైదొలుగుతా
- జూనియర్ డాక్టర్లతో చర్చల కోసం రెండు గంటలు వేచిచూశా
- అయినా వారి నుంచి స్పందన లేదు
- ప్రతిష్ఠంభన కొనసాగుతున్నందుకు ప్రజలకు క్షమాపణ చెబుతున్నా
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ



కోల్‌కతా, సెప్టెంబర్ 12: బెంగాల్‌లో ప్రభుత్వం, జూనియర్ డాక్టర్ల మధ్య ప్రతిష్ఠంభనకు గురువారం కూడా తెరపడలేదు. చర్చల నిమిత్తం జూనియర్ వైద్యులు పెట్టిన డిమాండ్లను బెంగాల్ ప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించడంతో వైద్యులు చర్చా వేదికకు రావడానికి తిరస్కరించారు. దీంతో తీవ్ర అసంతృప్తికి గురైన సీఎం మమతా బెనర్జీ ప్రజల కోసం తన పదవికి రాజీనామా చేయడానికి సిద్ధమని ప్రకటించారు. డాక్టర్లతో చర్చల కోసం రెండు గంటల పది నిముషాల పాటు వేచి చూసిన ఆమె.. తర్వాత మీడియాతో మాట్లాడారు. 'నేను పదవిని లెక్క చేయను. ప్రజల కోసం రాజీనామా చేయడానికి సిద్ధం. అయితే జూనియర్ వైద్యుల సమ్మె కారణంగా నెల రోజులుగా స్తంభించిన వైద్య సేవల పునరుద్ధరణ జరిగి సాధారణ పరిస్థితులు నెలకొనాలని కోరుకుంటున్నాను' అని ఆమె పేర్కొన్నారు. 'కోర్టు పరిధిలో ఉన్న అంశాలు బహిరంగ పరచడం చట్ట విరుద్ధం. అందుకే చర్చలను లైవ్ టెలికాస్ట్ చేయాలంటూ వారు పెట్టిన డిమాండ్‌ను తిరస్కరించా. అయితే చర్చలను రికార్డు చేయడానికి మూడు కెమెరాలు ఏర్పాటు చేశా' అని మమత తెలిపారు. 'సమస్యను పరిష్కరించడానికి నేను చేయాల్సిన ప్రయత్నమంతా చేశా. బాధితురాలికి న్యాయం జరగాలని కోరుకుంటున్నా. అయితే వైద్యులను చర్చలకు రప్పించడంలో విఫలమైనందుకు, ఇన్ని రోజులుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు క్షమాపణ చెబుతున్నా. చర్చలకు వెళ్లవద్దంటూ జూనియర్ డాక్టర్లకు కొంత మంది వ్యక్తుల నుంచి ఆదేశాలు వస్తున్నాయి.' అని ఆమె అన్నారు.

రాజీనామా కోరలేదు..

సీఎం వ్యాఖ్యలను జూనియర్ వైద్యులు ఖండించారు. ఆమె తన పదవి రాజీనామా గురించి ప్రస్తావించడం తీవ్ర అసంతృప్తికి గురి చేసిందని, రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఇక్కడకు రాలేదని అన్నారు. ఇప్పటికీ చర్చల ద్వారానే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. ఎక్కడ చర్చలు నిర్వహించినా రావడానికి తాము సిద్ధమేనని స్పష్టం చేశారు.

ఆర్మీ అధికారులపై దాడి..
స్నేహితురాలిపై గ్యాంగ్ రేప్
మధ్యప్రదేశ్‌లో దారుణం

ఇండోర్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. పిక్నిక్‌కు వచ్చిన ఇద్దరు ట్రైనీ ఆర్మీ ఆఫీసర్లపై కొందరు దుండగులు దాడి చేసి, వారి స్నేహితురాళ్లలో ఒకరిపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. చుట్టూ అడవులు, కొండలతో నిండి ఉన్న ఇండోర్ జిల్లా మౌవ్ పట్టణంలోని జామ్‌గేట్‌లో బుధవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. మౌవ్ ఆర్మీ కాలేజీలో శిక్షణ పొందుతున్న 23, 24 ఏండ్ల ఇద్దరు ఆర్మీ అధికారులు మంగళవారం ఇద్దరు స్నేహితురాళ్లతో కలిసి పిక్నిక్‌కు వెళ్లారు. వీరిపై కొందరు దుండగులు దాడి చేశారు. వారి వద్ద సొమ్ము లాక్కున్నారు. వారిలో ఒక జంటను బందీగా చేసుకుని 10 లక్షలు ఇస్తేనే వదిలిపెడతామని డిమాండ్ చేశారు. తర్వాత వారు ఆ యువతిపై సామూహిక లైంగిక దాడి చేశారు. నిందితులు ఆరుగురు సమీపంలోని గ్రామాలకు చెందిన వారని ఎస్పీ హితికా వాసల్ చెప్పారు.

అదానీ విద్యుత్తు ఒప్పందంపై సమీక్ష

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: గత ప్రధాని హసీనా హయాంలో తీసుకున్న పలు నిర్ణయాలను బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం సమీక్ష చేస్తున్నది. అందులో భాగంగా అప్పట్లో అదానీ గ్రూప్‌తో జరుపుకున్న విద్యుత్తు ఒప్పందాన్ని నిశితంగా పరిశీలించాలని మహమ్మద్ యూనస్ ప్రభుత్వం నిర్ణయించింది. బంగ్లా రాజధాని ఢాకాకు తమ జార్ఖండ్ యూనిట్ నుంచి విద్యుత్తు సరఫరాకు 2017లో అదానీ సంస్థ చేసుకున్న ఒప్పందాన్ని పూర్తిగా పరిశీలిస్తారు. 'రెండు దేశాలు ఎలాంటి కాంట్రాక్టులపై సంతకాలు చేశాయి?, వాటి నిబంధనలు, నియమాలు ఏమిటి? తాము పొందుతున్న సేవలకు చెల్లిస్తున్న ధర సరైనదేనా? ఇప్పటివరకు ఈ ఒప్పందంలో భాగంగా అదానీ సంస్థలకు ఎంత చెల్లించారు? తదితర అంశాలన్నీ నిశితంగా పరిశీలిస్తాం. మా దేశ చట్టాలను ఉల్లంఘించే ఏ విదేశీ సంస్థ ఉండకూడదు' అంటూ ఒక సీనియర్ అధికారి పేర్కొన్నారు. అలాగని తాము ఏ ఒక్క భారత సంస్థను టార్గెట్ చేయడం లేదని ఆయన స్పష్టం చేశారు. 25 ఏండ్ల పాటు 1,496 మెగావాట్ల విద్యుత్తు కొనుగోలుకు అదానీ పవర్ (జార్ఖండ్) లిమిటెడ్‌కు బంగ్లాదేశ్ పవర్ డెవలప్‌మెంట్ బోర్డు మధ్య 2017 నవంబర్‌లో ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం అదానీ జార్ఖండ్ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే నూరు శాతం విద్యుత్తును బంగ్లా కొనుగోలు చేస్తుంది. ఇది బంగ్లాదేశ్ బేస్ లోడ్‌లో 7-10 శాతం. కాగా, గత ఏడాది అదానీ సంస్థ 7,508 మిలియన్ యూనిట్ల విద్యుత్తును బంగ్లాదేశ్‌కు ఎగుమతి చేసింది.

19-25 మధ్య నైరుతి తిరోగమనం: ఐఎండీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశంలో నైరుతి రుతు పవనాల తిరోగమనం ఈనెల 19 నుంచి 25 మధ్య మొదలవుతున్నదని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. దేశం నుంచి నైరుతు పవనాలు క్రమంగా వైదొలిగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయంటూ ఐఎండీ గురువారం తెలిపింది. ఈ ఏడాది జూన్ 1తో మొదలైన నైరుతి సీజన్‌తో ఇప్పటివరకు, దేశంలో 836.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, సగటు వర్షపాతం (772.5 మిల్లీమీటర్లు)తో పోల్చితే 8శాతం ఎక్కువ వర్షం కురిసిందని ఐఎండీ వెల్లడించింది. దక్షిణ భారతంలో 25శాతం, మధ్య భారతంలో 19శాతం, వాయువ్య ప్రాంతంలో 4 శాతం సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదైంది. తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో సాధారణం కన్నా 16 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నైరుతి రుతు పవనాలు ఏటా కేరళలో జూన్ 1న తీరాన్ని తాకుతాయి. జూలై 8 కల్లా దేశమంతా విస్తరిస్తాయి. సాధారణంగా సెప్టెంబర్ 17తో మొదలయ్యే నైరుతి తిరోగమనం, అక్టోబర్ 15 నాటికి పూర్తవుతుంది.

ఇద్దరు గ్రామస్థులను ఉరితీసిన నక్సలైట్లు

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఇద్దరు గ్రామస్థులను నక్సలైట్లు ఉరి తీశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జప్పెమర్క గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని, మడ్వీ సుజ, పోడియం కోసలను మంగళవారం అపహరించి తీసుకెళ్లారు. జన అదాలత్‌ను నిర్వహించిన అనంతరం మడ్వీ, పోడియంలను చెట్టుకు ఉరి వేసి హత్య చేశారు. ఈ హత్యలకు తమదే బాధ్యత అని భైరంగఢ్ ఏరియా మావోయిస్టు కమిటీ ప్రకటించింది. వీరిద్దరూ పోలీసు ఇన్ఫార్మర్లని ఆరోపించింది. ఈ సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

రష్యా సైన్యం నుంచి 45 మంది
భారతీయులకు విముక్తి

న్యూఢిల్లీ: రష్యా సైన్యం నుంచి 45 మంది భారతీయులకు విముక్తి లభించినట్లు ఇండియన్ ఫారిన్ మినిస్ట్రీ గురువారం తెలిపింది. మరో 50 మందికి విముక్తి కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నట్లు వెల్లడించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలైలో రష్యాలో పర్యటించినపుడు భారతీయ సైనికులను విడుదల చేస్తామని రష్యా హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తప్పుడు ప్రలోభాలకు గురై, తమ సైన్యంలో చేరి, నిర్బంధం వల్ల ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న భారతీయులను డిశ్చార్జ్ చేస్తామని రష్యా చెప్పింది. ఈ హామీ మేరకు 45 మంది భారతీయులను సైన్యం నుంచి డిశ్చార్జ్ చేసింది.




గ్యాస్ట్రిక్ సమస్యలతో పార్కిన్సన్ రెట్టింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: అల్సర్, గ్యాస్ట్రిక్ సహా జీర్ణక్రియ సంబంధ సమస్యలతో వణుకుడు రోగం 76 శాతం పెరిగే అవకాశం ఉన్నదని తాజా అధ్యయనంలో తేలింది. 9,350 మంది పేషెంట్లపై చేసిన పరిశోధనల్లో.. గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడినవారు వృద్ధాప్యం వచ్చేసరికి వణుకుడు సమస్యలతో బాధపడినట్టు తమ అధ్యయనంలో తేలిందని అమెరికాలోని బెత్ ఇజ్రాయెల్ డీకోనెస్ మెడికల్ సెంటర్ శాస్త్రవేత్తలు తెలిపారు. మలబద్ధకం, కడుపు నిండుగా అనిపించటం లాంటి సమస్యలు తలెత్తి.. పార్కిన్సన్‌కు దారితీస్తాయని వెల్లడించారు. వృద్ధుల్లో పార్కిన్సన్ ఎక్కువగా కనిపించడానికి జీర్ణ సంబంధిత సమస్యలే ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.




ఒత్తిడి తర్వాత శుక్రకణాల్లో వేగం

న్యూయార్క్, సెప్టెంబర్ 12: ఒత్తిడి వల్ల శుక్రకణాలు చలనశీలతను కోల్పోతాయని ఇప్పటివరకు చదువుకున్నాం. పునరుత్పత్తి వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలుసు. కానీ, ఒత్తిడిని జయించిన తర్వాత శుక్రకణాల్లో వేగం పెరుగుతుందని, పునరుత్పత్తి వ్యవస్థలో అండంతో ఫలదీకరణం ఆశాజనకంగా జరుగుతుందని తాజా అధ్యయనం తేల్చింది. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో అన్‌స్చుట్జ్ మెడికల్ క్యాంపస్ శాస్త్రవేత్తలు జరిపిన పరిశోధనల్లో.. ఒత్తిడిని జయించిన తర్వాత శుక్రకణాల చలనం ఆరోగ్యవంతంగా ఉన్నట్టు తెలిసింది. దాని ఫలితంగా జననాల రేటులో వృద్ధి కనిపించిందని పరిశోధకులు వివరించారు.



స్క్రీన్‌కు అతుక్కుపోతే.. పిల్లల భాషా నైపుణ్యంపై దెబ్బ

న్యూఢిల్లీ: డిజిటల్ స్క్రీన్స్ (మొబైల్ ఫోన్లు, ల్యాప్‌ట్యాప్, ట్యాబ్, కంప్యూటర్లు)ను పెద్ద ఎత్తున వాడుతున్న కుటుంబాల్లోని పిల్లల్లో భాషా నైపుణ్యాలు దెబ్బతింటున్నాయని తాజా అధ్యయనం ఒకటి హెచ్చరించింది. పిల్లల మెదడు అభివృద్ధిపై వీడియో గేమ్స్ ప్రతికూల ప్రభావం చూపుతాయని 'ఎస్తోనియా' సైంటిస్టులు తెలిపారు. దీనిపై 'ఫ్రాంటియర్ ఇన్ డెవలప్‌మెంటల్ సైకాలజీ' కథనం ప్రకారం, రెండున్నర ఏండ్ల వయసు పిల్లలున్న తల్లిదండ్రుల నుంచి సేకరించిన సమాచారాన్ని సైంటిస్టులు విశ్లేషించారు. స్క్రీన్ టైమ్ తక్కువగా ఉన్న పిల్లలు.. పదజాలం, వ్యాకరణంలో అత్యధిక స్కోర్ చేయటం గమనార్హం. ఈ-బుక్స్ చదవటం, ఎడ్యుకేషనల్ గేమ్స్‌తో గడిపినా.. అది పిల్లలపై దుష్ప్రభావం చూపుతుందని అధ్యయనం తెలిపింది.



వుహాన్ ల్యాబ్ నుంచి కొవిడ్ 'నానో వ్యాక్సిన్'

బీజింగ్ : కొవిడ్ 19 వైరస్ పుట్టుకకు ప్రధాన కేంద్రంగా ఉన్న చైనాలోని వుహాన్ ల్యాబ్ నుంచి కీలక ప్రకటన వెలువడింది. ఇప్పటివరకు పుట్టుకొచ్చిన కరోనా వైరస్‌లతోపాటు, భవిష్యత్తులో వచ్చే వేరియెంట్స్ అన్నింటినీ ఎదుర్కొనే నానో వ్యాక్సిన్‌ను తయారుచేసినట్టు 'వుహాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ' సైంటిస్టులు తాజాగా ప్రకటించారు. ఈమేరకు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' కథనం పేర్కొన్నది. దీని ప్రకారం, ప్రస్తుతం ఎన్నో వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉన్నా, ఇవి సార్వత్రిక రక్షణ కల్పించలేవు. దీంతో 'నానో వ్యాక్సిన్'ను తయారుచేసినట్టు సైంటిస్టుల బృందం తెలిపింది. గబ్బిలాలు, ఇతర జంతువులపై పరిశోధనలు జరుపుతున్న ఈ ల్యాబ్ నుంచే కరోనా వైరస్ లీకైందని గతంలో పలు దేశాలు అనుమానం వ్యక్తం చేశాయి.



అంతరిక్షంలో తొలిసారి ప్రైవేట్ స్పేస్‌వాక్

వాషింగ్టన్: స్పేస్‌ఎక్స్ పొలారిస్ డాన్ మిషన్ వ్యోమగామి బృందం ప్రపంచంలో మొట్టమొదటిసారిగా ప్రైవేట్ స్పేస్‌వాక్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. బిలియనీర్ జేర్డ్ ఐసాక్‌మ్యాన్ మొదట నడవగా ఆ తర్వాత స్పేస్‌ఎక్స్ ఇంజినీర్ సరహ్ గిల్లిస్ ఆయనను అనుసరించారు. అంతరిక్ష నడకను కేవలం 30 నిమిషాల పాటు నిర్వహించారు. కానీ దీనికి సిద్ధం కావడానికి రెండు గంటలు పట్టింది. ఈ కార్యక్రమంలో కొత్త అంతరిక్ష దుస్తులను పరీక్షించారు. ఐసాక్‌మ్యాన్ అంతరిక్షంలో ఉన్న ఫొటోను స్పేస్‌ఎక్స్ సీఈవో మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. టేకాఫ్ అయిన 15 గంటల తర్వాత 1400.7 కిలోమీటర్ల ఎత్తుకు చేరుకొని పొలారిస్ డాన్ మిషన్ అరుదైన మైలురాయిని సాధించింది.

మౌనంగా ఉన్నారంటే..

సెబీ చీఫ్ మాధవి పురి బచ్ అక్రమాలపై హిండెన్‌బర్గ్ కొత్త సందేహాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్‌పై తాజాగా వచ్చిన అక్రమాల ఆరోపణలపై అమెరికా షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రిసెర్చ్ కొత్త అనుమానాలను లేవదీసింది. ఇంత జరుగుతున్నా మాధవి పురి ఏం మాట్లాడకుండా ఉన్నారంటే ఏదో జరిగే ఉంటుందన్నట్టు వ్యాఖ్యానించింది. ఏమీ లేకపోతే ఎందుకీ మౌనం? అంటూ ప్రశ్నించింది. సెబీ సభ్యురాలిగా ఉన్నప్పుడు ఆయా కంపెనీల నుంచి చెల్లింపులు జరిగాయని, అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు మాధవి పురిపై వస్తున్న విషయం తెలిసిందే. కాగా, అదానీ అక్రమాలపై గత ఏడాది సంచలన రిపోర్టును తీసుకొచ్చిన హిండెన్‌బర్గ్.. ఈ వ్యవహారంలో సెబీ చీఫ్‌గా మాధవి పురి, ఆమె భర్తకూ లింకులున్నాయని గత నెల బయటపెట్టిన సంగతి విదితమే. దీన్ని అదానీ గ్రూప్, పురి దంపతులు కొట్టిపారేశారు.

కార్వీ ఖాతాలు జప్తు

కార్వీ స్టాక్ బ్రోకింగ్, ఆ సంస్థ సీఎండీ సీ పార్థసారథిలకు చెందిన బ్యాంక్-డీమ్యాట్ ఖాతాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్ హోల్డింగ్స్‌ను జప్తు చేయాలని గురువారం సెబీ ఆదేశించింది. దాదాపు రూ.25 కోట్ల బకాయిల వసూలుకుగాను ఈ ఆదేశాలు జారీ చేసింది. క్లయింట్ల నిధులను పవర్ ఆఫ్ అటార్నీ దుర్వినియోగంతో కాజేసిన కేసులో భాగంగానే సెబీ ఈ చర్యలకు దిగింది.


తొలిసారి 83,000కు సెన్సెక్స్

ఇంట్రా-డేలో దాటిన సూచీ

1,440 పాయింట్ల వృద్ధితో రికార్డు హై 82,963 వద్ద ముగింపు

నిఫ్టీ సైతం 470 పాయింట్లు పెరిగి మొదటిసారి 25,389 దగ్గరకు

ఒక్కరోజే రూ.6.59 లక్షల కోట్లు ఎగిసిన మదుపరుల సంపద



తిరుపతి బాలాజీ భళా

మార్కెట్‌లోకి ప్రవేశించిన తొలిరోజే శ్రీ తిరుపతి బాలాజీ అగ్రో ట్రేడింగ్ కంపెనీ లిమిటెడ్ షేర్లు అదిరిపోయే లాభాలను సొంతం చేసుకున్నాయి. ఏకంగా 17.51 శాతం చొప్పున విలువను పెంచుకున్నాయి. ఇష్యూ ధర రూ.83గా ఉంటే బీఎస్‌ఈ లిస్టింగ్ రూ.92.90 వద్ద జరుగడం గమనార్హం. దీంతో ట్రేడింగ్ మొదట్లోనే 11.92 శాతం వృద్ధి దక్కింది. మదుపరులు ఈ షేర్లను కొనేందుకు విపరీతమైన ఆసక్తి చూపడంతో చివరకు రూ.97.54 వద్ద ముగిసింది. దీంతో 17.51 శాతం పెరిగినట్టైంది. గురువారం ట్రేడింగ్ సమయం ముగిసే నాటికి సంస్థ మార్కెట్ విలువ రూ.795.64 కోట్లుగా ఉన్నది. కెమికల్స్, అగ్రోకెమికల్స్, ఫుడ్ మైనింగ్, వేస్ట్ డిస్పోజల్ ఇండస్ట్రీ, వ్యవసాయ పరిశ్రమలు, లూబ్రికెంట్స్, వంటనూనెలు తదితర రంగాల్లో ఈ సంస్థ వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి.

467 లక్షల కోట్లకు..

స్టాక్ మార్కెట్ల భారీ లాభాలతో మదుపరుల సంపద కూడా అంతే స్థాయిలో ఎగిసింది. గురువారం ఒక్కరోజే బీఎస్‌ఈలో నమోదైన కంపెనీల మార్కెట్ విలువ రూ.6,59,895.19 కోట్లు పెరిగి రూ.4,67,36,045.21 కోట్ల (5.57 ట్రిలియన్ డాలర్లు)కు చేరింది. వచ్చే వారం జరిగే పాలసీ సమీక్షలో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్లకు కోత పెడుతుందన్న అంచనాలు.. దాదాపు అన్ని షేర్లకు కొనుగోళ్ల మద్దతునిచ్చాయని మెహతా ఈక్విటీస్ లిమిటెడ్ రిసెర్చ్ విభాగం సీనియర్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ తాప్సీ అన్నారు.

ఉదయం ఆరంభం నుంచే దూకుడు మీదున్న మదుపరులు.. పెట్టుబడులకు పెద్దపీట వేస్తూపోయారు. ఈ క్రమంలోనే

ముంబై, సెప్టెంబర్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం రికార్డులతో హోరెత్తించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ.. రెండూ సరికొత్త ఇంట్రా-డే, క్లోజింగ్ హైలను నమోదు చేశాయి. ఉదయం ఆరంభం నుంచే దూకుడు మీదున్న మదుపరులు.. పెట్టుబడులకు పెద్దపీట వేస్తూపోయారు. ఈ క్రమంలోనే మార్కెట్లు పరుగులు పెట్టాయి. ఒకానొక దశలో సెన్సెక్స్ తొలిసారి 83,000 స్థాయిని అధిగమించింది. ఆఖరి గంటలో జరిగిన ట్రేడింగ్‌లోనైతే 1,593.03 పాయింట్లు లేదా 1.95 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 83,116.19 వద్దకు వెళ్లింది. అయితే ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవడంతో చివరకు 1,439.55 పాయింట్లు లేదా 1.77 శాతం పెరుగుదలతో ఆల్‌టైమ్ హై 82,962.71 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 470.45 పాయింట్లు లేదా 1.89 శాతం ఎగబాకి లైఫ్‌టైమ్ హై 25,388.90 వద్ద నిలిచింది. అయినప్పటికీ ఇంట్రా-డేలో 514.9 పాయింట్లు లేదా 2 శాతం పుంజుకొని మొదటిసారి 25,433.35 స్థాయిని తాకింది.

రంగాలవారీగా..

బుల్ రన్‌తో దాదాపు అన్ని రంగాల షేర్లు లాభాల్లోనే స్థిరపడ్డాయి. రంగాలవారీగా చూస్తే.. మెటల్ ఇండెక్స్ అత్యధికంగా 3.05 శాతం పెరిగింది. టెలికం (2.61 శాతం), విద్యుత్తు (2.02 శాతం), ఆటో (1.99 శాతం), యుటిలిటీస్ (1.93 శాతం), కమోడిటీస్ (1.85 శాతం) షేర్లు రాణించాయి. షేర్లలో భారతీ ఎయిర్‌టెల్, ఎన్టీపీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్బీఐ, కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆకట్టుకున్నాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ 0.79 శాతం చొప్పున పెరిగాయి.

కలిసొచ్చిన గ్లోబల్ ట్రెండ్

యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించబోతున్నాయన్న సంకేతాలు.. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లలో ఒక్కసారిగా ఉత్సాహాన్ని తెచ్చిపెట్టాయి. ఈ జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లలోనూ కనిపించిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ విభాగం అధిపతి వినోద్ నాయర్ తాజా ట్రేడింగ్ సరళిని విశ్లేషించారు. ఇక విదేశీ మదుపరుల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన పెట్టుబడులు కూడా ఈక్విటీ మార్కెట్లను పరిగెత్తించాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్, హాంకాంగ్ సూచీలు భారీగా పెరిగాయి. చైనా సూచీ మాత్రం స్వల్పంగా నష్టపోయింది. ఐరోపా మార్కెట్లూ ఆకర్షణీయ లాభాల్లోనే ట్రేడ్ అవుతున్నాయి.

జీసీసీల అడ్డా తెలంగాణ: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): జీఎఫ్ లైఫ్ టెక్ కొత్త గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ) ప్రారంభంతో తెలంగాణ.. ప్రపంచ స్థాయి సాంకేతిక, నూతన పరిశోధనల గమ్యస్థానంగా మారిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ సెంటర్ వల్ల ప్రస్తుతం 200 మందికి ఉద్యోగాలు లభించాయని, వచ్చే మూడేండ్లలో ఈ సంఖ్య 500 దాటగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటైన జీఎఫ్ లైఫ్ టెక్ జీసీసీని గురువారం మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఈ కేంద్రం నుంచి జీఎఫ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తమ కస్టమర్లకు అత్యుత్తమ సేవలను అందించగలుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ప్రాజెక్ట్ ఇంక్లూజన్‌తో మహిళలకు చేయూత: వీ-హబ్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు మహిళలకు చేయూతనిచ్చేలా ప్రాజెక్ట్ ఇంక్లూజన్ ఎంతగానో సహకరిస్తుందని వీ-హబ్ సీఈవో సీతా పల్లాచొల్ల తెలిపారు. గురువారం ఇక్కడి వీ-హబ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రాజెక్ట్ ఇంక్లూజన్ కార్యక్రమానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, మహిళలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీ-హబ్ కృషి చేస్తున్నదన్నారు. అదేవిధంగా మహిళలు ఆంత్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు తోడ్పాటును అందిస్తున్నామని వివరించారు. కాగా, మోడల్ ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి, స్థాపనకు 6 నెలలపాటు ప్రాజెక్ట్ ఇంక్లూజన్ సాగుతుందని సీత స్పష్టం చేశారు. దీనికి రీసస్టెనబులిటీ సంస్థ సీఎస్‌ఆర్ భాగస్వామిగా ఉందని వెల్లడించారు.



ప్లాస్టో ప్లాంట్‌లో రెన్యువబుల్ ఎనర్జీనే

హైదరాబాద్, సెప్టెంబర్ 12: ప్లాస్టిక్ నీటి ట్యాంకులు, పైపులు, ఫిట్టింగ్స్ తయారీలో ప్రముఖ సంస్థగా ఉన్న ఆర్‌సీ ప్లాస్టో ట్యాంక్స్ అండ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్.. తమ తయారీ కేంద్రాన్ని పూర్తిగా రెన్యువబుల్ ఎనర్జీతోనే నడిపిస్తున్నది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో 52 ఎకరాల్లో ఉత్పాదక కేంద్రం ఉన్నది. దీని నెలవారీ ఉత్పత్తి సామర్థ్యం 20 కోట్ల లీటర్ల వాటర్ ట్యాంకులు. కాగా, నాగ్‌పూర్ ప్లాంట్ 100 శాతం రెన్యువబుల్ ఎనర్జీ ఆధారిత మాన్యుఫ్యాక్చరింగ్ ప్లాంట్‌గా మారడానికి సమీపంలోగల నందూర్బార్‌లోని రెండు విండ్‌మిల్స్‌లో తయారైన గ్రీన్ ఎనర్జీనే దోహదం చేసినట్టు సంస్థ తెలిపింది.

ఒక్కరోజే రూ.2,000 పెరిగిన వెండి ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: వెండి ధరలు గురువారం భారీ ఎత్తున పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ ఒక్కరోజే కిలో రూ.2,000 ఎగబాకి రూ.87,000 పలికింది. ఈ మేరకు అఖిల భారత సరఫా అసోసియేషన్ వెల్లడించింది. హైదరాబాద్‌లోనూ ధరలు ఇదే స్థాయిలో కదలాడుతున్నాయి. మరోవైపు బంగారం ధర తగ్గింది. 24 క్యారెట్ తులం రూ.250 దిగి రూ.74,350గా ఉన్నది. 22 క్యారెట్ రూ.74,000గా నమోదైంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ రూ.73,150గా ఉంటే, 22 క్యారెట్ 10 గ్రాములు రూ.67,050గా ఉన్నది. బుధవారంతో చూస్తే రూ.100 మేర ధరలు తగ్గాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ 2,547.70 డాలర్లు, సిల్వర్ 29.16 డాలర్ల వద్ద ట్రేడ్ అవుతున్నాయి.

మందగమనంలో పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12: దేశీయ పారిశ్రామికోత్పత్తి మందగించింది. ఈ ఏడాది జూలైలో పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 4.8 శాతానికే పరిమితమైంది. నిరుడు జూలైలో 6.2 శాతంగా ఉండటం గమనార్హం. తయారీ, గనుల రంగాల పేలవ ప్రదర్శనే ఈ క్షీణతకు కారణమని గురువారం విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖ పేర్కొన్నది. గతంతో పోల్చితే గనుల రంగంలో ఉత్పాదకత 10.7 శాతం నుంచి 3.7 శాతానికి, తయారీ రంగంలో 5.3 శాతం నుంచి 4.6 శాతానికి దిగజారింది. మరోవైపు రిటైల్ ద్రవ్యోల్బణం ఆగస్టులో స్వల్పంగా పెరిగి 3.65 శాతంగా నమోదైంది. అంతకుముందు జూలైలో 3.6 శాతంగా ఉన్నది.

దసరా, దీపావళికి 12 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): దసరా, దీపావళి నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి శ్రీకాకుళం మధ్య 12 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 2 నుంచి నవంబర్ 7 వరకు నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, విజయనగరం మీదుగా ఈ రైళ్లు నడుస్తాయి.

ఏపీ సీఎంతో మంత్రి ఉత్తమ్‌దంపతుల భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి కోదాడ ఎమ్మెల్యే పద్మావతీరెడ్డి గురువారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నాలుగో సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసినట్టు తెలిపారు. ఈ భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యతలేదని వెల్లడించారు.

టీజీ న్యాబ్‌లో డ్రైవర్ల నియామకానికి నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోలో స్పెషల్ పోలీస్ ఆఫీసర్ (డ్రైవర్)ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ టీజీ న్యాబ్ అధికారులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 34 మంది అభ్యర్థులను స్పెషల్ పోలీస్ ఆఫీసర్‌లుగా తీసుకునేందుకు మాజీ సైనికులు, మాజీ పారామిలటరీ దళాలు, తెలంగాణ పోలీస్ శాఖలో రిటైర్డ్ అయిన వారి నుంచి కాంట్రాక్ట్ పద్ధతిలో దరఖాస్తులు ఆహ్వానించారు. అభ్యర్థులు తెలంగాణకు చెందిన వారై ఉండాలని, ఆధార్, ఓటర్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరని, మాజీ సైనికులు, మాజీ పారామిలటరీ సిబ్బంది వయసు ఈ నెల 30 నాటికి 58 ఏండ్లకు మించొద్దని తెలిపారు. గౌరవ వేతనం రూ.26 వేలు ఇస్తారని, సెలవులు ఉండవని స్పష్టంచేశారు. అత్యవసర సందర్భాల్లో గౌరవ వేతనం ఇవ్వకుండా సెలవు ఇస్తారని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తులను పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని డైరెక్టర్ తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోకు పంపాలని, దరఖాస్తులకు ఈ నెల 20 ఆఖరు తేదీ అని పేర్కొన్నారు.

తుఫాను ముప్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాలకు మరో తుఫాను ముప్పు ఉన్నదని వాతావరణ శాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం, జనగాం, వరంగల్, హన్మకొండ, ములుగు, కొత్తగూడెం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఏపీలోని కోస్తా, ఉత్తరాంధ్రలో మాత్రం భారీ వర్షాలకు అవకాశం ఉన్నట్టు చెప్పారు.

సీఎం ఇలాకాలో ఫార్మా వ్యతిరేక దీక్షలు





గురువారం హకీంపేటలో ధర్నా చేస్తున్న రైతులు.. ఫార్మా వద్దంటూ పోలేపల్లిలోని ఎల్లమ్మ దేవాలయం వద్ద బైఠాయించిన రైతులు

బొంరాస్‌పేట, సెప్టెంబర్ 12 : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో ఏర్పాటు చేయతలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఆందోళనను తీవ్రతరం చేశారు. ఈ ప్రాంతంలోకి ఫార్మా రావద్దంటూ మహిళలు గురువారం పోలేపల్లిలోని ఎల్లమ్మ దేవాలయంలో ముడుపు కట్టారు. అనంతరం బాధిత గ్రామాలకు చెందిన రైతులు గో బ్యాక్ ఫార్మా అని నినదిస్తూ హకీంపేట చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. రైతుల ఆందోళనకు సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు పలికారు. సాగు భూముల్లో ఫార్మా కంపెనీల ఏర్పాటుతో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, వాయు, నీటి కాలుష్యం ఏర్పడి ప్రజలు రోగాల బారిన పడుతారని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. తరాల నుంచి భూములనే నమ్ముకుని వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న తాము ఫార్మా ఏర్పాటు వల్ల కూలీలుగా మారే ప్రమాదం ఉన్నదని ఆవేదన చెందారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఫార్మా విలేజ్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకుడు యాదయ్య మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి బినామీ పేర్లతో భూములు తీసుకుని ఫార్మా కంపెనీలకు కట్టబెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫార్మా కంపెనీని రానివ్వమని పేర్కొన్నారు. అనంతరం రిలే దీక్ష ప్రారంభించారు.

సీనియార్టీ జాబితా రూపొందించాకే బదిలీలు

తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల పిటిషన్లపై హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను రూపొందించి, 2023 నాటి మార్గదర్శకాల ప్రకారం బదిలీలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. బదిలీలకు పాయింట్‌లను లెక్కించే ముందు పాఠశాలలో చేరిన తేదీని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టంచేసింది. సీనియార్టీ జాబితా లేకుండా రూపొందించిన మార్గదర్శకాలను సవాలు చేస్తూ వెంకటరమేశ్ మరో 14 మంది దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీ మార్గదర్శకాలు గతంలో ప్రభుత్వం జారీచేసిన జీవో 81కి విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. పిటిషనర్లు 2012 నోటిఫికేషన్ ఆధారంగా 2013, 2014 సంవత్సరాల్లో నియమితులయ్యారని, అధికారుల పాలనాపరమైన వివాదాల వల్ల కొందరు 16 నెలలు ఆలస్యంగా నియమితులయ్యారని చెప్పారు. సీనియార్టీ జాబితా రూపొందించే ముందు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను వేరుగా చూడరాదని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని గుర్తుచేశారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ విద్యాశాఖ కింద పనిచేస్తున్న ఎగ్జిక్యూటివ్ కమిటీ బదిలీ మార్గదర్శకాలను రూపొందించిందని చెప్పారు. ఇవి జీవో 81కి విరుద్ధం కాదని, దానికి అనుగుణంగానే ఉన్నాయని తెలిపారు. పిటిషనర్లు అందరూ పదేండ్లకు పైబడి ఒకేచోట పనిచేస్తున్నారని, అందరూ బదిలీకి అర్హులేనని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి ఒకే నోటిఫికేషన్ ఆధారంగా నియమితులైనందున వారు చేరిన తేదీలు, తెలుగు, ఆంగ్ల మాధ్యమాలతో నిమిత్తం లేకుండా సీనియార్టీ జాబితా రూపొందించి, బదిలీ పాయింట్‌లను కేటాయించి బదిలీ ప్రక్రియను చేపట్టాలని ఆదేశిస్తూ పిటిషన్‌లపై విచారణను మూసివేశారు.

హత్యాచారం కేసులో నిందితుడికి ఉరిశిక్ష

తీర్పు వెల్లడించిన సంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు జడ్జి జయంతి

సంగారెడ్డి, సెప్టెంబర్ 12: బాలికపై లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన కేసులో నిందితుడు గఫార్ అలీకి ఉరిశిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టులోని ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి జయంతి తీర్పు వెల్లడించారు. గురువారం సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో గుంపుమేస్త్రీగా పనిచేసే చింతల శ్రీనివాస్‌రావు దగ్గర బీహార్‌కు చెందిన శంకర్, అతడి భార్య ఉమాదేవి పని చేస్తుండేవారు. 16 అక్టోబర్ 2023న తన దగ్గర పని లేకపోవడంతో చింతల శ్రీనివాస్‌రావు వారిని మరో కంపెనీలో పనికి పంపించాడు. ఆ రోజు తన మనుమరాలిని సెక్యూరిటీ గార్డు వద్ద ఉంచి వారు పనికి వెళ్లారు. ఆ సమయంలో వారి లేబర్ రూమ్ పక్కన ఉండే గఫార్.. మద్యం మత్తులో సెక్యూరిటీ గార్డు దగ్గర ఉన్న బాలికకు మద్యం కలిపిన కూల్‌డ్రింక్‌ను తాగించి పత్తి చేనులోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఎవరికైనా చెప్తుందేమోనన్న భయంతో చంపేశాడు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో అప్పటి భానూర్ ఎస్‌హెచ్‌వో రవీందర్‌రెడ్డి కేసు నమోదు చేసి డీఎస్పీ పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. మృతురాలి కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని జడ్జి జయంతి తీర్పు చెప్పారు. సంగారెడ్డి జిల్లాలో 27 ఏండ్ల తర్వాత మరణ శిక్ష విధించడం ఇదే తొలిసారి అని ఎస్పీ రూపేశ్ తెలిపారు.

టెక్ ఎక్స్‌పోతో విద్యార్థులకు ప్రయోజనం

- ఎంజేపీ కార్యదర్శి బడుగు సైదులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించేందుకు కృషి చేస్తున్నామని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అన్నారు. తుర్కపల్లిలోని బీసీ గురుకుల బాలుర పాఠశాలలో టెక్ ఏరోస్ ఇన్నోవేషన్స్ సహకారంతో గురువారం ఏర్పాటు చేసిన రోబోటిక్స్-డ్రోన్స్ టెక్ ఎక్స్‌పోను సైదులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే సాంకేతిక నైపుణ్యం అందించే లక్ష్యంతో ఎక్స్‌పో నిర్వహిస్తున్నామన్నారు.

ఖానాపూర్ అసైన్డ్ రికార్డుల మాయంపై విచారణ

190 ఎకరాలు లావుని పట్టాలే.. : ఆర్డీవో

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 12: అసైన్డ్ భూముల క్రయవిక్రయాలు, రికార్డుల మాయంపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఖానాపూర్‌లోని సర్వే నంబర్ 79లో 'అసైన్డ్ భూమి అవుట్' అనే శీర్షికన ప్రచురితమైన కథనం చర్చనీయాంశంగా మారింది. ఖానాపూర్‌లోని 79 సర్వే నంబర్‌లో 190 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా, ఆ భూమిని 1950లో భూములు లేని పేదలకు ప్రభుత్వం అసైన్డ్ పట్టాలు అందజేసింది. 1980లో కొందరు పట్వారీలు ఆ భూమిని రికార్డుల్లో పట్టా భూమిగా రెండేండ్లు రాశారు. ఆ తర్వాత తప్పు తెలుసుకున్న అధికారులు, ఆ భూమిని తిరిగి లావుని పట్టాగా రికార్డులో ఎక్కించారు. భూమికి సంబంధించిన కాస్రా పహాణీ, చౌపస్లను కూడా మాయం చేసినట్టు ఆరోపణలున్నాయి. సర్వే నంబర్ 79లోని 190 ఎకరాలు పూర్తిగా లావుని పట్టాలని, వాటిపై ఎలాంటి క్రయవిక్రయాలు జరిగినా చెల్లవని ఆర్డీవో అనంతరెడ్డి తెలిపారు. ఖానాపూర్‌లోని సర్వే నంబర్ 79లోని లావుని భూముల క్రయ విక్రయాలపై విచారణ చేపట్టాలని ఆర్‌ఐ పుష్పలతను ఆదేశించినట్టు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత తెలిపారు. గురువారం గ్రామానికి వెళ్లిన ఆర్‌ఐ 79సర్వే నంబర్‌లోని లావుని పట్టా భూములను పరిశీలించి, క్రయ విక్రయాలపై ఆరా తీశారు.

మరిన్ని వార్తలు
ntnews.com లో చూడగలరు

పదివేలు ఇస్తేనే ఇంటి నంబర్

8వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

నందిపేట్, సెప్టెంబర్ 12: ఇంటి నంబర్ కేటాయించేందుకు లంచం తీసుకుంటూ గ్రామపంచాయతీ కార్యదర్శి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికాడు. నిజామాబాద్ జిల్లా నందిపేట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సుభాష్ పంచాయతీ అనుమతి తీసుకుని బైపాస్ రోడ్డులో ఏడాది క్రితం ఇల్లు కట్టుకున్నాడు. ఇంటి నంబర్ కోసం ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసేందుకు గ్రామపంచాయతీకి పలుమార్లు వెళ్లాడు. చౌడమ్మ కొండూరు పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్ డిప్యుటేషన్‌పై నందిపేట్‌కు రాగా, ఇక్కడి కార్యదర్శి సౌమ్య చౌడమ్మ కొండూర్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఆర్నెళ్ల క్రితం ఇక్కడకు వచ్చిన పంచాయతీ సెక్రెటరీ నవీన్‌కుమార్‌ను సుభాష్ కలువగా, రూ.10 వేలు ఇస్తే పని చేసి పెడతానని చెప్పాడు. చివరకు రూ.8 వేలకు అంగీకరించాడు. గురువారం పంచాయతీ కార్యాలయంలో ఆటో డ్రైవర్ సుభాష్ నుంచి రూ.8 వేలు లంచం తీసుకుంటుండగా పంచాయతీ కార్యదర్శి నవీన్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఏసీబీకి పట్టుబడిన జీపీ కార్యదర్శి నవీన్

మక్కలకు రికార్డు ధర

ఎనుమాముల మార్కెట్‌లో క్వింటాకు రూ. 3,070

కాశీబుగ్గ, సెప్టెంబర్ 12 : వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో గురువారం మక్కలకు రికార్డు ధర పలికింది. హనుమకొండ జిల్లా ఒంటిమామిడిపల్లికి చెందిన పెండ్లి తిరుపతి 66 క్వింటాళ్ల మక్కలు తీసుకురాగా సదా ఎంటర్ ప్రైజెస్ వ్యాపారి క్వింటాకు రూ. 3,070 చొప్పున కొనుగోలు చేశారు. మరో రైతు 22 క్వింటాళ్లకు ఇదే ధర పలికింది. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 2,090 ఉండగా నెల రోజులుగా ధర పెరుగుతున్నదని అధికారులు తెలిపారు. అధిక ధరతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డెంగ్యూతో చిన్నారి మృతి


సాయిశ్రీ (ఫైల్)

చిట్యాల (మొగుళ్లపల్లి), సెప్టెంబర్ 12 : డెంగ్యూతో ఓ చిన్నారి గురువారం మరణించింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇస్సిపేటకు చెందిన జన్నె రాజు కుమార్తె సాయిశ్రీ(6)కి ఇటీవల జ్వరం రావడంతో పరకాలలోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని డాల్ఫిన్ చిల్డ్రన్స్ కేర్‌కు మొదట చిన్నారి ఆరోగ్యం బాగుందని చెప్పిన వైద్యులు బుధవారం డెంగ్యూగా నిర్ధారించినట్టు చెప్పారు. గురువారం పరిస్థితి విషమించి మృతి చెందింది. కుటుంబ సభ్యులు, బంధువులు దవాఖాన ఎదుట ఆందోళన చేశారు.

కాకతీయ కెనాల్ ఒడ్డున పసికందు లభ్యం

- శిశువు అరుపులు విని కాపాడిన గ్రామస్థుడు
- హుజూరాబాద్ రూరల్‌లో ఘటన

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబర్12: ఏ తల్లి కన్నతో తెలియదు. భారం అనుకుందో.. బరువనుకుందో కానీ.. మాతృత్వాన్ని మరిచిన ఓ తల్లి.. అప్పుడే పుట్టిన శిశువును కాకతీయ కాలువలో పడేసి వెళ్లిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ గ్రామస్థుడు శిశువు అరుపులు విని పసికందు ప్రాణాలు కాపాడాడు. ఈ ఘటన గురువారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం తుమ్మనపల్లి సమీపంలోని కాకతీయ కెనాల్ వద్ద జరిగింది. తుమ్మనపల్లి గ్రామ సమీపంలోని కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి వంతెన వద్ద కాకతీయ కాలువలో అదే గ్రామానికి చెందిన గుంటేటి చొక్కారెడ్డి తన ట్రాక్టర్‌ను కడిగేందుకు వెళ్లాడు. కాలువ లైనింగ్ వెంట పెరిగిన చిన్నపాటి చెట్టు వద్ద




పసికందు ఏడుపు వినిపించింది. ఏడుపును గమనించిన ఆయన అటుగా వెళ్లి.. చుట్టూ దుస్తులు చుట్టి సంచిలా ఉన్న మూటను తెరిచి చూశాడు. అందులో ఏడుస్తూ ఉన్న మగ శిశువు కనిపించింది. వెంటనే గ్రామస్థులకు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్ వచ్చి పసికందును తన వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. బాబు జన్మించి 24 గంటలు అవుతుందని, ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఏసీసీ శ్రీనివాస్ సైతం దవాఖానకు వెళ్లి శిశువు బాగోగుల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనల మేరకు శిశువును మాతాశిశు సంరక్షణ కేంద్రానికి తరలిస్తామని పోలీసులు తెలిపారు.

కులగణన కోసం రేపు సత్యాగ్రహ దీక్ష

విద్యార్థులు భారీగా తరలిరావాలి: వీ శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) ప్రధాన గేటు వద్ద శనివారం నిర్వహించ తలపెట్టిన ఓబీసీ సత్యాగ్రహ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థులు భారీగా తరలిరావాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ దీక్షలో పాల్గొనాల్సిందిగా శ్రీనివాస్‌గౌడ్‌ను అసోసియేషన్ నేతలు గురువారం కలిసి ఆహ్వానించారు. ఆయన సానుకూలంగా స్పందించడమేగాక దీక్షకు మద్దతు ప్రకటించారు. దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించడంతోపాటు, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్ ఎత్తివేయాలని, బీసీలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్లు ఇవ్వాలని, దేశవ్యాప్తంగా ఓబీసీ నేషనల్ ఫెలోషిప్‌లను రూ.5 వేలకు పెంచాలని ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం కూడా 3 నెలల్లో కులాలగణన చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ అమలుచేయాలని కోరారు. కులగణనతోనే వెనుకబడిన కులాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి సాయికిరణ్, రాష్ట్ర అధ్యక్షుడు శివ ముదిరాజ్, సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అభినేష్, బొమ్మ ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను సత్యాగ్రహ దీక్షకు ఆహ్వానిస్తున్న ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ నేతలు. చిత్రంలో కిరణ్‌కుమార్, సాయికిరణ్, శివ తదితరులు

వక్ఫ్ బోర్డు నిర్వీర్యానికే చట్ట సవరణలు

- కేంద్రం తీసుకొచ్చే సవరణ బిల్లుతో ముస్లిములకు తీవ్రనష్టం
- చట్ట సవరణకు వ్యతిరేకంగా కేసీఆర్ జేపీసీకి లేఖ రాశారు..
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి మహమూద్ అలీ



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి మహమూద్ అలీ

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): వక్ఫ్ బోర్డును నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతో చట్ట సవరణలకు ప్రతిపాదించి, వక్ఫ్ బోర్డుపై దుష్ప్రచారాలు చేస్తున్నారని మాజీ మంత్రి మహమూద్ అలీ అన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులతో కలిసి మహమూద్ అలీ మాట్లాడారు. 1995 వక్ఫ్ యాక్ట్‌లో 44 సవరణలను కేంద్రం ప్రతిపాదించిందని, సవరణలు దుర్మార్గమైనవని తెలిపారు. పదేండ్లలో కూడా వక్ఫ్ బోర్డుకు అన్యాయం చేయాలని చూశారని, కానీ వారి ప్రయత్నాలను కేసీఆర్ సాగనివ్వలేదన్నారు. వక్ఫ్ బోర్డుకు అన్యాయం చేయడానికే కేంద్రం సవరణ బిల్లును తీసుకువస్తున్నదని, అందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమించారని తెలిపారు. సవరణలను బీఆర్‌ఎస్ పార్టీ వ్యతిరేకిస్తున్నదని, కేసీఆర్ సైతం జేపీసీకి లేఖ రాశారని గుర్తుచేశారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో ముస్లిములకు తీవ్రనష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సలీం, వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ మసియుల్లాఖాన్, జమీల్, మునీర్, బాసిత్ పాల్గొన్నారు.

వనపర్తిలో కూల్చివేతలు

- నల్లచెరువు పరిధిలో గోడ తొలగింపు
- 15 మంది ఇండ్ల యజమానులకు నోటీసులు



వనపర్తి నల్లచెరువు పరిధిలో నీళ్లు రాకుండా కట్టిన గోడను కూలుస్తున్న జేసీబీ

వనపర్తి, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : వనపర్తి ప్రజల్లోనూ హైడ్రా తరహాలో హడల్ మొదలైంది. జిల్లా కేంద్రానికి సమీపంలోని నల్లచెరువు నీళ్లు పట్టణంలోకి రాకుండా కట్టిన గోడను గురువారం జేసీబీతో అధికారులు కూలగొట్టారు. ఈ చెరువు పరిధిలో నిర్మాణాలు చేపట్టిన 9 మందికి, తాళ్ల చెరువు పరిధిలో నిర్మాణ యజమానులు ఆరుగురికి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల అనుమతులతోనే నిర్మాణాలు చేపట్టామని వారు చెబుతున్నారు. తమున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్‌ను సంప్రదించగా.. పట్టణం చుట్టూ ఉన్న నాలుగు చెరువులకు సంబంధించి సర్వే చేస్తున్నట్టు తెలిపారు. చిన్న గోడ మాత్రమే కూల్చామని, ఇంకా ఇండ్ల వరకు వెళ్లలేదని ఆయన పేర్కొన్నారు.

మూలవాగు వెంట రెండో రోజూ సర్వే



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్ రహదారి మూలవాగు వెంట గురువారం రెండోరోజైన గురువారం డివిజనల్ సర్వే అధికారి బాలచంద్రం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ మూలవాగు సరిహద్దును ఆనుకొని దాదాపు 60 సర్వే నంబర్లు ఉన్నాయని, ప్రస్తుతానికి 10 మాత్రమే పూర్తయ్యాయని చెప్పారు. మొత్తం ప్రక్రియ పూర్తయ్యాక కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని పేర్కొన్నారు. - వేములవాడ

కబ్జాదారులం కాదు.. రిటైర్డు ఉద్యోగులం

- సమాచారం లేకుండానే మా స్థలాలు ఎఫ్‌టీఎల్‌లోకి..
- ఓ అధికారి తప్పిదంతో ఈ అవస్థలు
- రీ సర్వేకు ఆదేశాలు ఇచ్చిన విజిలెన్స్ సెల్
- నోటీసులివ్వకుండానే హైడ్రా కూల్చివేతలు
- గుట్టలబేగంపేట బాధితుల ఆవేదన



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సైట్ రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కొండయ్య

ఖైరతాబాద్, సెప్టెంబర్ 12: 'ప్రభుత్వానికి 35 ఏండ్ల పాటు సర్వీసు అందించి.. పైసా పైసా కూడబెట్టుకొని.. సొసైటీగా ఏర్పడి కొనుకున్న స్థలాన్ని తమకు సమాచారం ఇవ్వకుండానే ఎఫ్‌టీఎల్‌లో చేర్చారు.. డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్‌లో ఉన్న స్థలంలో నిర్మాణాలను నోటీసులివ్వకుండానే కూల్చివేశారు. ' అని స్థల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో సైట్ (స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ చుక్కా కొండయ్య మాట్లాడుతూ.. 1992లో సైట్ ఉద్యోగలంతా సైట్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీని ఏర్పాటు చేసుకొని తమ సొంతింటి కల నెనవేర్చుకునేందుకు రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటలో సర్వే నం. 12, 12ఏ, 13లో 24 ఎకరాలు కొనుగోలు చేశామని చెప్పారు. అదే సంవత్సరం హుడా సొసైటీకి అనుమతినిచ్చిందని తెలిపారు. 236 మంది సభ్యులం ఇక్కడ 220 గజాల చొప్పున సొంతం చేసుకున్నామని చెప్పారు. పదవీ విరమణ పొందిన తర్వాత కొందరు ఇక్కడ నిర్మాణాలు చేపట్టారని, ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. ఈ ప్లాట్లు నీటి మట్టానికి ఎత్తులో గుట్టలపై ఉందని, 2014 వరకు ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని చెప్పారు. ఓ అధికారి చర్యల వల్ల తమకు తెలియకుండానే ఎఫ్‌టీఎల్‌లో చేర్చారని, అది కూడా డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్‌లో చేర్చినట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. దీంతో రీసర్వే చేయించాలని అనేక వినతులు ప్రభుత్వానికి పంపించామని, 2019లో విజిలెన్స్ సెల్‌ను ఆశ్రయించగా, రీసర్వే చేయాల్సిందిగా వారు సిఫారసు చేశారని తెలిపారు. తాజాగా ఈ ఏడాది జూన్, జూలైలో సంబంధిత శాఖకు రీసర్వే కోసం లేఖ రాయగా, తాత్సారం చేశారని చెప్పారు. ఫలితంగా హైడ్రా ఈ నెల 8న ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఈ స్థలాన్ని నిర్దాక్షిణ్యంగా కూల్చివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని సామాజిక, ప్రసార మాధ్యమాల్లో తమను కబ్జాదారులుగా చిత్రీకరిస్తున్నారని, తాము కబ్జాదారులం కాదని, ప్రభుత్వానికి సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగలమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సొసైటీ అధ్యక్షులు బీఎస్‌ఎస్‌ఎన్ రాజు, శివశంకర్, నాగేందర్, రవి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కోటిన్నర మెటీరియల్ ధ్వంసం



బ్యాంకులో అప్పు చేసి ప్లంబింగ్ వస్తువుల వ్యాపారం ప్రారంభించాను. గుట్టల బేగంపేటలో ప్లాట్ నం.189లో చిన్న షెడ్డు వేసుకొని నలుగురు పార్ట్‌నర్స్‌తో కలిసి వ్యాపారం చేస్తున్నాను. పది సంవత్సరాలుగా జీహెచ్‌ఎంసీకి ఆస్తి పన్ను, కరెంటు బిల్లు కడుతున్నాను. ఈ నెల 8న సుమారు కోటిన్నర విలువైన ప్లంబింగ్ మెటీరియల్ షెడ్డులోనే ఉండగా, ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండానే కూల్చివేశారు. - రూపారాం చౌదరి, బాధితుడు

మా అమ్మ చివరి కోరిక ఇల్లు



మా నాన్న నాగేంద్ర కుమార్ సివిల్ ఇంజినీర్. 2013లో ప్లాట్ నం.185ను గుట్టల బేగంపేటలో కొనుగోలు చేశారు. పక్కనే మా నాన్న స్నేహితుడు ప్లాట్ నం.186లో కొన్నారు. ఇద్దరూ కలిసి 2016లో జీహెచ్‌ఎంసీ అనుమతితో జీ+4 నిర్మాణం చేపట్టారు. ఆ తర్వాత ఈ స్థలం డ్రాఫ్ట్ ఎఫ్‌టీఎల్ ఉందని తెలియడంతో హైకోర్టును ఆశ్రయించాం. కోర్టు స్టేటస్‌కో ఇచ్చింది. ఆ కేసు విచారణలో ఉండగానే నోటీసు ఇవ్వకుండా మా ఇంటిని కూల్చివేశారు. - నీరద్ నున్న, బాధితుడు

ఆ అధికారికి వెయ్యి గజాలు ఇవ్వనందుకే



2014లో ఇరిగేషన్ శాఖలో ఎస్ఈ స్థాయి అధికారి వెయ్యి గజాలు తనకు రాసిఇవ్వాలని కోరారు. అందుకు మా సొసైటీ నిరాకరించింది. అది మనసులో పెట్టుకొని ఈ స్థలాన్ని అదే ఏడాది ఎఫ్‌టీఎల్‌లో మార్చారు. వాస్తవానికి 2014కు ముందు ఈ స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదు. గుట్టలపై నీటి మట్టానికి ఎత్తులో ఉంటే ఈ స్థలం ఎఫ్‌టీఎల్ పరిధిలోకి ఎలా వస్తుంది? - రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ సదానందం, బాధితుడు

ఎట్టకేలకు ఆర్టీసీలో పండుగ అడ్వాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : ఆర్టీసీ జేఏసీ ఒత్తిడికి ఆర్టీసీ యాజమాన్యం దిగొచ్చి, పండుగ అడ్వాన్స్ చెల్లించడానికి అంగీకరించింది. గతంలో నిలిపివేసిన పండుగ అడ్వాన్స్‌ను పునరుద్ధరిస్తున్నట్టు ప్రకటించింది. దసరా అడ్వాన్స్‌గా క్లాస్-3 ఉద్యోగులకు 6 వేలు, క్లాస్-4 ఉద్యోగులకు 5,500 ఇవ్వనున్నట్టు పేర్కొంది. 25 వేల మంది కార్మికులకు ప్రయోజనం చేకూరనుందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కోకన్వీనర్ యాదయ్య, సురేశ్ పేర్కొన్నారు.

ఇరిగేషన్‌శాఖలో ప్రత్యేక ఎలక్ట్రికల్ డివిజన్!

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో ప్రత్యేకంగా ఎలక్ట్రికల్ డివిజన్‌ను ఏర్పాటు చేయాలని సమాలోచనలు చేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ఇప్పటికే ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపారు. ఎత్తిపోతల పథకాల ప్రాధాన్యాన్ని గుర్తించి గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ శాఖకు ప్రత్యేకంగా 150 ఎలక్ట్రికల్ పోస్టులను మంజూరు చేసింది. అభ్యర్థుల ఎంపిక కూడా పూర్తయ్యింది. ప్రభుత్వ సలహాదారు పెంటారెడ్డి నేతృత్వంలో ప్రత్యేక డివిజన్ ఏర్పాటు చేసి ఎలక్ట్రికల్ ఇంజినీర్లకు తర్ఫీదునివ్వాలని ఈ శాఖ నిర్ణయించింది.

విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించండి

- ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రోజువారీ అవసరాల కోసం ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్ (ఐఈఈ) నుంచి విద్యుత్తు కొనుగోలు చేసేందుకు తెలంగాణ డిస్కంలకు హైకోర్టు అనుమతించింది. దీంతో 60 మిలియన్ యూనిట్ల విద్యుత్తు కొనుగోలుకు ఎస్పీడీసీఎల్‌కు అడ్డంకులు తొలగిపోయాయి. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. సమగ్ర వివరాలతో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ దసరా సెలవుల తర్వాత చేపడతామని ప్రకటించింది.

క్యాబినెట్ విస్తరణ ఈసారైనా తేలేనా?

- అధిష్ఠానంతో మరోమారు సీఎం రేవంత్ చర్చలు
- అధ్యక్షుడు ఖర్గే, సెక్రటరీ కేసీ వేణుగోపాల్‌తో భేటీ
- ఆ తర్వాత కీలక నేతలతో లంచ్ మీటింగ్‌లో చర్చ



హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రివర్గ విస్తరణ 'ఓ స్త్రీ రేపు రా' అన్నట్టు తయారైంది. క్యాబినెట్ విస్తరణ నేడో రేపో అంటూ ఎనిమిది నెలలుగా వాయిదా పడుతూనే ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర నేతలు ఢిల్లీ వెళ్లడం, అధిష్ఠానంతో చర్చించడం, తిరిగి రావడం, ఇక రేపో మాపో అయిపోతుందని లీకులు ఇవ్వడం పరిపాటిగా మారిపోయింది. దీనికి కొనసాగింపుగాను మంత్రివర్గ విస్తరణపై గురువారం ఢిల్లీలో మరోసారి హైడ్రామా నడిచింది. ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానం పెద్దలు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో వరుసగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్గ కూర్పుపై లోతుగా చర్చించినట్టు తెలిసింది. సామాజిక కూర్పు, సీనియార్టీ, జిల్లా ప్రాతిపదికన పలువురు పేర్లపై చర్చించినట్టు సమాచారం. ఆ తర్వాత సీఎం రేవంత్ నివాసంలో కీలక నేతలు లంచ్ మీటింగ్‌లో తదుపరి చర్చలు కొనసాగించినట్టు తెలిసింది. ప్రస్తుతం మంత్రివర్గంలో ఆరు ఖాళీలు ఉండగా మొత్తం భర్తీ చేయాలా లేక సగం భర్తీ చేసి మిగిలినవి ఆపేయాలా అన్న అంశంపైనా చర్చించినట్టు చెప్తున్నారు. ఈ సారైనా చర్చలు ఫలించి మంత్రివర్గ విస్తరణ పూర్తవుతుందా లేక షరామాములుగానే మళ్లీ పెండింగ్‌లో పడుతుందా అన్న అనుమానాలు కాంగ్రెస్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

పట్టించుకోని బడే భాయ్?

- సీఎంకు దొరకని మోదీ, షా అపాయింట్‌మెంట్

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినట్టు సమాచారం. అయితే వారు స్పందించలేదని ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. పార్టీ పనుల కోసం ఢిల్లీకి చక్కర్లు కొడుతున్నారన్న విమర్శల నేపథ్యంలో.. ప్రధానిని, అమిత్ షాను కలిసి, ఒక వినతి పత్రం ఇవ్వాలని, అధికారిక పర్యటన కోసమే వచ్చానని చెప్పుకోవాలని సీఎం భావించారని అంటున్నారు. అయితే వారు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో ఉసూరుమన్నారని చెప్పుకుంటున్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేకే పీఏసీ చైర్మన్ పదవి

- పార్టీ ఫిరాయింపుల చట్టం కఠినంగా ఉంటే మాకే మంచిది
- గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు
- ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేకే ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్ పదవి ఇచ్చినట్టు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో గురువారం ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. పార్టీ ఫిరాయింపులపై చట్టం కఠినంగా ఉంటే అది తమ ప్రభుత్వానికే మంచిదని అన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై కోర్టు తీర్పులు తమకు మేలు చేస్తాయని తెలిపారు. జర్నలిస్టులకు గత ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అక్రెడిటేషన్లు ఇచ్చిందని ఆరోపించారు. ఇప్పుడు కొత్త అక్రెడిటేషన్ల మంజూరీకి విధివిధానాలు రూపొందించడంలో జర్నలిస్ట్ సంఘాలు కీలకపాత్ర పోషించాలని సూచించారు.



మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న నేతలు జంగయ్య, నారాయణ, మధుసూదన్

సర్కారుకు గురుకుల జేఏసీ సమ్మె నోటీసు

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- పనివేళలు మార్చాలని అల్టిమేటం
- 18 నుంచి ఆందోళనలకు పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ) : గురుకులాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని, లేకుంటే దశలవారీగా ఆందోళనలు చేపడుతామని రాష్ట్ర సర్కారుకు టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసి సమ్మె నోటీసు అందజేసింది. 28న మహాధర్నా నిర్వహించనున్నట్టు వెల్లడించింది. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద యూటీఎఫ్, గురుకుల జేఏసీ నేతలు జంగయ్య, మామిడి నారాయణ, మధుసూదన్ మాట్లాడుతూ.. తెలంగాణలో 5శాఖల పరిధిలోని సొసైటీల కింద 1,022 గురుకులాలు ఉన్నాయని, వీటిలో సుమారు 600లకు పైగా అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మెస్‌చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం కష్టమవుతుందని, ఇటీవల నిర్ణయించిన పనివేళలు శాస్త్రీయంగా లేవని, విద్యార్థులు, ఉపాధ్యాయులపై తీవ్ర మానసిక ఒత్తిడి పెరుగుతుందని వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు విన్నవించినా ప్రభుత్వం స్పందించకపోవడంపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలోనే వాస్తవ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. 18,19 తేదీల్లో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసనలు, 22,23 తేదీల్లో ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు వినతిపత్రాల అందజేత, 28న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో చావ రవి, నర్సింహాగౌడ్, జగదీశ్, భిక్షం, గణేశ్, ఏవీ చారి పాల్గొన్నారు.

జేఏసీ ప్రధాన డిమాండ్లు..

- విద్యార్థుల మెస్‌చార్జీలు పెంచాలి. స్టడీ టేబుల్స్, కాట్స్ అందించాలి.
- వైద్యం బాధ్యతలు స్థానిక డాక్టర్లకే ఇవ్వాలి
- అన్ని గురుకులాల్లో మౌలిక వసతులకు బడ్జెట్ విడుదల చేయాలి.
- బోధనా సమయాన్ని 9 నుంచి 4:30 గంటల వరకు కొనసాగించాలి.
- గురుకులాల్లోనూ ప్రమోషన్ నిష్పత్తిని 70:30గా నిర్ణయించాలి.
- 317 జీవోతో ఇతర జోన్లలో అలాటైన వారిని సొంతజోన్లకు పంపించాలి.
- అన్ని గురుకులాల నిర్వహణకు కామన్ డైరెక్టరేట్‌ను ఏర్పాటుచేయాలి.
- ఉపాధ్యాయుల జీతాలను 010 పద్దు ద్వారా ఒకటో తారీకునే చెల్లించాలి.
- ఆర్ట్స్, క్రాఫ్ట్స్, మ్యూజిక్, స్టాఫ్‌నర్స్‌లకు పదోన్నతి కల్పించాలి.
- రెగ్యులర్ డిప్యూటీ వార్డెన్లు, నైట్ వాచ్‌మెన్లను నియమించాలి.
- కేర్‌టేకర్, నైట్‌స్టే బాధ్యతల నుంచి టీచర్లను మినహాయించాలి.
- కాంట్రాక్టు, గెస్ట్, పార్ట్‌టైం, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి.
- ఉపాధ్యాయులకు బేసిక్‌పేతో 12 నెలల వేతనాలు చెల్లించాలి.

బ్యాంకర్లపై చర్యలకు ఫిర్యాదు చేస్తాం

- రుణమాఫీ అమలులో నిర్లక్ష్యంపై..
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



ములుగు మండలం శివతండాలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ములుగు, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : రుణమాఫీ అమలులో నిర్లక్ష్యంవహించిన బ్యాంకర్లపై చర్యలకు సంబంధిత బ్యాంకుల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రకటించారు. ములుగు మండలం శివతండా గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. ములుగు జిల్లాలోని రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం 190 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. బ్యాంకర్ల నిర్లక్ష్యం కారణంగా కేవలం 100 కోట్ల మేర రైతుల ఖాతాల్లో జమయ్యాయని పేర్కొన్నారు. విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో ఇటీవల ఏటూరునాగారం ఐటీడీఏలో బ్యాంకర్లతో సమీక్ష నిర్వహించామని, 15 రోజుల క్రితం మరో 40 కోట్లు జమ చేయించినట్టు తెలిపారు. మరో 50కోట్లు బ్యాంకర్ల వద్దనే ఉన్నాయని, వాటినీ ఖాతాల్లో జమ చేయిస్తామని హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వ కమిటీ

- మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో ఏర్పాటు

హైదరాబాద్, సెప్టెంబర్12 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను వర్గీకరణ తీర్పుపై అధ్యయనం, సిఫారసులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర సాగునీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోచైర్మన్‌గా, మంత్రులు సీతక్క, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి సభ్యులుగా, ఎస్సీ అభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని మెంబర్ సెక్రటరీగా నియమించారు. కమిటీ ఏర్పాటుపై ఎస్సీవర్గాల్లో భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.

రుణమాఫీ కోసం 16న ధర్నాలు

- తహసీల్దార్ ఆఫీసుల ఎదుట ఆందోళన
- రైతు ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు



ఆర్మూర్‌లో మీడియాతో మాట్లాడుతున్న రైతు జేఏసీ నాయకులు

ఆర్మూర్‌టౌన్ , సెప్టెంబర్ 12: షరతుల్లేని రుణమాఫీ, రైతుభరోసా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ధర్నాలు నిర్వహించనున్నట్టు రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఇట్టడి గంగారెడ్డి, నూతుల శ్రీనివాస్, దేగాం యాదాగౌడ్, సుక్కి సుధాకర్, తిరుపతిరెడ్డి, అల్లూరి గంగారెడ్డి ప్రకటించారు. నిజామాబాద్ రూరల్, బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల్లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్టు వారు తెలిపారు. గురువారం వారు ఆర్మూర్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీ మేరకు షరతులు లేకుండా 2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా కింద రూ.7,500 చొప్పున ఇవ్వడానికి సెప్టెంబర్ 15 వరకు తాము ఇచ్చిన గడువు దగ్గరకొస్తుందని తెలిపారు. రైతు భరోసా యాప్‌లో తెల్ల రేషన్‌కార్డు లేని రైతు కుటుంబాలను నిర్ధారిస్తున్నామని కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబ నిర్ధారణ పూర్తయిన రైతులకు ఎందుకు రుణమాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షల పైన అప్పు ఉన్న రైతుల పరిస్థితిపై ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 16న అన్ని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

గురుకుల టీచర్లు ఆందోళనకు సిద్ధంకండి

- టీఎస్‌యూటీఫ్, గురుకుల జేఏసీ పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళనలకు సిద్ధంకావాలని టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ నాయకులు గురుకుల ఉద్యోగులు, టీచర్లకు పిలుపునిచ్చాయి. టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, గురుకుల జేఏసీ అధ్యక్షుడు మామిడి నారాయణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధుసూదన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే జనార్దన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురుకులాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బోధించాలని ప్రభుత్వం అశాస్త్రీయంగా జీవో నంబర్‌ను 16ను విడుదల చేసిందని ఆక్షేపించారు. దీంతో 30వేల మంది ఉద్యోగులు, 6 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులుపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆందోళనల నిర్వహణకు కార్యాచరణ రూపొందిస్తున్నామని, గురుకులాల ప్రిన్సిపాళ్లకు గురువారం నోటీసులు సైతం అందించినట్లు స్పష్టం చేశారు.

• మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణికి నివాళి



మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి ఇటీవల మృతి చెందడంతో.. గురువారం ఆయన సొంతూరు నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఆవంచలో లక్ష్మారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పరామర్శించారు. శ్వేతారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీ వినోద్, మాజీ ఎమ్మెల్యేలు పరామర్శించారు. –తిమ్మాజిపేట

రైతు ఆత్మహత్యలపై సర్కారు మొద్దునిద్ర

రుణమాఫీ కాక, రైతుభరోసా లేక ఆత్మహత్యలు

- రైతుల ప్రాణాలను రాష్ట్ర సర్కారే తీస్తున్నది
- రుణమాఫీ కాలేదని జగిత్యాల రైతు ఆత్మహత్యాయత్నం
- సీఎం ఢిల్లీ యాత్రలు బంద్‌జేసి రైతాంగం కన్నీళ్లు తుడవాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): రైతుల ఆత్మహత్యలపై రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు మొద్దునిద్ర పోతున్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాక, రైతుభరోసా లేక పెట్టుబడి సాయం కరువైన పరిస్థితుల్లో ఎందరో రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి సాయం చేయని కాంగ్రెస్ సర్కారే రైతుల ప్రాణాలను తీస్తున్నదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా బోగస్‌గా మారిందని దుయ్యబట్టారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రుణమాఫీ కాకపోవడంతో మేడ్చల్‌లో వ్యవసాయ కార్యాలయం సాక్షిగా సురేందర్‌రెడ్డి అనే రైతు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు భార్యాభర్తలిద్దరిలో ఒక్కరికీ రుణమాఫీ కాలేదన్న వేదనతో జగిత్యాలలో సాగర్‌రెడ్డి అనే రైతు పురుగుల మందు తాగి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ద్రోహానికి ఇంకా ఎందరు రైతులు ప్రాణాలను బలిపెట్టాలని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.49,500 కోట్ల రుణమాఫీలో పావుశాతం కూడా చేయకుండా చేతులెత్తేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి రైతన్నలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన ఢిల్లీ యాత్రలు బంద్‌జేసి రైతాంగం కన్నీళ్లు తుడవాలని హితవు పలికారు. హిందీని దేశంలోని అందరిపై రుద్దాలనుకోవడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. దేశంలో అధికారికంగా 22 భాషలు ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హిందీనే అందరికీ రుద్దాలనుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దేశంలోని 22 అధికారిక భాషల్లో హిందీ ఒకటని, ఎందుకు ఆ హిందీనే ఎక్కువగా మాట్లాడేలా ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు.

• తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



తాగునీటి కోసం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు చెందిన మహిళలు రోడ్డెక్కారు. బోరు మోటర్ మరమ్మతుకుగురై నెల రోజులవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, భగీరథ నీరు సైతం రావడం లేదంటూ గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. – పెద్దవంగర

• దళితబంధు లబ్ధిదారుల వినూత్న నిరసన



దళితబంధు రెండో విడత నిధుల కోసం పది నెలలుగా కలెక్టరేట్ చుట్టూ తిరిగినా ఫలితం లేదని దళితబంధు నిధుల సాధన సమితి హుజూరాబాద్ నియోజకవర్గ సభ్యులు మండిపడ్డారు. గురువారం వారు కరీంనగర్ జిల్లా వీణవంకలో మక్కజొన్న కంకులు అమ్ముకునే మహిళకు వినతిపత్రమిచ్చి నిరసన తెలిపారు. –వీణవంక

• పాలు పారబోసి పాడిరైతుల నిరసన



పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ గురువారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో పాడి రైతులు ధర్నా చేపట్టారు. జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెళ్తున్నారన్న విషయం తెలుసుకొని రైతులు రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపారు. – జడ్చర్ల

• సబ్ స్టేషన్ ఎదుట రైతుల ధర్నా



లోవోల్టేజీతో నెలకు నాలుగు సార్లు ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతున్నాయని, నీరు అందక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జనగామ జిల్లా పాలకుర్తిలోని విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. – పాలకుర్తి రూరల్

• కాల్వల ద్వారా సాగునీరు ఇవ్వాలని నిరసన



ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగునీరు అందించాలని సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన నిర్వహించారు. గురువారం వెలిశాల డీబీఎం వద్ద ధర్నా చేపట్టారు. – తిరుమలగిరి

బాత్రూం డోర్లు పగులగొట్టి విద్యార్థినులపై దాడి

- స్నానాలు లేటుగా చేస్తున్నారని పీఈటీ దౌర్జన్యం
- సిరిసిల్ల ట్రైబల్ వెల్ఫేర్ గురుకులంలో దారుణం
- విద్యార్థినుల ధర్నా.. పీఈటీనీ తొలగించిన డీఈవో రమేశ్



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలోని సిరిసిల్ల–సిద్దిపేట రహదారిపై బైఠాయించిన గిరిజన బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబర్ 12: రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలోని తెలంగాణ ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాల, కళాశాలలో దారుణం జరిగింది. విద్యార్థినులు ఆలస్యంగా స్నానాలు చేస్తున్నారనే నెపంతో వారిపై పీఈటీ జ్యోత్స్న విచక్షణారహితంగా దాడి చేసింది. అంతేకాదు.. బాత్‌రూంల డోర్‌లు పగులగొట్టి, స్నానపు గదుల్లోనే సెల్‌ఫోన్‌తో వీడియోలు తీస్తూ కర్రతో చితకబాదింది. దీంతో ఆగ్రహించిన విద్యార్థినులు గురువారం తెల్లవారుజామున కళాశాల నుంచి బయటకొచ్చి బద్దెనపల్లిలోని సిరిసిల్ల–సిద్దిపేట రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. తెల్లవారుజామున విద్యార్థులు ధర్నా చేయడంతో స్థానికులు మీడియా, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విద్యార్థినులను శాంతింపజేయడానికి ప్రయత్నించారు. పీఈటీని సస్పెండ్ చేయాలని, ఎక్కడా పనిచేయకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఎంఈవో రఘుపతి అక్కడికి చేరుకుని విద్యార్థులతో మాట్లాడి సమస్యను తెలుసుకున్నారు. వెంటనే డీఈవో రమేశ్‌కుమార్‌తో ఫోన్‌లో సమస్యను వివరించగా.. పీఈటీ జ్యోత్స్నను రిమూవ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారని డీఈవో తెలిపారు. అనంతరం విద్యార్థులు కళాశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. ఎంఈవో రఘుపతి పీఈటీ జ్యోత్స్నను రిమూవ్ చేశామని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌వీ, ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ, జై భీం ఆర్మీ సంఘాల నేతలు కళాశాలకు చేరుకుని ఆందోళన చేశారు. పీఈటీ జ్యోత్స్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రిన్సిపాల్‌ను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ సందర్శించారు. పాఠశాలలో సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని స్పెషల్ ఆఫీసర్, ప్రిన్సిపాల్‌కు సూచించారు. పోలీసులు పీఈటీ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్టు తెలిపారు.

తెలంగాణ బిడ్డలపై సర్కార్ కక్ష

- 'స్థానికత'పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైద్యారోగ్య శాఖ
- జీవో-33పై మొండిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో వేలాది మంది విద్యార్థులు ఆగం
- నిలిచిపోయిన ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియ

హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నమస్తే తెలంగాణ): డాక్టర్ కల సాకారం చేసుకోవాలనుకుంటున్న తెలంగాణ బిడ్డలపై రాష్ట్ర ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నది. 'స్థానికత' నిర్ధారణలో వైద్యారోగ్య శాఖ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెడుతున్నది. కనీస అధ్యయనం లేకుండా హడావుడిగా జీవో 33ని తీసుకొచ్చి విద్యార్థులకు అన్యాయం చేసిన ప్రభుత్వం.. దాన్ని సవరించుకోవాల్సింది పోయి మొండిగా వ్యవహరిస్తున్నది. తెలంగాణ విద్యార్థులకు నష్టం కలుగకుండా స్థానిక కోటా కింద అవకాశం కల్పించాలని, ఈ మేరకు నిబంధనలు రూపొందించాలని హైకోర్టు సూచించినా ప్రభుత్వం చెవికి ఎక్కలేదు. హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ గురువారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కేసును వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం వద్ద తెలంగాణ తరఫు న్యాయవాది ప్రతిపాదించారు. దీంతో త్వరగా విచారణకు తీసుకుంటామని సీజేఐ ధర్మాసనం తెలిపింది.

ఎన్నిసార్లు మొత్తుకున్నా చెవికెక్కించుకోలే..

స్థానికతను నిర్ధారించడంలో ప్రభుత్వం మొదటి నుంచీ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. తెలంగాణ, ఏపీ మధ్య ఈ ఏడాది జూన్ 2తో 'ఉమ్మడి' బంధం శాశ్వతంగా ముగిసిపోతున్న నేపథ్యంలో స్థానికతను నిర్ధారించుకోవాలన్న సూచనలను ప్రభుత్వం పట్టించుకోలేదు. మెడికల్ సీట్లలో ఉమ్మడి కోటాపై నిర్ణయం తీసుకోవాలని, స్థానికతను నిర్ధారించాలని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ నుంచి ఈ ఏడాది జనవరిలోనే వైద్యారోగ్య శాఖ కార్యదర్శికి లేఖ రాసినట్టు చెప్తున్నారు. ఆ తర్వాత వైద్యశాఖ అంతర్గత సమావేశాల్లోనూ పలుమార్లు ఈ అంశం ప్రస్తావనకు వచ్చినా 'చూద్దాం లే' అన్న ధోరణిలో వ్యవహరించారు. 'స్థానికత'ను నిర్ధారించాలని ఇతర యూనివర్సిటీలు, సాంకేతిక విద్యాశాఖ నుంచి సైతం ప్రభుత్వానికి విజ్ఞప్తులు అందాయి. కానీ పట్టించుకోలేదు. ఇంజినీరింగ్ ప్రవేశాల సమయంలోనూ ఉమ్మడి కోటాపై తర్జనభర్జనలు జరిగినా.. జూన్ 2వ తేదీకి ముందే అడ్మిషన్లు జరగడంతో కోటాను కొనసాగించారు. కానీ మెడికల్ సీట్లపై మాత్రం వైద్యారోగ్య శాఖ మీనమేషాలు లెక్కించింది. చివరికి పీకలమీదికి వచ్చిన తర్వాత జూలై 19న తూతూమంత్రంగా జీవో–33 ఇచ్చింది. వ్యతిరేకత వస్తుందన్న భయంతో జీవోను బహిర్గతం చేయకుండా రహస్యంగా ఉంచింది. రెండు వారాల తర్వాత అడ్మిషన్ల నోటిఫికేషన్‌తోపాటు విడుదల చేసింది. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు తెలంగాణలో చదివిన వారిని మాత్రమే 'స్థానికులు'గా గుర్తిస్తామని పేర్కొన్నది. దీంతో ఇతర రాష్ట్రాల్లో మంచి విద్యాసంస్థల్లో చదివినవారు, ఉద్యోగరీత్యా తల్లిదండ్రుల బదిలీలు, ఇతర కారణాల వల్ల ఇంటర్ వేరే రాష్ట్రంలో చదివిన తెలంగాణ విద్యార్థులు స్థానికేతరులుగా మారిపోయారు.

న్యాయం చేయాలన్న కోర్టు..
పట్టించుకోని వైద్యశాఖ

జీవో 33ను రద్దు చేయాలంటూ హైకోర్టులో 53 వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నెల 5న తీర్పు ఇచ్చింది. రాష్ట్రంలో శాశ్వత నివాసం ఉంటున్న స్థానికులకు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశాల్లో అవకాశం కల్పించాలని ఆదేశించింది. రాష్ట్రం బయట చదువుకున్నంత మాత్రాన స్థానికత వర్తించదనడం అన్యాయమని పేర్కొన్నది. ఒక విద్యార్థిని తెలంగాణ శాశ్వత నివాసిగా ఎలా గుర్తించాలో మార్గదర్శకాలు, నిబంధనలు లేవని గుర్తుచేసింది. హైకోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే వైద్యారోగ్య శాఖ సమీక్షించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. కానీ.. అలా జరగకుండా దాదాపు వారం రోజులు వృథా చేసి, చివరికి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కోర్టు తీర్పు వచ్చే వరకు అడ్మిషన్ల ప్రక్రియ నిలిచిపోయినట్టేనని వైద్య శాఖ వర్గాలు చెప్తున్నాయి. కనీసం హైకోర్టు తీర్పు వచ్చిన ఒకటి రెండు రోజుల్లో సుప్రీంకోర్టును ఆశ్రయించినా.. ఇప్పటివరకు ఏదో ఒకటి తేలిపోయేదని అంటున్నారు. రాష్ట్రంలో వైద్యవిద్య ప్రవేశాలు, దవాఖానల్లో వసతులను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం గత నెల 16వ తేదీన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. డీఎంఈ సభ్యకార్యదర్శిగా, డీఎంఈ (అకడమిక్), హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్, ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉన్నారు. తీర్పు వచ్చిన వెంటనే సమీక్షించకుండా టాస్క్‌ఫోర్స్ ఏం చేసిందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఏపీ ముందుచూపు..

స్థానికత నిర్ధారణలో ఏపీ ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. విద్యాసంస్థల్లో ప్రవేశాలకు స్థానికత, రిజర్వేషన్లపై అధ్యయనం చేసేందుకు ఈ ఏడాది ఫిబ్రవరిలోనే ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి చైర్మన్‌గా, ఎనిమిది మంది ఉన్నతాధికారులు, అడ్మిషన్ల రంగంలో నిపుణులు ఒకరిని సభ్యులుగా కమిటీని ఏర్పాటుచేసింది. స్థానికత, ఉమ్మడి కోటా అంశంపై నిపుణులు, విద్యార్థులు, అసోసియేషన్ల నుంచి అభిప్రాయాలు తీసుకొని నివేదిక సమర్పించింది. ఈ మేరకు ఏపీలో స్థానికతను నిర్ధారించారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఇటీవల విడుదల చేసిన ఎంబీబీఎస్, బీడీఎస్ నోటిఫికేషన్‌లో స్థానికతపై స్పష్టత ఇచ్చారు. వివిధ కారణాలతో స్థానికంగా ఇంటర్ చదవలేని వారికి 'ఏపీ నాన్‌లోకల్' స్టేటస్ ఇచ్చి, సీట్లలో కోటా ఇవ్వడంతో స్థానికతపై వివాదాలు తలెత్తలేదు.



హైకోర్టు ఆదేశించినా సీటు ఇవ్వరట!

- అన్ని అర్హతలున్నా స్పోర్ట్స్ కోటాలో ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి నిరాకరణ
- సాంకేతిక విద్యామండలి తీరుతో చెస్ క్రీడాకారుడు శ్రీశ్వాన్‌కు అన్యాయం

హైదరాబాద్, సెప్టెంబర్12(నమస్తే తెలంగాణ) : నిజామాబాద్ జిల్లా రెంజల్‌కు చెందిన శ్రీశ్వాన్ మరలాక్షరి వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్‌లో బ్రాంజ్, ఏసియన్ గేమ్స్‌లో గోల్డ్‌మెడల్స్ సాధించాడు. ఇటీవల ఎంసెట్‌లో 15వేల ర్యాంకు రాగా, స్పోర్ట్స్ కోటాలో టాప్ కాలేజీలో సీటు వస్తుందని కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు. కానీ, సాంకేతిక విద్యామండలి తిరస్కరించింది. హైకోర్టును ఆశ్రయించగా స్పోర్ట్స్ కోటాకు అర్హుడని ఆదేశాలిచ్చింది. అయినా అధికారులు పట్టించుకోకుండా టాప్ కాలేజీల్లో సీట్లు భర్తీ అయ్యాయని, తక్కువస్థాయి కాలేజీల్లో సీటు ఇస్తామని మెలికపెడుతున్నట్టు శ్రీశ్వాన్ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్‌జీఎఫ్‌లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటాలో టాప్ కాలేజీల్లో సీటు ఇచ్చారని ఆరోపించారు. తమ కుమారుడికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

• బిల్లు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్





కామారెడ్డి జిల్లా చిన్నమల్లారెడ్డిలోని ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ పాండురంగారావు రూ.55 లక్షలు వెచ్చించి అదనపు తరగతి గదులు నిర్మించారు. అప్పు చేసి పనులు పూర్తిచేసినా బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురైన కాంట్రాక్టర్.. గురువారం గదులకు తాళం వేశారు. దీనిపై డీఈవో రాజును వివరణ కోరగా.. ప్రభుత్వం మారడంతో బిల్లులకు ఆలస్యమైందని, ప్రభుత్వానికి నివేదిక పంపి బిల్లు చెల్లించేలా చూస్తామని తెలిపారు. – కామారెడ్డి

• బడిలోకి దూరిన మొసలి



జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం గుడ్డెందొడ్డి పాఠశాలలోకి గురువారం భారీ మొసలి వచ్చింది. రైతుల ద్వారా సమాచారం అందుకున్న అటవీ అధికారులు అక్కడికి వచ్చి మొసలిని బంధించి జూరాల డ్యాంలో వదిలిపెట్టారు. – ధరూరు

• బోయినిపేటలో పునుగు పిల్లి



పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలో పునుగుపిల్లి సంచరిస్తుంది. బుధవారం రాత్రి మూగ ప్రకాశ్ అనే యువకుడు తాను పెంచుకుంటున్న కోళ్ల బోనులోకి వెళ్లిన ఈ పునుగు పిల్లి కోళ్లను చంపుకొని తిని అందులోనే చిక్కుకు పోయింది. స్థానికుల ఫిర్యాదు మేరకు అటవీ అధికారులు దాన్ని పట్టుకొని అడవిలో సురక్షితంగా వదిలి పెట్టారు. – మంథని

'మా ఉద్యోగాలను పర్మినెంట్ చేయండి'

- తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ
- సుప్రీం తీర్పును అమలుచేయాలని డిప్యూటీ సీఎంకు వినతి

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 12: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ నాయకులు గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీల అభివృద్ధిలో తమ పాత్రనే ఎక్కువగా ఉన్నదని, ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా వర్సిటీల్లో అమలు కావడం లేదన్నారు. తక్షణమే ఉద్యోగాలను పర్మినెంట్ చేసి, తమ కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు పీ సురేశ్, రాము మైలారం, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న వర్సిటీల నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జేఏసీ ప్రతినిధులు

చేపపిల్లలను పంపిణీ చేయాలి

- మత్స్యశాఖ కమిషనరేట్ ఎదుట బైఠాయించిన మత్స్యకారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 12(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేపపిల్లల పంపిణీ ప్రారంభించాలని, లేనిపక్షంలో లక్షమందితో సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని మత్స్యకారులు హెచ్చరించారు. మత్స్యశాఖ కమిషనరేట్ భవనం ఎదుట మత్స్యకారులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకార సంఘం నేత రంజిత్ ముదిరాజ్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఓ వైపు చెరువులు, కుంటలు కబ్జా చేస్తే ఊరుకోబోమంటూ హైడ్రా పేరుతో డ్రామా చేస్తున్నారని, మరో వైపు అవే చెరువులు, కుంటలపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులను నాశనం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని మండిపడ్డారు. చేపల సీడ్‌ను 100శాతానికి పెంచి వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

దసరాకు 'విశ్వంభర' టీజర్



అగ్ర కథానాయకుడు చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. 'బింబిసార' ఫేమ్ వశిష్ట సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఓ దైవిక కార్యం నెరవేర్చడానికి భువిపై అడుగుపెట్టిన కారణజన్ముడికి, విశ్వంభర అనే లోకానికి మధ్య ఉండే సంబంధం, కార్యసాధనలో తను చేసే ప్రయాణం నేపథ్యంలో ఆద్యంతం సాహసం, సంభ్రమం కలబోతగా దర్శకుడు వశిష్ట ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులను ఓ సరికొత్త ప్రపంచంలో విహరింపజేసే చిత్రమిదని, విజువల్ ఎఫెక్ట్స్ ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ అంటున్నారు. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. ఈ నేపథ్యంలో టీజర్ ఎప్పుడొస్తుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం అక్టోబర్ 12న దసరా పర్వదినం సందర్భంగా టీజర్‌ను రిలీజ్ చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఇందులో ప్రేక్షకులకు విశ్వంభర ప్రపంచాన్ని పరిచయం చేస్తారని చెబుతున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.



సిల్లీ విషయాలు పట్టించుకోను

'ఇండస్ట్రీలో ఒక స్టార్‌కిడ్‌కు లభించినంత తేలిగ్గా మిగతావాళ్లకు అవకాశాలు రావు. అది వాళ్ల గొప్పతనం కాదు. వారి తల్లిదండ్రుల కష్టం.' అన్నారు ఢిల్లీ భామ రకుల్ ప్రీత్‌సింగ్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో నెపోటిజానికి సంబంధించిన ప్రశ్న రకుల్‌కి ఎదురైంది. దీనిపై ఆమె ఆసక్తికరంగా స్పందించారు. 'ఇండస్ట్రీలో బంధుప్రీతి ఉన్న మాట వాస్తవం. దీనివల్ల అవకాశాలు కోల్పోయిన వారిలో నేనూ ఒకదాన్ని. అయితే.. నేను సైనికుడి కూతుర్ని. నాన్న సలహాలు, సూచనలతో ఎదిగిన దాన్ని. సిల్లీ విషయాల గురించి ఆలోచించి సమయం వృథా చేసుకునే తత్వం కాదు నాది. అవకాశాలు కోల్పోవడం జీవితంలో ఓ భాగం. ఆ సినిమాలు మనవి కావు.. అనుకొని ముందుకు సాగా. ఏం చేస్తే వ్యక్తిగతంగా ఎదుగుతానో దానిపై శ్రద్ధ పెట్టా. ఆ వ్యక్తిత్వమే నన్ను నిలబెట్టింది. గొప్ప పాత్రలు పోషించేలా చేసింది' అంటూ చెప్పుకొచ్చింది రకుల్. ప్రస్తుతం ఆమె అజయ్‌దేవగణ్‌తో 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నది.



ఆ పాటలో నటించే తార ఎవరు?

'పుష్ప2' డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతున్న కారణంగా నిర్మాణం విషయంలో దర్శకుడు సుకుమార్ వేగం పెంచారు. ఇప్పటికే ఫస్టాఫ్ ఎడిటింగ్ వర్క్ పూర్తయిందని తెలుస్తున్నది. ఇక సెకండాఫ్‌కు సంబంధించిన ఓ ఐటమ్ పాటతో సహా 20 రోజులు వర్క్ పెండింగ్‌లో ఉందని సమాచారం. ఫహాద్ ఫాజల్‌కు సంబంధించిన కీలకసన్నివేశాలు ఈ 20రోజుల్లోనే పూర్తిచేస్తారట. ఐటమ్ సాంగ్ రికార్డింగ్ పూర్తయిందనీ, చిత్రీకరణ మాత్రం బ్యాలెన్స్ ఉందని, ఈ పాటలో నటించే తార ఎవరు? అనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని యూనిట్‌వర్గాలు చెబుతున్నాయి. వచ్చే నెల తొలివారం నాటికి షూటింగ్ వర్కంతా పూర్తి చేయాలనే దృఢ నిశ్చయంతో సుకుమార్ ఉన్నారట. మొత్తంగా అల్లు అర్జున్ అభిమానులకు ఈ సినిమా విందుభోజనంలా ఉంటుందని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. మైత్రీమూవీమేకర్స్ పతాకంపై ఈ సినిమా తెరకెక్కుతున్న విషయం తెలిసిందే.

పీరియాడికల్ మట్కా



వరుణ్‌తేజ్ నటిస్తున్న పీరియాడికల్ పాన్‌ఇండియా మూవీ 'మట్కా'. కరుణకుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్ ఆర్‌ఎఫ్‌సీలో శరవేగంగా జరుగుతున్నది. కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుపుకునే ఈ షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ పార్ట్ మొత్తం పూర్తవుతుంది. ఈ సినిమాలో వరుణ్ డిఫరెంట్ మేకోవర్‌లో కనిపించనున్నారని, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సాఫీగా జరుగుతున్నాయనీ, ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికరమైన మరిన్ని వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్‌చంద్ర, సలోని, అజయ్‌ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్రవిజయ్, పి.రవిశంకర్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.కిశోర్‌కుమార్, సంగీతం: జి.వి.ప్రకాశ్‌కుమార్, నిర్మాణం: వైరా ఎంటర్టైన్మెంట్స్, ఎస్.ఆర్.టి. ఎంటర్టైన్మెంట్స్.

సూపర్‌హీరోల ప్రేమకథ



'నాకు గొప్ప జీవితాన్నివ్వడానికి నాన్న పడ్డ కష్టం నాకు తెలుసు. అందుకే.. సుధీర్‌బాబు సన్నాఫ్ పోసాని నాగేశ్వరరావు అని చెప్పుకోడానికి గర్విస్తా. ఇది సూపర్‌హీరో సినిమా కాదు. కానీ ఆ సినిమాల్లో హీరోలకి వుండే సూపర్ పవర్ ఈ సినిమాలో ఉంటుంది. ఆ పవర్ పేరే ప్రేమ. ఇద్దరు సూపర్‌హీరోల మధ్య సాగే ప్రేమకథ ఇది. నా కెరీర్ మొత్తంలో నటుడిగా నాకు తృప్తినిచ్చిన సినిమా కూడా ఇదే. దర్శకుడు అభిలాష్ కంకర అద్భుతంగా తీశాడు. కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది' అని సుధీర్‌బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'మా నాన్న సూపర్‌హీరో'. అర్ణ, సాయిచంద్, షాయాజీ షిండే కీలక పాత్రధారులు. సునీల్ బలుసు నిర్మాత. అక్టోబర్ 11న సినిమా విడుదల కానుంది. గురువారం జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ కార్యక్రమంలో సుధీర్‌బాబు మాట్లాడారు. సుధీర్‌బాబు తండ్రిగా నటించడం పట్ల నటుడు షాయాజీ షిండే ఆనందం వెలిబుచ్చారు. ఈ సినిమాలో భాగం కావడం ఆనందంగా ఉందని హీరోయిన్ అర్ణ అన్నారు. ఇంకా దర్శకుడు అభిలాష్ కంకర, నటుడు శశాంక్, సంగీత దర్శకుడు జై క్రిష్ కూడా మాట్లాడారు. రాజు సుందరం, ఆమని ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సమీర్ కల్యాణి, నిర్మాణం: వి.సెల్యులాయిడ్స్.

వరద బాధితులకు విరాళం



ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో సంభవించిన వరదల వల్ల భారీగా ఆస్తి, ప్రాణనష్టం జరిగిన విషయం తెలిసిందే. వేలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. బాధితులను ఆదుకునేందుకు ఇప్పటికే పలువురు సినీ తారలు భారీ విరాళాలతో ముందుకొచ్చారు. వరద బాధితులకు అండగా ఉండేందుకు తెలుగు టెలివిజన్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ముందుకొచ్చింది. సభ్యులు అందించే విరాళాలతో పాటు అసోసియేషన్ ఫండ్ నుంచి కొంత జతచేసి రెండు రాష్ట్రాలకు 15 లక్షల వరకు విరాళాల్ని అందించబోతున్నామని తెలుగు టెలివిజన్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్ రావు తెలిపారు. ఎలాంటి ప్రకృతి విపత్తులు జరిగినా సహాయం అందించడానికి తమ అసోసియేషన్ ముందుంటుందని సెక్రటరీ వినోద్‌బాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నటుడు, నిర్మాత ప్రభాకర్, శ్రీరామ్ పాల్గొన్నారు.

హిట్ పాటల రచయిత
గురుచరణ్ కన్నుమూత



ప్రముఖ గీత రచయిత గురుచరణ్(77) గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. గురుచరణ్ అసలు పేరు మానాపురపు రాజేంద్రప్రసాద్. అలనాటి ప్రముఖనటి ఎం.ఆర్. తిలకం, అలనాటి ప్రముఖ దర్శకుడు మానాపురం అప్పారావుల కుమారుడే గురుచరణ్. ఎం.ఏ పట్టభద్రుడైన గురుచరణ్.. ప్రఖ్యాత రచయిత ఆచార్య ఆత్రేయ దగ్గర కొన్నాళ్లు శిష్యరికం చేశారు. రెండు వందలకు పైగా పాటలు రాశారు. ముఖ్యంగా నటుడు మోహన్‌బాబుకు అద్భుతమైన పాటలు రాశారు గురుచరణ్. 'ముద్దబంతి నవ్వులో మూగబాసలు..', 'కుంతీకుమారి తన జోరుజారి', 'బోయవాని వేటుకు గాయపడిన కోయిలా..' పాటలు ఇప్పటికీ శ్రోతలను అలరిస్తూనే ఉన్నాయి. గురుచరణ్ మరణం తెలుగు చిత్రపరిశ్రమకు నిజంగా తీరని లోటు. ఆయన కుటుంబ సభ్యులకు తెలుగు చిత్ర పరిశ్రమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

ప్రకృతి నేపథ్య కథాంశంతో..



ఆదిత్య ఓం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బందీ'. తిరుమల రఘు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ నేపథ్య కథాంశంతో రూపొందిస్తున్నారు. గురువారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకనిర్మాత రఘు తిరుమల మాట్లాడుతూ 'కేవలం ఒకే ఒక్క పాత్రతో ఈ సినిమా చేశాం. హీరో ఆదిత్య వర్మ అనే పాత్రలో కనిపిస్తాడు. ప్రకృతిని నాశనం చేస్తున్న కార్పొరేట్ కంపెనీలకు దన్నుగా నిలిచే లీగల్ అడ్వైజర్ అయిన ఆదిత్యవర్మను ఓ అడవిలో వదిలేస్తే ఏం జరిగింది? అతను తన తప్పులను తెలుసుకొని ప్రకృతి నుంచి ఏం నేర్చుకున్నాడన్నదే ఈ చిత్ర కథాంశం. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వీరల్, లవన్, సుదేష్ సావంత్, నిర్మాతలు: వెంకటేశ్వరావు దగ్గు, రఘు తిరుమల.

శేఖర్‌కమ్ముల దర్శకత్వంలో నాని ?





టాలీవుడ్‌లో ఎప్పటికప్పుడు కొత్త కొత్త కాంబినేషన్లు షూరు అవుతుండటం పరిపాటే. శేఖర్‌కమ్ముల దర్శకత్వంలో నాని నటించనున్నట్టు ఓ వార్త ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతున్నది. ప్రస్తుతం శేఖర్‌కమ్ముల 'కుబేర' సినిమాతో బిజీగా ఉన్నారు. ధనుష్ హీరోగా, నాగార్జున ప్రత్యేకపాత్రలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. సాధారణంగా ఓ సినిమా చేస్తున్నప్పుడు శేఖర్‌కమ్ముల మరో సినిమాపై దృష్టి పెట్టరు. అయితే.. శేఖర్ తన పంథా మార్చారని, ఏకకాలంలో రెండు మూడు కథల్ని సిద్ధం చేస్తున్నారని, ఈ క్రమంలోనే ఆయన నానికోసం కథ రెడీ చేసినట్టు సమాచారం. నాని కూడా శేఖర్ దర్శకత్వంలో నటించేందుకు ఉత్సాహం చూపిస్తున్నారట. ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయికగా నటిస్తే బావుంటుందని శేఖర్‌కమ్ముల భావిస్తున్నట్టు వినికిడి. శేఖర్‌కమ్ములతో ఇప్పటికే సాయిపల్లవి రెండు సినిమాలు చేసింది. అలాగే నానితో ఎంసీఏ, శ్యాంసింగరాయ్ సినిమాలు చేసింది. ఈ ప్రాజెక్ట్ ఓకే అయితే.. నాని, శేఖర్‌కమ్ములతో సాయిపల్లవి పనిచేసే మూడో సినిమా ఇదే అవుతుంది.



ఫ్యామిలీ అంతా చూడాల్సిన సినిమా

రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భలే ఉన్నాడే'. జె.శివ సాయి వర్ధన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎన్.వి.కిరణ్ నిర్మిస్తున్నారు. దర్శకుడు మారుతి సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. బుధవారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఎప్పుడో వచ్చిన తన ఆలోచనను దర్శకుడు శివ సాయికి చెబితే.. దానిని అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చాడని, ఫ్యామిలీస్ అందరూ చూసి ఆనందించే చిత్రమిదని మారుతి అన్నారు. ఆద్యంతం వినోదభరితంగా సాగే చిత్రమిదని హీరో రాజ్‌తరుణ్ తెలిపారు. రెండున్నర గంటలు హాయిగా నవ్వుకొని థియేటర్ నుంచి బయటకొస్తారని, ఎమోషనల్‌గా కూడా ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుందని దర్శకుడు శివసాయి వర్ధన్ పేర్కొన్నారు. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నామని నిర్మాత కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

గీతా శంకరం స్వచ్ఛమైన ప్రేమ



ముఖేష్‌గౌడ్, ప్రియాంక శర్మ జంటగా రూపొందుతోన్న ప్రేమకథాచిత్రం 'గీతా శంకరం'. రుద్ర దర్శకత్వంలో కె.దేవానంద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం బెంగళూరులో జరుగుతున్నది. మరోవైపు ఈ సినిమా పాటల రికార్డింగ్‌ని పూర్తి చేశారు. మంచి కంటెంట్‌తో తెరకెక్కుతున్న చిత్రమిదని, భావోద్వేగాలతో కూడుకున్న స్వచ్ఛమైన ప్రేమకథగా ఈ సినిమా రూపొందుతున్నదని, త్వరలో ప్రమోషన్స్ మొదలుపెడతామని నిర్మాత తెలిపారు. కొత్తదనంతో కూడుకున్న ప్రేమకథ ఇదని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ ధూపాటి, సంగీతం: అభు. పాటలు: చంద్రబోస్, నిర్మాణం: ఎస్ఎస్ఎంజీ ప్రొడక్షన్స్.

నమస్తే తెలంగాణ



పారాలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసి రికార్డు స్థాయిలో పతకాలు(29) సాధించిన భారత పారా క్రీడాకారుల బృందంతో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేకంగా భేటీ అయి వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా అథ్లెట్లు తమ అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు. ఈ క్రీడల్లో కాంస్యం గెలిచిన తెలంగాణ అథ్లెట్ దీప్తీ జివాంజీని అభినందిస్తున్న మోదీ.

నేటి నుంచే డైమండ్ లీగ్

అందరి దృష్టి నీరజ్ పైనే..

బ్రస్సెల్స్ (బెల్జియం): ఒలింపిక్స్ ముగిసిన కొద్దిరోజుల తర్వాత ప్రపంచ టాప్ అథ్లెట్లు అంతా మళ్లీ పోటీలకు సిద్ధమయ్యారు. బెల్జియంలోని బ్రస్సెల్స్ వేదికగా శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరిగే డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో అథ్లెట్లు మరోసారి తమ విన్యాసాలతో అలరించనున్నారు. 32 క్రీడాంశాలలో వందలాది మంది స్టార్ అథ్లెట్లు బరిలోకి దిగనున్నారు. భారత్ నుంచి డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా, స్టీపుల్ ఛేజ్ రన్నర్ అవినాశ్ సాబ్లే అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. డైమండ్ లీగ్ ఫైనల్స్‌లో ఇద్దరు భారతీయ అథ్లెట్లు పోటీపడనుండటం ఇదే ప్రథమం. 2022 డైమండ్ లీగ్ ఫైనల్స్ గెలిచి 2023లో రెండో స్థానంలో నిలిచిన నీరజ్.. ఈ ఏడాదీ సత్తా చాటాలని భావిస్తున్నాడు.

వ్రితి డబుల్ ధమాకా



హైదరాబాద్, ఆట ప్రతినిధి: మంగళూరు(కర్నాటక) వేదికగా జరుగుతున్న 77వ జాతీయ సీనియర్ అక్వాటిక్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర యువ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ పతక జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన వేర్వేరు విభాగపు పోటీల్లో వ్రితి స్వర్ణ, రజత పతకాలతో మెరిసింది. తొలుత జరిగిన మహిళల 800మీ ఫ్రీస్టయిల్ రేసును వ్రితి 9:16:14 సెకన్ల టైమింగ్‌తో ముగించి స్వర్ణాన్ని ఖాతాలో వేసుకుంది. ఈతకొలనులో తనకు తిరుగులేదని మరోమారు నిరూపిస్తూ జాతీయ టోర్నీలో పతకాల పంట పండిస్తున్నది. ఇదే విభాగంలో భవ్య సచ్‌దేవ(ఢిల్లీ), శ్రీచరణి(కర్నాటక) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మరోవైపు 200మీ బటర్‌ఫ్లై ఈవెంట్‌లో వ్రితి రజతం దక్కించుకుంది.



ఇషాన్ సెంచరీ

అనంతపూర్: టీమ్‌ఇండియా యువ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ దేశవాళీ సీజన్‌లో తన పునరాగమనాన్ని ఘనంగా చాటాడు. అనంతపూర్ (ఆంధ్రప్రదేశ్) వేదికగా జరుగుతున్న దులీప్ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లో భాగంగా అతడు సెంచరీతో కదం తొక్కాడు. రెండో మ్యాచ్‌లో అతడు ఇండియా 'సీ' తరపున ఆడుతూ 126 బంతుల్లోనే 14 బౌండరీలు, 3 భారీ సిక్సర్లతో 111 పరుగులు చేశాడు. కిషన్ దూకుడుకు తోడు బాబా ఇంద్రజీత్ (78), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (46 నాటౌట్), సాయి సుదర్శన్ (43) రాణించడంతో తొలి రోజు ఆటముగిసే సమయానికి 'సీ' జట్టు 79 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 357 పరుగులు చేసింది.

ఆదుకున్న ములానీ

ఇండియా 'బీ' బౌలర్ల ధాటికి పీకల్లోతు కష్టాల్లో చిక్కుకున్న ఇండియా 'ఏ'ను షామ్స్ ములానీ (88 నాటౌట్) ఆపద్బాంధవుడిగా నిలిచాడు. హర్షిత్ రాణా, విద్వత్ కరియప్ప, అర్ష్‌దీప్‌సింగ్ తలా రెండు వికెట్లు తీయడంతో 93 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన 'ఏ' జట్టును ములానీ, తనుష్ కొటియన్ (53) ఆదుకున్నారు.

త్వరలో స్పోర్ట్స్‌పాలసీ

శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: క్రీడారంగ సమూల అభివృద్ధి కోసం త్వరలో స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామని శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'శాట్స్ కార్యక్రమాలు రాష్ట్ర మంతా విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నాం. ముఖ్యంగా గ్రామీణ క్రీడారంగానికి ప్రాధాన్యం ఇచ్చేందుకు నూతన పాలసీని తీసుకురాబోతున్నాం. ఇందులో భాగంగా ప్రతీ లోక్‌సభ నియోజకవర్గంలో మినీ స్టేడియం ఏర్పాటు చేస్తున్నాం. దీనికి తోడు మరో మూడు స్పోర్ట్స్ స్కూల్‌ను స్థాపించబోతున్నాం. వీటన్నింటినీ స్పోర్ట్స్ యూనివర్సిటీ అనుసంధానం చేస్తాం. హైదరాబాద్‌ను



స్పోర్ట్స్ హబ్‌గా మార్చే క్రమంలో నగరంలో ఉన్న ప్రతీ స్టేడియాన్ని పునరుద్ధరిస్తాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన వారికి తగిన ప్రోత్సాహలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. క్రీడాభివృద్ధిలో కార్పొరేట్ కంపెనీలను భాగస్వామ్యం చేసేందుకు చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

షూటింగ్‌లో అదరగొడుతున్న ధనుశ్ శ్రీకాంత్

తిరుగులేని గురి..



ప్రపంచ బధిర షూటింగ్ టోర్నీలో పసిడి వేట

ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూపులు

అంతర్జాతీయ క్రీడా వేదికపై మరో తెలంగాణ క్రీడా తార తళుక్కుమంది. తన గురికి తిరుగులేదని నిరూపిస్తూ యువ షూటర్ ధనుశ్ శ్రీకాంత్ పసిడి కాంతులు విరజిమ్మాడు. జర్మనీలో ఇటీవలే జరిగిన ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో సరికొత్త రికార్డులతో స్వర్ణ పతకాలు కొల్లగొట్టాడు. వినికిడి లోపమున్నా..సాధారణ షూటర్లకు ఏమాత్రం తీసిపోని ధనుశ్ పతక వేటలో దూసుకెళుతున్నాడు. 14 ఏండ్ల ప్రాయంలో షూటింగ్ మొదలుపెట్టిన ఈ చిచ్చరపిడుగు డెఫ్ ఒలింపిక్స్, డెఫ్ ప్రపంచ చాంపియన్‌షిప్ లాంటి ప్రతిష్టాత్మక టోర్నీల్లో మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించాడు. లాస్ ఏంజిల్స్(2028) ఒలింపిక్స్ తన లక్ష్యమంటున్న ధనుశ్.. ఆ దిశగా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నాడు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన ఈ యువ షూటర్ ప్రభుత్వ ప్రోత్సాహం కోసం ఎదురుచూస్తు న్నాడు. మద్దతిస్తే మరిన్ని అద్భుతాలు సాధిస్తానంటున్న ధనుశ్‌పై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనం.

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

తెలంగాణలో ప్రతిభ కల్గిన క్రీడా కారులకు కొదువలేదు. వెన్నుతట్టి ప్రోత్సహించాలే కానీ..అద్భుతాలు సృష్టించే ప్లేయర్లు కోకొల్లలు. ఇప్పుడే ఇదే కోవలోకి వచ్చాడు యువ షూటర్ ధనుశ్ శ్రీకాంత్. పుట్టుకతోనే వినికిడి సమస్యతో జన్మించిన ధనుశ్ ఏనాడు నిరాశకు లోనుకాలేదు. ప్రతిభకు వైకల్యం అడ్డుకాదని చేతల్లో చూపిస్తూ షూటింగ్‌లో దేశ ప్రతిష్టను ఇనుమడింపజేస్తున్నాడు. ఇటీవలే జర్మనీలో జరిగిన ప్రపంచ డెఫ్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణ పతకాలు సాధించిన నేపథ్యంలో ధనుశ్ ప్రస్థానంపై అతని తల్లి ఆశా శ్రీకాంత్ పలు అంశాలు పంచుకుంది.

పసి ప్రాయం నుంచే :

పువ్వు పుట్టగానే పరిమళించింది అన్నట్లు పసి ప్రాయం నుంచే ధనుశ్ క్రీడల పట్ల అమితాసక్తి ప్రదర్శించాడు. స్కూల్‌లో నిర్వహించే ప్రతీ క్రీడా పోటీల్లో పతకంతో వచ్చేవాడు. అతని ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు మూడో తరగతిలో ఉన్నప్పుడే తైక్వాండోలో చేర్పించారు. ఇంట్లో సరదాగా బొమ్మ తుపాకీతో గంటల తరబడి ధనుశ్ ప్రాక్టీస్ చేసేవాడని తల్లి ఆశ తెలిపింది. అతని ఆసక్తిని గమనించిన పేరెంట్స్ 2015లో గగన్ నారంగ్‌కు చెందిన 'గన్ ఫర్ గ్లోరీ' అకాడమీలో చేర్పించారు. ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూసుకోలేదు. 2019లో జరిగిన తెలంగాణ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో 400కు 400 షూట్ చేసిన తొలి షూటర్‌గా శ్రీకాంత్ రికార్డు నెలకొల్పాడు.

గురువుకు తగ్గ శిష్యుడు:

లండన్ ఒలింపిక్స్ కాంస్య విజేత గగన్ నారంగ్‌కు తగిన శిష్యుడని ధనుశ్ నిరూపించుకుంటున్నాడు. గురువుకు తగ్గట్లే 10మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో పతకాల పంట పండిస్తున్నాడు. కెరీర్ మొదలుపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు వేర్వేరు అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో 13 పతకాలు సాధించాడు.

ప్రపంచ రికార్డులతో స్వర్ణాలు:

ప్రపంచ డెఫ్ షూటింగ్ టోర్నీలో ధనుశ్ 10మీ ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో రెండు ప్రపంచ రికార్డులు(632.7, 251.7) తన పేరిట లిఖించుకున్నాడు. వ్యక్తిగత విభాగంతో పాటు మిక్స్‌డ్ కేటగిరీలో భారత్‌కు రెండు పసిడి పతకాలు అందించాడు. ఇదే జోరుతో 2028లో లాస్‌ఏంజిల్స్ ఒలింపిక్స్ లక్ష్యంగా ధనుశ్ ముందుకెళ్తాడని ధనుశ్ తల్లి పేర్కొంది.

ప్రభుత్వ ప్రోత్సాహం కోసం:

అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తున్న ధనుశ్‌ను ఆర్థిక సమస్యలు వెంటాడుతున్నాయి. ఖరీదైన క్రీడ అయిన షూటింగ్‌లో రాణించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆశ పేర్కొంది. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే..భవిష్యత్‌లో దేశానికి ధనుశ్ మరిన్ని పతకాలు తీసుకొస్తాడని ఆమె తెలిపింది.

ప్రిక్వార్టర్స్‌లో ఓడిన త్రిసా జోడీ

హాంకాంగ్: భారత బ్యాడ్మింటన్ మహిళల డబుల్స్ జోడీ త్రిసా జాలీ, గాయత్రి గోపీచంద్.. హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రిక్వార్టర్స్‌లో ఓటమిపాలైంది. ప్రిక్వార్టర్స్‌లో భారత జోడీ.. 11-21, 20-22తో లియు షెంగ్ - టాన్ నింగ్(చైనా) చేతిలో ఓడింది. తొలి గేమ్‌లో ప్రత్యర్థి దూకుడుకు చిత్తైన మన అమ్మాయిలు.. రెండో గేమ్‌లో హోరాహోరీగా పోరాడినా ఫలితం వారికి అనుకూలంగా రాలేదు.

ఆసీస్ బోణీ

రాణించిన ట్రావిస్ హెడ్

సౌతంప్టన్ (ఇంగ్లండ్): ఇంగ్లండ్ పర్యటనను ఆస్ట్రేలియా గెలుపుతో ఆరంభించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా సౌతాంప్టన్ వేదికగా ముగిసిన తొలి మ్యాచ్‌లో కంగారూలు.. 28 పరుగుల తేడాతో ఇంగ్లిష్ జట్టును ఓడించారు. మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్.. 19.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌట్ అయింది. విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 59, 8 ఫోర్లు, 4 సిక్సర్లు), మాథ్యూ షార్ట్ (26 బంతుల్లో 41, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడారు. జోష్ ఇంగ్లిస్ (37) కూడా వేగంగా ఆడటంతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది. అనంతరం ఛేదనలో ఆతిథ్య జట్టు 19.2 ఓవర్లలో 151 పరుగులకే ఆలౌట్ అయింది. ఇంగ్లండ్ రెగ్యులర్ కెప్టెన్ జోస్ బట్లర్ గైర్హాజరీలో సారథ్య పగ్గాలు అందుకున్న ఫిల్ సాల్ట్ (20) బ్యాటింగ్‌లో విఫలమయ్యాడు. లివింగ్‌స్టోన్ (27 బంతుల్లో 37, 4 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోరు చేయగా మిగిలినవారూ చేతులెత్తేశారు. ఆసీస్ బౌలర్లలో సీన్ అబాట్ (3/28) మూడు వికెట్లు తీయగా జంపా, హెజిల్‌వుడ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు.

భారత్ జోరు

హులన్‌బుయిర్ (చైనా): ఏషియన్ చాంపియన్స్ హాకీ ట్రోఫీలో భారత్ విజయ పరంపర దిగ్విజయంగా కొనసాగుతోంది. లీగ్ దశలో ఇప్పటికే మూడు మ్యాచ్‌లను భారీ తేడాతో గెలిచిన మెన్ ఇన్ బ్లూ.. గురువారం జరిగిన మ్యాచ్‌లో 3-1తో దక్షిణ కొరియాను ఓడించింది. అరేజిత్ సింగ్ (8వ నిమిషంలో) తొలి క్వార్టర్‌లోనే గోల్ చేయగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 9, 43వ నిమిషాలలో రెండు గోల్స్ సాధించాడు. సౌత్ కొరియా నుంచి యంగ్ జిహున్ ఒక్కడే 30వ నిమిషంలో గోల్ చేశాడు.